


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital


**బడా టెర్రరిస్టు బాగుఖాన్ హతం**

**ట్రంప్ అనారోగ్యంపై సోషల్ మీడియాలో వైరల్**

5లో


Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-8-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 210 పేజీలు: 10+4 వెల: 8.00




# 'కాళేశ్వరం' అగ్గి!

**నేడు అసెంబ్లీకి జస్టిస్ ఘోష్ నివేదిక**

**సభకు బిసి కోటా బిల్లు కూడా..**

**రెండు అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగే అవకాశం**

**బిఆర్ఎస్ పిపిపిపై నిర్ణయం చెప్పని స్పీకర్**

**హైదరాబాద్,ఆగస్టు 30,ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్‌ఇరిగేషన్ వైఫల్యం,మేడిగడ్డ బ్యారేజి కుంగుబాటుపై పిసిఘోష్ ఇచ్చినివేదిక ఆదివారం జరిగే అసెంబ్లీలో అగ్గిరాజేయబోతున్నది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 9గంటలకు శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికను బహిర్గతం చేసే విషయంలో ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకెళ్తాంది. ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు, పార్టీల విమర్శలు, ప్రతి విమర్శలు, కోర్టు కేసులు, ఇలా అన్నింటికి ఈ సమావేశాల్లోనే జవాబు చెప్పేందుకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బలంగా వాదిస్తూ అసెంబ్లీ రికార్డుల్లోకి ఎక్కించాలనేది అధికార పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. ఇలా నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని భావిస్తోంది.ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళిక, నాణ్యత, నిర్వహణ విషయాల్లో నిర్లక్ష్యం కారణంగానే మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిందని, ఈప్రాజెక్టు పరిధిలో నీటిని >>2

**కమిషన్ నివేదికపై మరోమారు హైకోర్టును ఆశ్రయించిన హరీష్ రావు** 2లో





## కోదండరామ్ అజారుద్దీన్

**గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు కేబినెట్ ఆమోదించిన పేర్లు**

**అమీర్ అలీఖాన్‌కు బదులుగా అజార్ ఎంపిక**

**సుప్రీం నిలిపివేతతో తిరిగి గవర్నర్‌కు నివేదన**

**హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త:**గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఇద్దరి పేర్లకు తెలంగాణ కేబినెట్ శనివారం ఆమోదం తెలిపింది. అయితే ఈ వ్యవహారంలో చివరి నిమిషంలో అనూహ్యమైన మార్పు చోటు చేసుకుంది. ఎమ్మెల్సీ రేసు నుంచి అనూహ్యంగా మీర్ అమీర్ అలీఖాన్ను తప్పించింది కాంగ్రెస్ హైకమాండ్.ప్రొఫెసర్ కోదండరాంతో పాటు అమీర్ అలీఖాన్ స్థానంలో మాజీ క్రికెటర్, మాజీ ఎంపీ మహ్మద్ అజహరుద్దీన్ ను ఎంపిక చేసింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కోదండరామ్, అజహరుద్దీన్ పేర్లను పరిశీలించిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి కేబినెట్లో ఆమోదించి గవర్నర్‌కు పంపినారు. అదే సమయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో అజారుద్దీన్‌కు >>2

# 'స్థానికా'నికి రెడీ

**పంచాయతీ ఎన్నికలకు సిద్ధమైన సర్కార్**

**రిజర్వేషన్లపై ఉన్న సీలింగ్‌ను ఎత్తివేసిన కేబినెట్**

**42 శాతం కోటా అమలుకే నిర్ణయం**

**గోశాల సంక్షేమబోర్డు ఏర్పాటుకు ఆమోదం**

**కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం**



శనివారం కేబినెట్ భేటీ వివరాలను వెల్లడిస్తున్న మంత్రులు పొంగులేటి, పొన్నం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 30:** సెప్టెంబర్ 30లోపు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి శనివారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు. బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కెబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ పేర్లను ఆమోదిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో గోవుల రక్షణ కోసం ప్రత్యేకంగా గోశాల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ మీడియాకి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోఅతి భారీ వర్షాలతో జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరిగాయని, జాతీయ, రాష్ట్ర రహదారులు, రైల్వే లైన్లు, దెబ్బ తిన్నాయన్నారు. వర్షాలవల్ల సంభవించిన నష్టాన్ని సోమవారం వరకు అందజేయాలని అధికారులకు సూచించామని, జరిగిన నష్టాలను తొలగించేందుకు సోమవారం నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వరదలు, భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టులకు వచ్చే వరద నీరు అంచనా వేసేందుకు నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టుకి సంబంధించిన అత్యాధునిక యంత్ర పరికరాలను కొనుగోలు చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2022-23 ఏడిలో మిల్లర్లకు ఇచ్చిన 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రికవరీ చేయాలని నిర్ణయించామన్నారు. మిల్లర్లు డబ్బులు చెల్లించకపోతే >>2



## కెసిఆర్ మళ్లీ డుమ్మా

**కాళేశ్వరం చర్చకైనా అసెంబ్లీకి వస్తారా?**

**హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శనివారం ఉదయం నుంచి మొదలైన ఆరవ పాలకసభ సమావేశాలు మొదటి రోజు సమావేశంకు హాజరు కాకుండా డుమ్మాకొట్టారు. ఆదివారం అసెంబ్లీలో ఘోష్ కమిషన్ నివేదికను ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టనున్నారు. ఆ నివే >>2



## కెసిఆర్ అసెంబ్లీకి రాకపోతే తప్పు ఒప్పుకొన్నట్లే

**మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్,ఆగస్టు 30,ప్రభాతవార్త:** కెసిఆర్ అసెంబ్లీకి రాకపోతే తప్పు ఒప్పుకున్నట్లే,కాళేశ్వరం విషయంలో తప్పైతే తప్పుని బాధ్యతగా ఒప్పుకోవాలని ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం చిట్‌చాట్ చేస్తూ కెసిఆర్ అసెంబ్లీకి వస్తాడని అనుకుంటున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అన్నీతానే అని గొప్పలు చెప్పుకున్న కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.కెసిఆర్ అసెంబ్లీకి రాకపోతే తప్పు ఒప్పుకున్నట్లే. కాళేశ్వరం ఆయన హయాంలోనే రికార్డు స్థాయిలో కట్టారు. ఆయన హయంలోనే కూలింది అని అన్నారు. కాళేశ్వరంపై వేసిన కమిషన్ జడ్జి సుప్రీం కోర్టుజడ్జిగా పనిచేశారు.మంచి పేరున్న న్యాయమూర్తి ఆయన సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని చెప్పారు.దానికి భయపడే కెసిఆర్, హరీష్ రావు కోర్టుకు పోయారు. కాళేశ్వరం >>2

# అసెంబ్లీ రెండు రోజులే?

**నేడు నిర్ణయించే అవకాశం**

**వరదలు, వినాయక నిమజ్జనం నేపథ్యంలో తక్కువ వ్యవధి!**

**15 రోజులు సభను నిర్వహించాలన్న బిఆర్ఎస్, బిజెపి**

**సెప్టెంబరు 6 తర్వాత మళ్లీ సమావేశాలు!**



శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశ దృశ్యం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 30:** శనివారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనేది ఇంకా నిర్ణయించలేదు. శనివారం జరిగిన బిఏసిలో 15 రోజుల పాటు సభను నిర్వహించాలని ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి పార్టీలు కోరగా రాష్ట్రంలో నెలకొన్న వరదలు, వినాయక నిమజ్జనం నేపథ్యంలో సభను ఎక్కువ రోజులు నిర్వహించడానికి అవకాశం లేదని ప్రభుత్వం తెలిపింది. దీంతో సభను ఎక్కువ రోజులు నిర్వహించడానికి ప్రభుత్వం అంగీకరించకపోవడంతో బిఏసి నుంచి బిఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. శాసనసభ సమావేశాల నేపథ్యంలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరి కమిటీ (బిఏసి) సమావేశం జరిగింది. సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల శాఖమంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, విప్ బీర్ల ఐలయ్య, బిఆర్ఎషన నుంచి టి హరీష్ రావు, బిజెపి నుంచి ఏ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలనే దానిపై నేడు(ఆదివారం) నిర్ణయం తీసుకుంటామని మంత్రి శ్రీధరబాబు తెలిపారు.కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఆదివారం సభలో చర్చ జరు >>2



చైనాలోని టియాంజిన్ ఎయిర్‌పోర్టులో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న అధికారులు

## చైనాలో ప్రధాని మోడీ

**ఏడేళ్ల తర్వాత బీజింగ్‌కు మొదటి సారి**

**బీజింగ్, ఆగస్టు 30:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ చైనా చేరుకున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత బీజింగ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా టియాంజిన్ ఎయిర్‌పోర్టులో ప్రధానికి రెడ్‌కార్పెట్ వేసి అక్కడి అధికారులు >>2



శనివారం సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభలో నివాళులు అర్పిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి చిత్రంలో వామపక్షనేతలు డి.రాజా తదితరులు

# సురవరం పేరు శాశ్వతం చేస్తాం

**ఆరున్నర దశాబ్దాలు నిబద్ధతతో జీవించిన నేత**

**ఆయన జీవితాంతం ఒకే జెండాను మోసి, ఆ నీడనే విశ్రమించారు**

**సురవరం సంస్మరణ సభలో సిఎం రేవంత్**

**సుధాకర్ రెడ్డి జీవితం ఒక పాఠం: డి.రాజా**

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 30 ప్రభాతవార్త:** నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పని చేసిన సురవరం సుధాకర్ రెడ్డి పేరు చరిత్రలో శాశ్వతంగా ఉండే విధంగా తమ ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర మంత్రిమండలిలో చర్చిస్తానని పునరుద్ఘాటించారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభలో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సిఎం మాట్లాడారు. సిద్ధాంతాలు చెప్పడమే కాదు. నమ్మిన సిద్ధాంతం కోసం 65 సంవత్సరాలు నిబద్ధతతో జీవించడం ద్వారా సురవరంకు ఆ గౌరవం దక్కిందని, >>2



భారీ వర్షాలతో జలమయమైన బాసర ఆలయ ప్రాంగణం

## గోదావరి వరదలో తేలుతున్న బాసర

**ఆలయ పరిసరాలు, కాలనీలు జలమయం, నదీతీరం వెంట పోలీసుల గస్తీ** 2లో

## మళ్లీ భారీ వర్ష సూచన

**అప్రమత్తంగా ఉండాలన్న ప్రభుత్వం**


**హైదరాబాద్,ఆగస్టు30, ప్రభాతవార్త:** తెలంగాణలో రానున్న నాలుగు రోజులు మళ్లీ భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. గత వారంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. దీంతో వరదలు ఏరులైపారి జనజీవనం స్తంభించింది. తాజాగా వాతావరణశాఖ మరోసారి అప్రమత్తం చేసింది. సెప్టెంబర్ 3వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ >>2


# గణపతి బప్పా మోరియా.. కావాలయ్యా యూరియా

**అసెంబ్లీ, వ్యవసాయ కమిషనరేట్, సెక్రటేరియట్ వద్ద బిఆర్ఎస్ నిరసనలు**

**హరీష్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేల అరెస్టు**

**ప్రతి నెల అలవెన్స్‌లు ఇస్తున్నారా? అంటూ పోలీసులను ప్రశ్నించిన హరీష్‌రావు**





శనివారం అసెంబ్లీకి ర్యాలీగా వెళుతున్న బిఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కెటిఆర్‌ను అరెస్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్, ఆగస్టు31,ప్రభాతవార్త:** 'గణపతిబొప్పమోరియా కావాలయ్యా యూరియా' అంటూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపై బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్‌పార్కు వద్ద వినూత్న నిరసన ప్రదర్శన మొదలు పెట్టి సచివాలయం ముట్టడితో అట్టుడికించారు. అసెంబ్లీకి వెళ్లే ముందు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపంవద్ద ఖాళీ యూరియా బస్తాలతో నిరసన వ్యక్తం చేశారు. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్‌పార్టీ అంటూ నినాదాలు చేశారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టింది ఈ ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. 'గణపతి బప్పా మోరియా -కావాలయ్యా యూరియా' అంటూ నినదించారు. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు చేశారు. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. 'రేవంత్ >>2



## ఇజ్రాయెల్ దాడుల్లో హూతీల ప్రధాని రహావీ హతం

**సనా, ఆగస్టు 30:** యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారుల స్థావరాలపై ఇజ్రాయెల్ భీకర దాడులుచేస్తోంది. హూతీల నియంత్రిత ప్రాదేశిక ప్రాంతానికి ప్రధానిగా కొనసాగుతున్న అహ్మద్ అల్ రహావీని దళాలు హతమార్చాయి. హూతీలు ఈ మృతిని తాజాగా ధృవీకరించారు. ఈవారం ఆరంభంలో రాజధాని >>2



శనివారం హైదరాబాద్‌లోని గన్‌పార్కువద్ద బిఆర్‌ఎస్ నేతల నిరసన ప్రదర్శన

# కావాలయ్యా యూరియా

>> దోషం – రైతన్నకు మోసం' అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్సీలు పబ్లిక్‌గార్డెన్ గేట్ నుంచి శాసనమండలికి ర్యాలీగా వస్తూ గణపతిబొప్పా మోరియా కావాలయ్యా యూరియా అని నినాదాలు చేశారు. శాసనమండలిలో నినాదాలు చేశారు. శాసనసభ ముగియగానే బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు అంతా కలిసి సభలోకి వెళ్ళే ప్రధాన గేటు వద్ద యూరియా కోసం నినాదాలు చేశారు. మార్షల్స్ వెంటనే పూనుకొని వారిని అక్కడనుంచి లాక్కొని తీసుకొని వెళ్ళారు. అక్కడ నుంచి ఎమ్మెల్యేలు వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందుకు చేరుకొని మెరుపు ధర్నాచేశారు. యూరియా కొరతపై ప్రభుత్వం స్పందించి, ఎప్పటిలోగా పంపిణీ చేస్తారో చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శాసనసభ వాయిదా అనంతరం నేరుగా వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి బీఆర్‌ఎస్ నేతలు పాదయాత్రగా వెళ్లారు. యూరియా కొరతపై వ్యవసాయ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం కార్యాలయం బయటకు వచ్చిఅక్కడే నిరసనకు దిగారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఇక్కడ్నుంచి కదలబోమని బిఆర్‌ఎస్ నేతలు స్పష్టం చేశారు. ఇక కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించే సమయంలో యూరియా కొరతపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఏ రాష్ట్రాల్లోనూ యూరియా సమస్య లేదు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత. కరోనా సమయంలోనూ ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేశాం. బిజెపి, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు నెపం వేసుకుని తప్పించుకుంటున్నారు. యూరియా పంపిణీ చేతగాకపోతే తప్పుకోవాలి. యూరియా ఎప్పటిలోపు పంపిణీ చేస్తారో చెప్పకపోతే ఇక్కడ నుంచి కదలం. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ తీసుకొని చెబితేనే ఇక్కడ్నుంచి బయటకు వెళ్తాం. మేం రాజకీయాల కోసం రాలేదు.. రైతుల కోసం వచ్చాం. రాష్ట్రంలో యూరియా కొరత తీర్చాలంటూ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయా పోలీసు స్టేషన్లకు వారిని తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అరెస్టు చేసిన ఎమ్మెల్యేలను విడుదల చేసిన తర్వాత ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలో బిఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ సచివాలయాన్ని ముట్టడించారు. సచివాలయం ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో సచివాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ప్రతినెల అలెవెన్సులు ఇస్తున్నారా ? ఎందుకు అత్యుత్సాహం: పోలీసులను నిలదీసిన హరీష్:** వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తున్న బిఆర్‌ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేస్తున్న సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులను హరీశ్‌రావు సూటిగా ప్రశ్నిలను సందించి ఇబ్బందిపెట్టారు.అరెస్టు చేయడానికి అత్యుత్సాహంతో వస్తున్నారు కానీ పోలీసుల్లారా మీ జీతాలు పెరిగాయా? వాహనాల్లో కొట్టిస్తున్న పెట్రోల్ డబ్బులు ఇస్తున్నారా? టీఏ, డీఏలు వచ్చాయా అంటూ హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రతి నెల ప్రత్యేక అలవెన్స్ ఇస్తున్నారా? మీకు పెట్రోల్ బిల్లు వస్తుందా..? పంపోడు మీకు ఉద్దెర పోస్తలేదు. పోలీసు జీపులకు పెట్రోల్ పోయించుకునేందుకు రేవంత్ రెడ్డి పైసలు ఇస్తలేడు. మీ సొంతం పైసలతోటి పెట్రోల్ పోయించుకుంటున్నరు. మీకు పెట్రోల్ కోసం పైసలు వస్తున్నాయా? చెప్పండ్రి అని హరీశ్‌రావు అడిగారు. హరీశ్‌రావు ప్రశ్నలకు పోలీసులు సమాధానం చెప్పలేకపోయారు. మొత్తానికి హరీశ్‌రావును పోలీసు వ్యాన్‌లోకి ఎక్కించారు.

# గోదావరి వరదలో తేలుతున్న బాసర

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** గోదావరి వరదలకు బాసరలోని తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జ్ఞాన సరస్వతి దేవాలయ పరిసర ప్రాం తాలు నీట మునిగాయి. బాసరలోని సరస్వతి దేవాలయానికి సమీపంలోనే గోదావరి నది ప్రవహిస్తుండడం తెలిసిందే. వారం రోజులుగా ఉమ్మడి ఆ దిలాబాద్ జిల్లాతో పాటు ఎగువన మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురుస్తుండడం విదితమే. ఈ కారణంగా గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తుండడ ంతో నది తీరంలో గల నిర్మల్ జిల్లాలోని అనేక గ్రామాలు నీట మునిగాయి. దీంతో పాటు బాసర గ్రామం కూడా వరద తాకిడికి గురయ్యింది. రెం డు రోజులుగా భారీగా వరద నీరు పోటెత్తడంతో సరస్వతి దేవాలయం ప్రాంగణం అంతా నీరు చేరింది. ఆలయ ప్రాంగణంలో గల సరస్వతి అమ్మ వారి విగ్రహం వద్ద రెండు అడుగులకు పైగా నీరు చేరింది. వరదనీరు వ్యాస మహర్షి ఆలయంతో పాటు సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థా నాల గృహాల వరకు చేరింది. దీంతో ఈ ప్రాంతంలోని కాలనీలతో పాటు దేవాలయానికి సంబంధించిన లాడ్జీలు, దుకాణాలు, సత్రాలు, కాటేజీలు చాలా వరకు నీట మునిగాయి. లాడ్జీలు, కాటేజీలలో ఐదారు అడుగులకు పైగా వరదనీరు చేరడంతో అందులో ఉన్న వారు ప్రాణాలు కాపా డుకున్నారు. ఇదే ప్రాంతంలోని గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలని, ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంకులు జలమయమయ్యాయి. కాగా జలమయమైన ప్రాంతాలలోని ప్రజలను పోలీసులు, ఫైర్ సర్వీస్ సిబ్బంది ట్రాక్టర్లలో సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇ క్కడే వున్న ఓ ప్రైవేట్ పాఠశాలలో వరద నీటిలో చిక్కుకున్న 30 మంది విద్యార్థులను, అధ్యాపకులను కూడా పోలీసులు కాపాడి సురక్షిత ప్రా ంతాలకు చేర్చారు. వరదల కారణంగా సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చే వారి సంఖ్య తగ్గింది. ఆలయ ప్రాంగణంలో పాటు నది తీరం వెంట పలువుర్ల వరదనీటి ధాటికి పెద్ద సంఖ్యలో వాహనాలు నీట మునిగాయి. చిన్నారులకు అక్షరాభ్యాసం చేసే దేవాలయంగా బాసర సరస్వతి దేవాలయం ఎంతో పేరుగాంచడం తెలిసిందే. గోదావరి పుష్కరాలు ఈ ప్రాంతంలోనూ ఘనంగా జరుగుతుంటాయి. బాసర వద్ద వరద నీ టి వల్ల తలెత్తిన పరిస్థితుల పై నిర్మల్ జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు పుంది. వరద నీటి ప్రవాహం మరో నాలుగైదు రోజుల వరకు వుంటుందని అధికారులు చెబుతున్నారు. అప్పటి వరకు నది వద్దకు ఎవరు వెళ్లవద్దని అధికారులు ప్రజలను కోరుతున్నారు. తీరం వెంట పోలీసు గస్తీని ఏర్పాటు చేశారు.

# మళ్లీ భారీ వర్ష సూచన

>> వర్షాలు కురిసే అవకాశం ఉందని తేల్చింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుందని.. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి.. నైరుతి వైపునకు వంగి ఉందని పేర్కొంది. సెప్టెంబర్ ఒకటిన రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది.2న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. 3న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. అత్యధికంగా ఆదిలాబాద్‌లో 5.4 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఖమ్మం–5.2, ములుగు–3.6, భద్రాద్రికొత్తగూడెం–3.2, వరంగల్–2.7, వికారాబాద్–2.9, సూర్యపేట–2.6, నల్గొండ–2.2,హైదరాబాద్‌లో2.1 నమోదైంది.

# కోదండరామ్, అజారుద్దీన్

>> ఎమ్మెల్సీ పదవి అప్పగించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై సుప్రీంకోర్టు ఈ మధ్యే సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలపై సర్వోన్నత న్యాయ స్థానం స్టే విధించింది. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది.ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలను బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పు అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తుది తీర్పు కోసం తదుపరి విచారణ తేదీగా సెప్టెంబర్ 17ను నిర్ణయించింది.ఇక జూబ్లీహిల్స్ ఎన్నికల్లో తానే అభ్యర్థినంటూ మాజీ ఎంపీ అజారుద్దీన్ ధీమాగా ప్రకటించుకున్నారు. మరోవైపు అధిష్టానం వద్ద మైనారిటీ విభాగం ఒత్తిడి నేపథ్యంలో ఆయనకే సీటు ఇవ్వడం ఖాయమని అంతా భావించారు. కానీ, అనూహ్యంగా ఇప్పుడు ఆయనకు ఎమ్మెల్సీతోపాటు మంత్రి పదవిని కట్టబెట్టాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరై ఉంటారా? అనే సస్పెన్స్ కొనసాగుతోంది. అజహరుద్దీన్‌కు మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ప్రస్తుతం మంత్రి వర్గంలో మైనార్టీలు లేకపోవడంతో అజహరుద్దీన్‌కు లభించే అవకాశం ఉంది.

# 'కాళేశ్వరం' అగ్గి!

>> నిల్వచేయొద్దని ఎన్‌డిఎస్‌ఎ సూచించినందున ఈ ప్రాజెక్టును ఎలా వినియోగించుకోవాలనే అశంపై అన్ని పార్టీల అభిప్రాయాలను ప్రభుత్వం కోరనుంది.ఘోష్ నివేదికపై చర్యల కంటే దానిపై చర్చ జరగడమే ప్రధానమని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది.కమిషన్ నివేదిక ఆధారంగా దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేయడ మాత్రమే తమ ఉద్దేశం కాదని, అవసరమైతే బిజెపి కోరుతున్నట్టు సిబిఐ విచారణకోసం బంతిని అటువైపు విసిరి ఆ పార్టీని కూడా ఇరుకునపెట్టడానికి కూడా వ్యూహాత్మకంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. బిసి రిజర్వేషన్ల బిల్లును ఆదివారం సభలో పెడతాం. కాళేశ్వరంపై సభలో భారత రాష్ట్రసమితి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు స్పీకరే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని శ్రీధర్‌బాబు తెలపడంతో ప్రతిపక్ష బిఆర్‌ఎస్,బిజెపి కూడా అస్త్రశస్త్రాలు సవరించుకొంటున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం వైఫల్యంతో ఇరకాటంలోకి నెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రయత్నాలను అసెంబ్లీ వేదికగానే తిప్పికొట్టాలని బిఆర్‌ఎస్ సన్నద్ధమైంది. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ అసెంబ్లీలో ఇవ్వడానికి స్పీకర్‌ను బిఆర్‌ఎస్ కోరినా ఇంతవరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కూడా గతంలో ఎన్నడు లేదని బిఆర్‌ఎస్ డిమాండ్‌ను తోసిపుచ్చారు. కాళేశ్వరం అంశం చర్చకు రాకుండా అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిరామారావు, సీనియర్ నేతలు హరీష్‌రావు,, జగదీశ్వరెడ్డి, వేముల ప్రశాంత్రెడ్డి తదితరులకు బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దిశా నిర్దేశం చేశారు.రాష్ట్రంలో వరదల మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించటాన్ని బిఆర్‌ఎస్ తప్పుపడుతోంది. ఘోష్ కమిషన్ నివేదికపై ఇప్పటికే హైకోర్టును మరోమారు హరీష్‌రావు శనివారం హౌజ్‌మోషన్‌తో ఆశ్రయించారు. న్యాయస్థానంలో విచారణ జరగమునుపే అసెంబ్లీలో నివేదికను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం తమపై బురద చల్లే ప్రయత్నంలో ఉందని బిఆర్‌ఎస్ ఆరోపిస్తోంది.అసెంబ్లీ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టుపై పిపిటి ఇచ్చేందుకు అవకాశమివ్వాలని పట్టుబడుతోంది. ప్రభుత్వంలో అవినీతి, గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టు, నీటిపారుదల ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగింత వంటి అంశాలను లేవనెత్తి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని భావిస్తోంది. ఎరువుల కొరత, వరద నష్టంపై ప్రభుత్వం స్పందన వంటి అంశాలపై చర్చ కోసం పట్టుబట్టే వ్యూహంపై బిఆర్‌ఎస్ కసరత్తు చేస్తోంది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ దర్యాప్తు కోసం పట్టుబట్టాలని బిజెపి శాసనసభా పక్షం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. సిబిఐ విచారణ ద్వారానే నిజాలు నిగ్గు తేలుతాయని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సన్నద్ధమవుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై సిబిఐ విచారణ కోసం మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్న బిజెపి ఆదివారం అసెంబ్లీలోనూ అదే వైఖరిని కొనసాగించాలని నిర్ణయించింది. ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై కేంద్ర ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణలను కూడా తిప్పికొట్టాలని భావిస్తోంది. సిట్ ఏర్పాటులో ప్రభుత్వం చేస్తున్న తాత్సారాన్ని కూడా నిలదీయాలని బిజెపి నిర్ణయించింది. కాగా ఎంఐఎం, సిపిఐ పార్టీలు అధికారపక్షానికి మద్దతుగా నిలవనున్నట్లు సమాచారం. జలసౌధలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో భేటి అయినట్లు వార్తలు వెలువడ్డాయి. గన్‌మెన్,సెల్‌ఫోన్ లేకుండా ఎమ్మెల్యేలను పిలిచి సమావేశమైనారని ఇందులో ఆదివారం అనుసరించే విధానం తెలిపారని చర్చ జరుగుతోంది.

# 'స్థానికా'నికి రెడీ

>> పీడీ యాక్టు పెట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. మత్స్య సహకార సంఘాలకు పర్సనల్ ఇంచార్జీలను నియమించాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సంఘంలో సభ్యులను పర్సనల్ ఇంచార్జీలుగా నియమించాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. గోశాలల సంక్షేమం కోసం రాష్ట్రంలో గోశాలల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రొఫెసర్ కోదండరామ్, మహ్మద్ అజారుద్దీన్ పేర్లను ఫైనల్ చేసినట్టు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధిగా పని చేస్తుందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ నుండి ఇంటింటా సర్వే చేసి సబ్ కమిటీ ఏర్పాటు చేసి కేబినెట్ ఆమోదం చేసుకొని శాసన సభలో చర్చించి అన్ని రాజకీయ పార్టీల ఆమోదంతో గవర్నర్ ద్వారా రాష్ట్రపతి దగ్గరకు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని చేసిన తీర్మానాన్ని పంపించామన్నారు. ఎన్నికలను త్వరగా ముగించాలని, సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు పూర్తి చేయాలని కోర్టు సూచిస్తుందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో సబ్ కమిటీ న్యాయ కోవిదులతో చర్చించామన్నారు. బిసిలకు 42 శాతానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించినట్టు తెలిపారు. 2001 జనాభా ప్రాతిపదికన ఎస్సి, ఎస్టిలకు రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి కేసీఆర్ 2018లో తెచ్చిన చట్టం ఉరితాడుగా మారిందన్నారు. 2018 పంచాయతీ రాజ్ చట్టం,2019లో తెచ్చిన మున్సిపల్ యాక్ట్ ప్రకారం 50 శాతం సీలింగ్ ఎత్తివేయడానికి ఆర్డినెన్స్ తెచ్చామన్నారు. అయితే ప్రస్తుతం శాసనసభ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అదే ఆర్డినెన్స్‌లోని అంశాలపై సభలో బిల్లు పెట్టి అన్ని రాజకీయ పార్టీల ఒపినియన్ తీసుకుంటామన్నారు. దానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందుకు పోవడానికి కేబినెట్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సహచర మంత్రులు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కి ధన్యవాదాలు తెలిపారు. బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, న్యాయ కోవిదులు నిపుణులతో చర్చించిన తరువాతనే 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి చట్టంను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# చైనాలో ప్రధాని మోడీ

>> ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 1 వరకూ.. రెండు రోజులపాటూ చైనాలో ప్రధాని పర్యటించనున్నారు. అక్కడి టియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఈ పర్యటన సందర్భంగా తొలిరోజు 31న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోడీ ద్వైపాక్షిక చైనా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, ప్రధాని మోడీ చైనాలో పర్యటించడం ఏడేళ్లలో ఇదే తొలిసారి. చివరిసారిగా 2018లో పర్యటించారు. తర్వాత చైనా అధ్యక్షుడు 2019లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్–చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత గత సంవత్సరం అక్టోబరులో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోడీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యాక ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ జరిగింది. నేరుగా విమాన సర్వీసులు, కైలాస్ మానససరోవర్ యాత్రను పునరుద్ధరించేందుకు ఈ సంవత్సరం జూన్‌లో ఇరు దేశాలు అంగీకరించాయి. ఈ ఎస్‌ఇఒ సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా మధ్య, పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయాసియా దేశాలకు చెందిన దాదాపు 20 మందికిపైగా ప్రపంచ నాయకులకు ఆహ్వానం అందింది.

## కెసిఆర్ మళ్లీ డుమ్మా

>>దికపై అసెంబ్లీలో జరిగే చర్చలో ప్రతిపక్ష నేత కెసిఆర్ పాల్గొంటారా లేదా అనే అంశంపై అనిశ్చితి కొనసాగుతోంది. బిఆర్‌ఎస్ గోప్యత పాటిస్తోంది.



శనివారం బీహార్‌లో ఓటర్ అధికారయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్

# శాసనమండలిలో ముగిసిన బిఎసి

## సమావేశాలు ఎన్నిరోజులనేది సోమవారం నిర్ణయం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 30:** తెలంగాణ శాసన మండలి సమావేశాలు శనివారం ప్రారంభం కాగా ఇద్దరు మాజీ సభ్యుల మరణంపై సంతాపం తీర్మానం ప్రవేశ పెట్టి సభను సోమవారానికి వాయిదా వేశారు. అనంతరం ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన తన ఛాంబర్‌లో బిజినెస్ అడ్వైసరి కమిటీ(బిఎసి) సమావేశం జరిగింది.సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి ప్రతిపక్షనేత మధుసూధనాచారి, చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, నెల్లికంటి సత్యం, లేజిస్లేచర్ సెక్రెటరీ డాక్టర్ నరసింహాచార్యులు పాల్గొన్నారు. సమావేశా లను ఎన్ని రోజులు జరపాలనే అంశంపై చర్చ జరిగినప్పటికీ ఆదివారం శాసనసభ సమావేశాలు కొనసాగుతున్నందున సోమవారం రోజు నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిసింది.

## కమిషన్ నివేదికపై మరోమారు హైకోర్టును ఆశ్రయించిన హరీష్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త:** కాళేశ్వరం నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టవద్దని హౌజ్ మోషన్ పిటిషన్‌ను భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే మాజీ నీటిపారుదల ఆర్థిక మంత్రి హరీశ్‌రావు వేశారు. పిసిఘోష్ విచారణ చేసిన ప్రభుత్వంకు అందజేసిన కాళేశ్వరం నివేదికపై మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను సస్పెండ్ చేయాలని మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదికను ప్రవేశపెట్టకుండా చూడాలన్నారు.అసెంబ్లీలో కాళేవ్వరం నివేదికపై చర్చించి, తదుపరి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వకుండా హరీష్‌రావు పిటిషన్‌లో వినతి చేశారు. ఈ పిటిషన్ ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. కాళేశ్వరం కమిషన్ నివేదికను కొట్టివేయాలని గతంలోనూ కెసిఆర్ హరీశ్‌రావులు పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్ల ఆధారంగా గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు నోటీసులు జారీ చేసి వాయిదా వేసింది. అక్టోబర్ ఈ పిటిషన్లపై తదుపరి విచారణ చేపట్టనుంది.

**పిపిటికి అవకాశం ఇవ్వట్లేదంటే అధికార పక్షం భయపడుతున్నట్లే: హరీశ్ రావు :** తప్పులు చేశారో,లేదో తేల్చాల్సింది మంత్రులు, కాంగ్రెస్ పార్టీ కాదని హరీష్‌కు అన్నారు. అది తేల్చాల్సింది కోర్టులు, ప్రజలు అని పేర్కొన్నారు. కాళేశ్వరంపై పిపిపికి అవకాశం ఇవ్వట్లేదంటే అధికార పక్షం భయపడుతున్నట్లే అని హరీష్ రావు అన్నారు. వాస్తవాలు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆయన విమర్శించారు.

# రహవీ హతం

>> సనా వ్యాప్తంగా ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో సుమారు 10 మంది మృతిచెందగా 100 మందికిపైగా గాయపడ్డారని హూతీనేతలు ప్రకటించారు.రాజధాని సనాలో హైతీ పాలకుల సైనిక స్థావరమే లక్షనయంగా వైమానిక దాడులునిర్వహించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ దాడుల్లో ప్రముఖులందరినీ మట్టుబెట్టామని తెలిపింది. ఈ దాడుల్లో ప్రధాని అహ్మద్ ఆల్ రహవీతోపాటు పలువురు మంత్రులు మృతిచెందారని హూతీలు శనివారం వెల్లడించారు. ప్రభుత్వ కార్యకలాపాలు పనితీరును విశ్లేషించేందుకు మంత్రులతోప్రధాని సమావేశమైన సందర్భంగా ఈ దాడులు చేసారని, 2024 ఆగస్టునుంచి రహవి హూతీల నియంత్రితప్రాం తానికి ప్రధానిగాఉన్నట్లు హూతీనేతలు వెల్లడించారు.

## అసెంబ్లీ రెండు రోజులే?

>> గుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆదివారం సభలో పెడతామన్నారు. కాళేశ్వరంపై సభలో బిఆర్‌ఎస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు స్పీకరే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని శ్రీధర్‌బాబు తెలిపారు. అన్ని అంశాలపై చర్చ చేయాలంటే, నాలుగైదు రోజుల తర్వాత సభ నడుపుతామని.. గణేష్ నిమజ్జనం, వరదల దృష్ట్యా సభను వాయిదా వేయాలని భావిస్తున్నట్టు శ్రీధర్‌బాబు తెలిపారు. ఎరువుల కొరత, వరదలు, రైతుల సమస్యలపై ఆదివారం చర్చ జరగాలని బిఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ రాకపోవడంతో బిఎసి నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. యూరియా కొరత, వరద బీభత్సం, విషజ్వరాలు, గురుకుల పిల్లల మరణాలు సహా ఇతర ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీలో సమయం ఇవ్వకుండా రెండురోజులే నడుపుతామని ప్రభుత్వం చెప్పడంతో బిఎసినుండి వాకౌట్ చేసినట్టు బిఆర్‌ఎస్ నేత,మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు.

## తప్పు ఒప్పుకొన్నట్లే

>> కమిషన్ నివేదిక తప్పు అని భావిస్తే కెసిఆర్ అసెంబ్లీ వచ్చి చెప్పాలని కోరారు. ప్రతిపక్ష నేతగా జీత భత్యాలు తీసుకుంటున్నాడని అన్నారు.బాధ్యత ఆయనపై ఉంటది.కాళేశ్వరంపై చర్చ పెడితే అసెంబ్లీ నుంచి బి ఆర్ ఎస్ వాకౌట్ చేయకుండా, మా మీద పూలు చల్లుతారా? తప్పించుకుని పారిపోతారని ఎద్దేవా చేశారు.కాళేశ్వరం పూర్తి నివేదిక, కంప్లీట్ గా చర్చ ఉంటుంది.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అన్నీ తానే అని చెప్పుకున్న కెసిఆర్ అసెంబ్లీకి రావాలని కోరుతున్నా అని ఆయన అన్నారు. కాళేశ్వరం పై లక్షకోట్లు తిన్న వాళ్లను వదిలేస్తామా?అని ప్రశ్నించారు.ప్రజల ముందు దోషులుగా నిలబెడతాం వాళ్లను ఏం చేయాలో ప్రజలు నిర్ణయిస్తారని ఆయన అన్నారు. కాళేశ్వరంపై పెట్టిన శ్రద్ధ 10యేళ్ల డిండి, పాలమూరు లాంటి ప్రాజెక్టుల మీద ఎందుకు పెట్టలేదు?అని ఆయన అడిగారు.

## వారం - వర్జ్యం

31-08-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
అష్టమి రా. 12.58
అనూరాధ సా. 5.27
వర్జ్యం : రా. 11.35–1.21
దు.సా. 4.39–5.29
రాహుకాలం – సా. 4.30–6.00

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాలలో ఉన్న మీవారికి సహాయసహకారాలు అందిస్తారు.

**వృషభం:** నూతన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. మిత్రులనుండి శుభవార్తలు అందుకుంటారు.

**మిథునం:** ఇంటర్వ్యూలలో, పోటీ పరీక్షలలో విజయంసాధిస్తారు. ఊహించని అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి.

**కర్కాటకం :** సంఘంలో గౌరవ ప్రతిష్టలు పొందుతారు. ఇంటా బయటా అనుకూల వాతావరణం లాభిస్తాయి.

**సింహం:** నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగులు పదోన్నతులు పొందుతారు.

**కన్య :** అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.

**తుల :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి.

**వృశ్చికం:** ఆర్థికపరమైన లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి.

**ధనుస్సు:** భూములు, ఇళ్లు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**మకరం:** కుటుంబసభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. ఋణాలు తీరుస్తారు.

**కుంభం:** ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తిచేస్తారు. బంధువులనుండి శుభవార్తలు అందుకుంటారు.

**మీనం :** సకుటుంబంగా వివాహాది శుభకార్యాలకు హాజరవుతారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సురవరం పేరు శాశ్వతం చేస్తాం

>> ఆయన ఏ జెండాను మోశారో, ఏ జెండా మోయడం గొప్పగా భావించారో చివరి శ్వాస తర్వాత కూడా ఆ జెండా నీడనే విశ్రమించడం అత్యంత అరుదు అని అన్నారు. ప్రజలతో గుర్తింపబడిన మహనీయుల పేర్లు ఈ రాష్ట్రంలో శాశ్వతంగా నిలవాలి, అందుకే తెలుగు విశ్వ విద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు, కోఠీ మహిళా విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టుకున్నాం అని అన్నారు. సామాన్య ప్రజల్లో చైతన్యం నింపి గోల్కొండ కోటను పాలించిన సర్దార్ సర్వాయి పాపన్న అందరికీ స్ఫూర్తిగా నిలవాలని ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుంటున్నామన్నారు. ఒక ప్రాంతం నుంచి సమాజంలో గుర్తింపు పొందిన ఉన్నప్పుడు చెప్పుకోవడానికి ఆ ప్రాంత వాసులకు గర్వంగా ఉంటుందని, మొదటి తరంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణా రావు , రెండో తరంలో జైపాల్ రెడ్డి , సురవరం సుధాకర్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు వన్నె తెచ్చారు. వారెప్పుడు సమాజంలో గౌరవం పొందుతూనే ఉంటారన్నారు. సురవరం విజయలక్ష్మి చిన్న కోరిక కోరారని, ఆయన గౌరవం ఆలంపూర్ శాసనసభ నియోజకవర్గానికే కాదు. సురవరం సుధాకర్ రెడ్డి గౌరవం, రాష్ట్ర స్థాయిలో ఉండే విధంగా శాశ్వతంగా గుర్తుంచుకునే విధంగా మంత్రివర్గంలో ఒకమంచి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం సమాజంలో ప్రజాస్వామిక మూల సిద్ధాంతానికి విరుద్ధంగా పెరిగిపోతున్న విపరీత పోకడలను అడ్డుకోవలసిన అవసరం ఉందని, ప్రజల ప్రాథమిక హక్కులను హరించే ప్రమాదకర పరిస్థితులను తలెత్తుతున్నాయని, ప్రజలను చైతన్య పరిచే ఆలోచన ఎవరూ చేయడం లేదని, అందుకోసం ఐక్య కార్యాచరణ నిర్మించుకోవాలన్నారు. సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ.రమణ మాట్లాడుతూ సురవరం ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సురవరం సుధాకర్‌రెడ్డి పనిచేశారని అన్నారు. వారి ఇబ్బందులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నివేదికలు ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. తనకు కూడా వామపక్ష భావజాలం పట్ల అభిమానం ఉందని పేర్కొన్నారు. సురవరం ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారని కొనియాడారన్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి జీవితం ఒక పాఠం అని అన్నారు. నిస్వార్థంగా ప్రజల కోసమే జీవించడం ఎలాగో సురవరం సుధాకర్‌రెడ్డి జీవితాన్ని చూస్తే అర్థమవుతుందని అన్నారు. ప్రతి రాజకీయ నాయకుడికి ఆయన జీవితం ఒక పాఠంగా నిలుస్తుందని చెప్పారు. సురవరం పాటించిన సిద్ధాంతాలు సీపీఐ మాత్రమే కాదు.. అన్ని పార్టీల నేతలకు ఆదర్శవంతమన్నారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటమే కాదు.. ప్రజల స్వేచ్ఛ కోసం పోరాటాలు చేయాలని ఆయన భావించారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ నిబద్ధతతో కూడిన రాజకీయాలు చేసిన వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అని అన్నారు. తాను ఎన్ఎస్‌ఈయూఐ నాయకుడిగా ఉన్నప్పుడు తొలిసారి సురవరం సుధాకర్‌రెడ్డిని కలిసినట్లు తెలిపారు. ఇటీవల సీపీఐ రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవంలో మళ్లీ కలిసినట్లు చెప్పారు. కమ్యూనిజం ఎప్పుడూ సజీవంగా ఉంటుందన్నారు. సురవరం నిబద్ధతతో రాజకీయాలు నడిపారన్నారు. ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సభలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సిపిఐ జాతీయ నాయకుడు నారాయణ, రామకృష్ణ, పూర్వ ఎంపి కెవిపి.రామచంద్రరావు, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సిపిఎం సీనియర్ నేత తమ్మినేని వీరభద్రం, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్యేలు గుమ్మడి నర్సయ్య, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

## పార్లమెంటు ఆవరణలో జగన్నాథ రథచక్రాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: పార్లమెంటు ఆవరణలో ప్రపంచ ప్రఖ్యాత పూరీ జగన్నాథ రథచక్రాలు పార్లమెంటు ఆవరణలో ఏర్పాటుకానున్నాయి. ఇందుకు సంబంధించి పార్లమెంటుస్పీకర్ ఓం బిర్లా ఆమోదించినట్లు జగన్నాథ రథ మందిర చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పఢీ తెలిపారు. ఇందుకు సంబంధించి లోక్‌సభ స్పీకర్ జగన్నాథ మందిర సందర్శన సందర్భంగా ప్రతిపాదనను అందచేసామని ఇందుకు స్పీకర్ సంతోషంగా స్వాగతించారని ఆయన అన్నారు. ఇదే ప్రతిపాదనను అంతకుముందే ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ మాఝీ, న్యాయశాఖమంత్రి పృథ్వీరాజ్ హరిచందన్‌లతో కూడా చర్చించినట్లు ఆయన తెలిపారు. బలభద్ర రథం కూల్చివేసిన తర్వాత ఆ రథ చక్రాలు, అలాగే దేవిసుభద్ర రథం దర్పదలన రథాన్ని పూర్తిగా వేరుచేసామని జగన్నాథుని రథం భాగాలను వేరుచేసే ప్రక్రియ ప్రారంభించామని అడ్మినిస్ట్రేటర్ తెలిపారు. ఈ రథచక్రాలను వేరుచేసే కార్యక్రమం పూర్తిచేసిన తర్వాత ఢిల్లీ కొత్తపార్లమెంటు ఆవరణం వీటిని అత్యంత భద్రత మధ్య తరలిస్తామని, పార్లమెంటు ఆవరణలో నిర్దేశిత ప్రాంతంలో ఈ జగన్నాథ రథచక్రాలు ఏర్పాటుచేసే విధంగా స్పీకర్ తమకు అంగీకారం తెలిపినందున విశ్వవిఖ్యాత జగన్నాథ రథచక్రాలు ఇకపై పార్లమెంటు ఆవరణలో కూడా దర్శనమిస్తాయని ఆయన అన్నారు.

## అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో జాన్‌వెస్లీ హౌస్‌అరెస్టు

### పలువురు సిపిఎం నాయకులు కూడా..

### అరెస్టులను ఖండించిన పార్టీ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** శనివారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆందోళనలు, నిరసనలు చేయకుండా ఉండాలనే ఉద్దేశంతో ముందు జాగ్రత్త చర్యగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతోపాటు సిపిఎం నాయకులను హౌస్ అరెస్టు చేశారు. జాన్‌వెస్లీతోపాటు సిపిఎం నాయకులను ముందస్తు అరెస్టులను సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని శనివారం ఉదయం పోలీసులు హైదరాబాదులోని ఆయన నివాసంలో హౌస్ అరెస్టు చేశారు. రంగారెడ్డి జిల్లా పార్టీ నాయకులను కూడా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఎలాంటి నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వకున్నా పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. గత నెల రోజులుగా రంగారెడ్డి జిల్లా కప్పాహాడ్‌లో భూపోరాటం ఉద్ధృతంగా సాగుతోంది.. అనాజ్‌పూర్‌కు చెందిన పేదల భూములను రామోజీ ఫిల్మ్‌సిటీ కబ్జాలకు ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో రెండు రోజుల క్రితం జరిగిన ఆందోళన సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి సహా పార్టీ నాయకులను, రైతులను అరెస్టు చేశారు. అదేవిధంగా పోల్కంపల్లి ఇతర గ్రామాలకు చెందిన పేదలకు కేటాయించిన నాగన్‌పల్లిలోని ఇంటి స్థలాలను రామోజీ ఫిల్మ్‌సిటీకి అప్పజెప్పడాన్ని అడ్డుకుని పోరాటం సాగుతోంది.. ఈ పోరాటంలో రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రత్యక్షంగా పాల్గొంటున్నందున జాన్‌వెస్లీని, పార్టీ నాయకులను అరెస్టు చేశారని రాష్ట్ర కమిటీ తెలిపింది. అరెస్టులు, కేసులతో ఉద్యమాలు ఆగిపోవని, భవిష్యత్‌లో ప్రజా భూపోరాటాలు, ప్రజా ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది.

## విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పదవీవిరమణ

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో 31 సంవత్సరాలు వివిధ హోదాల్లో పనిచేసి సమర్ధుడైన అధికారిగా పేరొందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి శనివారం నాడు పదవీ విరమణ చేశారు. ఉమ్మడి ఎపి హయాంలో 1994లో పోలీసు శాఖలో చేరిన శ్రీనివాస్ రెడ్డి అనేకచోట్ల పనిచేసి తనదైన శైలిలో విధులు నిర్వహించి ప్రజల నుంచి మన్ననలు పొందారు. హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా పని చేసిన సమయంలో ఆటోలలో జరిగే నేరాల నివారణకు తీసుకున్న చర్యలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటయ్యాక ఆయనను హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా నియమించారు. సిటీ కొత్వాల్‌గా తన మార్కు పాలన చూపించిన శ్రీనివాస్‌రెడ్డి ఆ తరువాత విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిగా బదిలీ అయ్యారు. ఇటీవల వెలుగుచూసిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) గోల్‌మాల్ వ్యవహారాలను రట్టు చేసిన ఘనత శ్రీనివాస్ రెడ్డి బృందానికి విభాగానికి దక్కింది. ఈ స్కాం రట్టయిన తరువాత హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావుసహా ఐదుగురు అరెస్టవడం తెలిసిందే. సాంకేతికంగా ఆగస్టు 31వ తేదీ వరకు ఆయన ఉద్యోగంలో వున్నా ఆ రోజు ఆదివారం కావడంతో శనివారం నాడే ఆయన పదవీ విరమణ చేశారు. కాగా శ్రీనివాస్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం ఎలాంటి హడావిడి లేకుండా సాదాసీదాగా ముగిసింది. మరోవైపు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిగా నియమితులైన నగర అదనపు పోలీసు కమిషనర్ (శాంతిభద్రతలు) విక్రమ్‌సింగ్‌మాన్ శనివారం బికెఆర్ భవన్‌లో శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం మధ్యాహ్నం తరువాత విక్రమ్‌సింగ్‌మాన్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌ఛార్జి డిజిగా బాధ్యతలు చేపట్టనున్నారు.



విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిగా పదవీవిరమణ చేసిన కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

## ఆదిలాబాద్ ఎస్‌బిఐ గోల్‌మాల్ కేసులో నిందితుల అరెస్టు?

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు ఎస్‌బిఐ 2 బ్యాంకులో వెలుగు చూసిన భారీ గోల్‌మాల్ కేసులో కొందరు నిందితులు పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. ఈ బ్యాంకులో పనిచేస్తున్న మేనేజర్, క్యాషియర్‌లు కలిసి ప్రజలు దాచిన 12.60 కోట్ల రూపాయల విలువచేసే బంగారు నగలు, కోటి పది లక్షల రూపాయల నగదుతో ఉడాయించడం తెలిసిందే. వారం రోజుల క్రితం ఈ స్కాం రట్టవగా దీనిపై విచారణ చేపట్టిన జిల్లా పోలీసులు నిందితుల కోసం గాలించగా ఇందులో క్యాషియర్ నరిగే రవీందర్ పట్టుబడినట్లు సమాచారం. దీంతోపాటు మేనేజర్ మనోహర్ రెడ్డి కూడా పోలీసుల అదుపులో వున్నట్లు తెలిసింది. చెన్నూరు ఎస్‌బిఐ 2 బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న రవీందర్ కొంతకాలంగా బెట్టింగ్‌లకు అలవాటు పడి స్థానికంగా అనేక మందికి బాకీ పడడం, ఈ క్రమంలో బ్యాంకులో ప్రజలు దాచిన బంగారు నగలను ఇదే ప్రాంతంలోని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద తనఖా పెట్టి డబ్బులు తీసుకుని, వాటిని కూడా పందాలు కాసి నిండా మునిగిపోయినట్టు తెలిసింది. దీంతో పాటు బ్యాంకులోని కోటి పది లక్షల రూపాయల నగదు కూడా ఇతను సొంత అవసరాలకు వాడుకోవడం విదితమే. తన అక్రమాలు వెలుగు చూడకుండా వుండేందుకు తనకు తెలిసిన ఖాతాదారుల నుంచి వడ్డీకి డబ్బులు, బంగారు నగలు తీసుకుని లాకర్లలో వుంచేవాడు. అయితే పదిరోజుల క్రితం రవీందర్ నాలుగు రోజుల సెలవుపై వెళ్లి పారిపోవడం, మేనేజర్ మనోహర్ రెడ్డి కూడా పత్తా లేకుండా పోవడంతో ఈ స్కాం రట్టయింది. దీనిపై చెన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టి పరారీలో వున్న క్యాషియర్ రవీందర్‌ను ముందుగా అదుపులోకి తీసుకుని బ్యాంకు నుంచి దొంగిలించిన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దీనితోపాటు బ్యాంకు నుంచి కాజేసిన కోటి పది లక్షల రూపాయల నగదులో కొంత మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దీనితోపాటు ఈ స్కాంలో మరికొందరు నిందితులున్నట్లు పోలీసు విచారణలో తేలిందని సమాచారం. దీనిపై ఒకటి రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడయ్యే వీలుంది.

# భారత్‌తో చర్చలకు పాక్ ఎప్పుడూ సిద్ధమే!

### పాక్ డిప్యూటీ ప్రధాని ఇషాక్‌ధర్

**ఇస్లామాబాద్, ఆగస్టు 31:** భారత్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు దాయాది పాకిస్థాన్ మరోసారి ప్రకటించింది. కశ్మీర్ సహా అన్ని సమస్యల పరిష్కారానికి న్యూ ఢిల్లీతో గౌరవప్రదమైన పద్ద తిలోచర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు పాక్ విదేశాంగ మంత్రి, ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ.. 'జమ్ము కశ్మీర్ వివాదంసహా అన్ని సమస్యల పరిష్కారానికి భారత్‌తో గౌరవప్రదమైన రీతిలో చర్చలు జరిపేందుకు పాక్ సిద్ధంగా ఉంది' అని తెలిపారు. కాగా, పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత తోక ముడిచిన పాక్ అనేక సార్లు కాళ్ల బేరానికి వచ్చింది. న్యూ ఢిల్లీతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఎప్పటికప్పుడు ప్రకటిస్తూ వస్తోంది. అయితే, భారత్ మాత్రం పాక్ అభ్యర్థనను తిరస్క రిస్తూ వస్తోంది. ఉగ్రవాదం, చర్చలు రెండూ ఏకకాలంలో ఉండవని వెల్లడించింది. ఆ దేశంతో చర్చలు జరిగితే కేవలం ఉగ్రవాదం, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)పైనే ఉంటాయని స్పష్టం చేస్తోంది. ఇందుకు తటస్థ వేదికను సిద్ధం చేయాలని కోరింది. ఇరుపక్షాలకు ఆమోద యోగ్య మైన వేదిపై చర్చించేందుకు పాక్ నిరం తరం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. భారత్‌తో కాల్పుల విరమణకు ఒప్పందం చేసుకోవాలని తమకు అమెరికానుంచి పిలుపు వచ్చిందని ఆయన అంగీకరించారు. ముందునుంచీ తాము యుద్ధాన్ని కోరుకోవడంలేదని చెపుతున్నామని, అయితే భారత్ మాపై ఆపరేషన్ సిందూర్ పేరుతో మెరుపుదాడులకు పాల్పడిందన్నారు. భారత్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోనే ఉందన్నారు.



# టేకుర్తిలో ఏడు నెలల గర్భిణి దారుణహత్య

### ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం లోని ఇల్లందకుంట మండలం టేకుర్తి గ్రామంలో శనివారం రాత్రి 6.30 గంటల ప్రాంతంలో 29సంవత్సరాల వయస్సు గల వివాహిత మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ సంఘటన అటు గ్రామంలో ఒక్కసారిగా దావనంలా వ్యాపించడంతో జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మినారయణ, ఎస్సై క్రాంతి కుమార్‌లు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. టేకుర్తి గ్రామానికి చెందిన ముద్రవేన రాములు ఎనిమిది సంవత్సరాల క్రితం హుజురాబాద్ ప్రాంతానికి చెందిన అవివాహిత మహిళ తిరుమలను రెండోవ వివాహం చేసుకున్నాడు. చేసుకున్న 8సంవత్సరాల తరువాత తిరుమల ఏడు మాసాల గర్బవతి అని, ఈ విషయం రాములు కుటుంబంలో తెలవడంతో గత 5-6 మాసాలుగా గొడవలు జరుగుతున్నాయి. రాములు మొదటి భార్య ఇదే మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన ముద్రవేన రేణుక ఇద్దరు కుమారులు రాములుకు రేణుకకు మధ్యన 10 సంవత్సరాల క్రితం ఇరువరి మధ్య గొడవలు జరగడంతో ఇద్దరు కొడుకులను రాములు దగ్గర వదిలిపెట్టి రేణుక పుట్టింటికి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంత కాలంగా రాములు తల్లిదండ్రుల వద్ద ఇద్దరు పిల్లలు పెరుగుతూ వచ్చారు. ఎనిమిది సంవత్సరాల క్రితం రాములుకు పరిచయం అయిన తిరుమలను వివాహం చేసుకుని టేకుర్తి గ్రామానికి తీసుకువచ్చాడు. అనాటి నుండి రాములు కుటుంబంలో గొడవలు జరుగుతున్నప్పటికి కొంత కాలం క్రితం రాములు మొదటి భార్య ఇద్దరు కొడుకులు కనగర్తి గ్రామానికి వెళ్లి తమ తల్లిని బ్రతిమలాడి టేకుర్తి గ్రామానికి తీసుకువచ్చారు. అయినప్పటికి అప్పుడప్పుడు గొడవలు జరుగుతుండేవని గ్రామస్తులు తెలిపారు. పనుల మీద బయటకు వెళ్లిన రాములు, కొంత కాలం క్రితమే రేణుకకు ఒక ఇంటిని నిర్మించి ఇచ్చాడు. ఆ ఇంటిలోనే రేణుక నివాసం ఉంటుంది. ఇటీవల గర్బవతి కావడంతో కూలీ పనులకు కూడా వెళ్లడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఒంటిరిగా ఉన్న మహిళపై ఇటీవల పెద్ద భార్య రేణుకతో, ఆమె ఇద్దరు కొడుకులతో తిరుమలకు గొడవలు జరిగాయని గ్రామస్తులు మీడియాకు తెలిపారు. ఈ నేపథ్యంలోనే రేణుక కుమారులే గొంతు కోసి హత్య చేసి ఉంటారని పోలీసులు రాములు ఇద్దరు కొడుకుల కోసం గాలిస్తున్నారు. ఈ సంఘటన ఇల్లందకుంట, జమ్మికుంట మండలాలలో శనివారం రాత్రి తీవ్ర భయాభ్రాంతులకు గురి చేసింది. జరిగిన సంఘటనపై సిఐ లక్ష్మినారయణ సమగ్ర విచారణ జరుపుతున్నట్లు నిందితులను పట్టుకుంటామని వెల్లడించారు.

# కామారెడ్డి రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

### యధావిధిగా రాకపోకలు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** భారీ వర్షాల కారణంగా కామారెడ్డి, నిజామా బాద్ జిల్లాల్లో రైల్వే ట్రాక్ ధ్వంసమైంది. దీంతో అటు నుంచి రాకపోకలు సాగించే కొన్ని రైళ్లన్ని రద్దు చేయగా.. మరికొన్నింటిని నిలిపివేశారు. అయితే రైల్వే ట్రాక్ పనులను దాదాపు మూడు రోజుల పాటు రైల్వే సిబ్బంది శ్రమించి మరమ్మతులు పూర్తిచేయడంతో యధావిధిగా రాకపోకలు సాగుతున్నాయి. గతేడాది ఆగస్టు నెలలో ఖమ్మం జిల్లాను అతలాకుతలం చేసింది తెలిసిందే. అయితే ఈ ఏడాది వర్షాలకు కామారెడ్డి జిల్లాను కోలుకోలేని స్థితికి నెట్టాయి. కుండపోత వర్షాలతో జనజీవనం పూర్తిగా స్తంభించి పోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అవ్వడంతో అక్కడి స్థానికులకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వర్షాలు, వరద తగ్గిన తర్వాత వారిని తమ స్వస్థలాలకు పంపించేశారు. అయితే.. వర్షాల కారణంగా తెలంగాణలో రైల్వే సర్వీసులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలో తలమడ్ల సమీపంలో ట్రాక్ కొట్టుకుపోవడంతో సికింద్రాబాద్-నిజామాబాద్ మధ్య రైళ్లు మూడు రోజుల పాటు పూర్తిగా నిలిచిపోయాయి. రవాణా అంతరాయం వల్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారు. అయితే రైల్వే అధికారులు అత్యవసరంగా బృందాలను పంపించి, దాదాపు మూడు రోజులు మరమ్మతు పనులు జరిపి ట్రాక్‌ను మళ్లీ సిద్ధం చేశారు. తొలుత ఒక డెమో ట్రైన్ నడిపి సేఫ్టీ చెక్ చేసిన అనంతరం సర్వీసులు మళ్లీ ప్రారంభించారు. తిరుపతి- నిజామాబాద్ రాయలసీమ ఎక్స్‌ప్రెస్ తలమడ్ల స్టేషన్ మీదుగా నడవడం రైళ్ల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకున్న సంకేతంగా నిలిచింది. ఈ వరదల ప్రభావంతో దక్షిణ మధ్య రైల్వే తమ నిత్య సేవల్లో పలు మార్పులు చేసింది. కొన్ని రైళ్లను పూర్తిగా రద్దు చేయాల్సి వచ్చి.. మరికొన్ని రైళ్లను పాకికంగా రద్దు చేయడం లేదా కొత్త టైమ్ టేబుల్ ప్రకారం నడపడం జరిగింది. భిక్నూర్-తలమడ్ల, అక్కన్నపేట-మెదక్, గజ్వేల్- లకుడారం, బోల్టా-కర్ఖేలి మధ్య సెక్షన్లు నీట మునిగిన కారణంగా రైలు సర్వీసులకు ఆటంకం ఏర్పడింది. దీంతో ప్రయా ణికులు గమ్య స్థానాలకు చేరుకోవడంలో ఇబ్బం దులు ఎదుర్కొ న్నారు. అయితే రైల్వే అధి కారులు ఈ సమస్య లను తక్షణమే పరిష్కరిం చేందుకు కృషి చేశారు. అయితే ఇండియన్ రైల్వే, దక్షి ణ మధ్య రైల్వే తమ అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా సర్వీసుల రద్దు, మార్గమార్పులు, రీషెడ్యూల్ వివరాలను అందించి ప్రయాణికులకు ముందస్తు సమాచారం ఇచ్చాయి. ప్రస్తుతానికి ట్రాక్ మరమ్మతులు పూర్తయి సర్వీసులు పునరుద్ధరించబడటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అవాంతరాలు రాకుండా వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. ఈ చర్యలతో రాబోయే మాన్సూన్ కాలంలో రైల్వే రవాణా మరింత సురక్షితంగా ఉంటుందని చెబుతున్నారు.



# వరదల వేళ ఉండాల్సింది ప్రజల్లో .. అసెంబ్లీలో కాదు

### మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

### ఆయన అనుచరులు మంత్రి పదవి కోసం అసెంబ్లీ వద్ద నిరసన

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** వరద సమయంలో మనం ఉండాల్సింది ప్రజల్లో కానీ అసెంబ్లీలో కాదని ఈ సమయంలో ప్రజల్లో ఉండి, వారి కష్టాలు తీర్చడమే తన లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ సభ ప్రారంభం కాబట్టి అసెంబ్లీకి వచ్చానని ఇక రేపటి నుంచి రానని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తన అనుచ రులు, మద్దతుదారులతో కలిసి హైదరాబాద్‌కు వచ్చిన ఆయన గన్‌పార్క్ వద్దకు చేరుకుని అమర వీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు వరద కష్టాల్లో ఉన్నారని, వారికి అండగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. కామారెడ్డి ప్రాంతంలో వరదల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. తన అనుచరులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించి వారికి అండగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. అందువల్లే తాను అసెంబ్లీకి మళ్లీ రానని వివరించారు. ఇక మంత్రి పదవిపైనా రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరికైనా సరే పదవి శాశ్వతం కాదని అన్నారు. మంచి వ్యక్తిత్వం, సేవ చేయాలనే గుణమే శాశ్వతమని పేర్కొన్నారు. సేవాగుణం చచ్చేవరకూ ఉంటుందని.. కానీ పదవి మాత్రం ఉండదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా కాకుండా ఒక వ్యక్తిగా సహాయం చేస్తానని ప్రకటించారు. ప్రభుత్వమే అన్నీ చేయాలని అనుకుంటే సాధ్యం కాదు కదా అంటూ వ్యాఖ్యానించారు. మరోవైపు అసెంబ్లీ వద్ద కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరులు బల ప్రదర్శనకు దిగారు. తమ నాయకుడికి మంత్రి పదవి ఇవ్వాలంటూ నిరసనకు దిగారు.

# యూరియా కోసం ధర్నా చేస్తున్న ప్రజాప్రతినిధుల అరెస్టు

### వ్యవసాయ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ బిఆర్‌ఎస్‌కు ప్రజా ప్రతినిధులు శనివారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన అసెంబ్లీ వద్ద నుంచి ప్రారంభమై బషీర్‌బాగ్‌లోని రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయం వరకు జరిగింది. ప్రదర్శనలో ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ప్లకార్డులు చేబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వారు రాష్ట్ర వ్యవసాయ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. అప్పటికే అక్కడ మెహరించిన పోలీసులు వారిని బలవతంగా అరెస్టు చేశారు. అరెస్టుయిన వారిలో బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, పలువురు మాజీ మంత్రు లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు ఉన్నారు. అంతకు ముందు టి.హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియాను సరఫరా చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు.

ఏ రాష్ట్రంలో కూడా యూరియా కొరత లేదని, ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఉందన్నారు. గత ప్రభుత్వంలో కరోనా సమయంలో సైతం యూరియా కొరత లేకుండా పంపిణి చేసిందన్నారు. బిజెపి, కాంగ్రెస్ ఒకరిపై మరొకరు నేపం వేసుకుని తప్పించుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు యూ రియా సరఫరా చేయలేకపోతే తప్పుకోవాలని, తాము రాజకీయాల కోసం రాలే దని కేవలం రైతుల కోసం వచ్చామని హరీష్‌రావు స్పష్టం చేశారు.

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ యూరియా కోసం వెళ్లే రైతులపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై ప్రభుత్వం ఒక్కరోజు కూడా సమీక్ష చేయలేక పోయిందని ఆరోపించారు. ఈ ధర్నాలో మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు తదితరులు

## రోగులను పరీక్షిస్తూ గుండెపోటుతో చనిపోయిన కార్డియాక్ సర్జన్!



**చెన్నై, ఆగస్టు 30:** హృద్రోగ బాధితులకు చికిత్స చేసి ప్రాణాలు కాపాడే వైద్యుడు అదే గుండెపోటుతో మరణించాడు. ఆసుపత్రిలో రోగులను పరీక్షిస్తూ ఒక్కసారిగా కుప్పకూలాడు. ఆయనను కాపాడేందుకు తోటి వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తమిళనాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సేవలందిస్తున్న యువవైద్యుడు బుధవారం రాత్రి కన్ను మూశాడు. ఓ కార్డియాక్ సర్జన్ గుండెపోటుతో చనిపోవడంపై వైద్య వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డాక్టర్ గ్రాడ్లిన్‌రాయ్ (39) కార్డియాక్ సర్జన్ గా సేవలందిస్తున్నారు. బుధవారం రాత్రి ఆసుపత్రిలో విధుల్లో ఉన్నారు. హృద్రోగ వార్డులోని పేషెంట్లను పరీక్షిస్తుండగా రాయ్ గుండెపోటుకు గురయ్యారు. అకస్మాత్తుగా కుప్పకూలిన డాక్టర్ రాయ్ ను వెంటనే ఐసీయూకు తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోయిందని గ్రాడ్లిన్ రాయ్ ప్రాణాలు కోల్పోయారని ఆసుపత్రి అధికారులు తెలిపారు. హృద్రోగాలపై పూర్తి అవగాహన కలిగిన కార్డియాక్ సర్జన్ అదే గుండెపోటుతో మరణించడంపై వైద్య వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రాడ్లిన్ రాయ్‌కు ఎలాంటి అనారోగ్య సమస్యలు కూడా లేవని ఆయన సహచర వైద్యుడు సుధీర్ కుమార్ పేర్కొన్నారు. వైద్యులు రోజుకు 1218 గంటలు పనిచేయాల్సి వస్తుందని, అందువల్ల వారిపై ఒత్తిడి అధికంగా ఉంటుందని అన్నారు. రాయ్ మరణానికి ఇదే కారణమై ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.



బోథ్ మండలం బజార్‌హత్నూర్‌లో గంజాయి సాగుచేస్తున్న రైతును పోలీసులు అరెస్టు చేసిన దృశ్యం

## బోథ్ మండలంలో గంజాయి సాగుచేస్తున్న రైతు అరెస్టు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** తెలంగాణ కాశ్మీర్‌గా పేరొందిన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో గంజాయి సాగు చేస్తున్న ఓ రైతును పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివరాలు ఇలావున్నాయి. మండల పరిధిలోని బజార్‌హత్నూరులో గంజాయి సాగు అవుతుం దని అందిన సమాచారం మేరకు బోథ్ పోలీసులు శనివారం ఉదయం పొలాల్లో తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా బాలేరావు అనిల్ అనే రైతు తన వ్యవసాయ పొలంలో 60 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు గుర్తించారు. పత్తి పంట మధ్య గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు పోలీసు లు గుర్తించారు. వీటి విలువ సుమారు ఆరు లక్షల రూపాయలు వుంటుందని పోలీసుల విచారణలో తేలింది.

కాగా పోలీసుల తనిఖీ సమయంలో పొలంలోనే వున్న బాలేరావు అనిల్ పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. అనంతరం గంజాయి మొక్కలను ధ్వంసం చేయడంతో పాటు నిందితుడిని రిమాండుకు తరలించారు. గంజాయి సాగు చేసే రైతులపై చర్యలు తీసుకుంటామని బోథ్ సిఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు.

## తప్పులు చేసి 'పవర్‌పాయింట్' ఇస్తారా?

### బిఆర్‌ఎస్ నేతల కాళేశ్వరం ప్రాజెక్టు ప్రెజంటేషన్‌పై మంత్రి శ్రీధర్‌బాబు విసుర్లు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** కాళేశ్వరం అంశంపై బిఆర్‌ఎస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ గురించి శాసనసభ వ్యవహారాల ఇంఛార్జి, మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. శనివారం మొదటి రోజు అసెంబ్లీ సమావేశాలు ఉదయం ప్రారంభం అయ్యాయి. సమావేశాలకు ముందు మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తప్పులు చేసింది అందరికి తెలుసునన్నారు. అయితే మళ్లీ కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఎందుకు? అని బిఆర్‌ఎస్ నేతలను ప్రశ్నించారు. ఏమైనా ఒప్పులు చేస్తే అవకాశం ఉంటుందన్నారు. సభలో ఎవరికైనా ఆర్డర్ ప్రకారం మాట్లాడడానికి అవకాశం ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL - II,
AT: Triveni Complex, 1st Floor, Abids, Hyderabad
OA No. 539 OF 2025
BETWEEN:
M/s. YES Bank Ltd. ....Applicant
And
Mr. Boddu Sushman Reddy ....Defendants
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
Mr. Boddu Sushman Reddy
S/o. Ram Dharma Reddy,
Aged about 46 years, Occ: Business, R/o. Flat No. 101, 1st Floor, Palm Spring Apts, Kompally, Medchal Malkajgiri, Hyderabad- 500014.
Also at: Mr. Boddu Sushman Reddy
C/o. Srikara Hospital, #3-634A, Main Road, NH 44, Kompally, Hyderabad - 500014.
....Defendant/s
Please take the summons in the above O.A. No. 539/2025 filed by the applicant for recovery of money of Rs.24,98,341.95/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" daily newspaper and posted the matter to 07/10/2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original Application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 07/10/2025 at 10.30 A.M at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 29th of August, 2025.
(By order of the Court)
Signature of the Officer Authorised to issue Summons

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL - II,
AT: Triveni Complex, 1st Floor, Abids, Hyderabad
OA No. 538 OF 2025
BETWEEN:
M/s. YES Bank Ltd. ....Applicant
And
M/s. Panchawati Silks & Anr ....Defendants
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
1. M/s. Panchawati Silks
Rep. by its Partner Mr. Golchha Siddhant
# Unit No. 8, H.No. 6-3-348, Midtown Complex, Dwarakapuri Colony, Hyderabad - 500034
2. Mr. Golchha Sidhant S/o. Golchha Bimal
Aged about 33 years, Occ: Business R/o. H. No. 6-2-39/27, Chandrika Colony, Pillar No. 293, Rajender Nagar, Hyderabad-500052
Also at: Mr. Golchha Sidhant
# Unit No. 8, H.No. 6-3-348, Midtown Complex, Dwarakapuri Colony, Hyderabad-500034.
....Defendant/s
Please take the summons in the above O.A. No. 538/2025 filed by the applicant for recovery of money of Rs.24,36,040.23/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" daily newspaper and posted the matter to 07/10/2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original Application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 07/10/2025 at 10.30 A.M at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 29th of August, 2025.
(By order of the Court)
Signature of the Officer Authorised to issue Summons

ఈ యేడు ప్రకృతి వైపరీత్యం కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో లక్షలాది ఎకరాల పంట నీట మునిగి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాల కారణంగా వివిధ రకాల చేతికి వచ్చిన పంటలు నీటి పాలుకాగా, తాజాగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పెద్ద మొత్తంలో పంటలకు నష్టం వాటిల్లింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఈ భారీ వర్షాల కారణంగా పలు జిల్లాల్లో వ్యవసాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, అరటి, మిర్చి వంటి పంటలకు నష్టం వాటిల్లింది. నీరు నిలిచిపోవడం, వరదలతో పంటలు కొట్టుకుపోవడం, పొలాల్లో ఇసుక మేటలు వేయడం వంటి కారణాలతో రైతులు అపార నష్టాన్ని



ఎదుర్కొంటున్నారు. రెండు రాష్ట్రాల్లో గత నాలుగు రోజులుగా అత్యంత భారీ వర్షాలు పడ్డాయి. భారీ వర్షాలతో రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. కొన్నిచోట్ల కట్టలు తెగిపోయి. దీంతో చెరువులు, వాగులు, వంకలు పొంగిఊరిమీద, పొలాల మీద, చేపల చెరువుల మీద పడ్డాయి. ఎక్కడికక్కడ వరదనీటిలో పంటలు కొట్టుకుపోయాయి. పలుచోట్ల పంటపొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో వేలాది మంది రైతులకు తీరని నష్టం మిగిలింది. పొలాల్లోనే నీళ్లు నిలవడంతో పంటలు మురిగిపోయే పరిస్థితి ఏర్పడింది. దెబ్బతిన్నపంటలో ప్రధానంగా వరి, పత్తి, కూరగాయల తోటలు అత్యధికంగా ఉన్నాయి. పత్తిపూత దశలో ఉండటం, వరినాట్లు పూర్తయిన నేపథ్యంలో వర్షాలు, వరదల ప్రభావం వీటిపైతీవ్రంగా చూపించాయి. పత్తి కాత దశలో ఉండగా, పెసర చేన్లు చాలావరకూ చివరి దశలో ఉన్నాయి.

# పంటలు వరదపాలు

**సిహెచ్ వి వి రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వర్ష బీభత్సం అన్నదాతకు అపారనష్టాన్ని మిగిల్చింది. ఈ సంవత్సరం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నాటి నుంచి నాలుగు దఫాలుగా వర్షాల కారణంగా పంటలు నీట మునగగా, రైతులకు తీరని నష్టం వాటిల్లింది. తెలంగాణలో వరదల నేపథ్యంలో వివిధ జిల్లాల్లో 12 మంది మృత్యువాతపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.10 లక్షల ఎకరాల్లోని పంటలకు నష్టం జరిగినట్లు తెలుస్తున్నది. దీంతో వేలాది మంది రైతులకు తీరని నష్టంమిగిలింది. ఇందులో 1.80 లక్షల ఎకరాల్లోని పత్తిచేలు నీట మునిగాయి. అలాగే మరో 1.30 లక్షల ఎకరాల్లో వరిచేలు వరద ముంపునకు గురైంది. రాష్ట్రంలోని మెదక్, సంగారెడ్డి, నల్లగొండ, కొత్తగూడెం, జనగాం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట్, ములుగు, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, హన్మకొండ తదితరజిల్లాల్లో అత్యధికంగా పంటలు నీట మునిగాయి. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 5 లక్షలకు పైగా ఎకరాల్లో పంట నీట మునిగినట్లు అంచనా వేస్తున్నారు. భారీ వరదలు ప్రవహించడంతో పొలాల్లో ఇసుక మేటలు వేసింది. పొలాల్లోనే నీళ్లు నిలవడంతో పంటలు మురిగిపోయే పరిస్థితి ఏర్పడింది. కామారెడ్డి, నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో పంటలు నామారూపాల్లేకుండా పోయాయి. ఎక్కడ చూసినా పంటపొలాల్లో నీళ్లు, ఇసుక దిబ్బలే కనిపిస్తున్నాయి. భారీ వరదలకు చాలాచోట్ల పంట కొట్టుకుపోయింది. వర్షాలతో పూతకొచ్చిన పత్తి పాడైపోతున్నది. మిగిలిన పంట చేలల్లో రోజుల తరబడి వర్షపు నీరు నిలిచి, పత్తి ఎర్రబారి దిగుబడి తగ్గుతుంది. వర్షాలు మరికొన్ని రోజులు వస్తే పంటపై గులాబీ పురుగు సోకే ప్రమాదం ఉంది. ఓవైపు వర్షాలు, మరోవైపు గులాబీ పురుగుతో పత్తి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిర్మల్‌జిల్లాలోని ముజ్గి, తాంశ, చిట్యాల్ మంజులాపూర్ శివారులో దాదాపు 100 ఎకరాల వరకు వరిపంట నీట మునిగింది. అలాగేసోన్ మండలం కడ్తాల్‌లో స్వర్ణ వాగు ఉప్పొంగడంతో పొలాల్లోకి భారీగా వరద నీరు చేరుకున్నది. కుంటాల మండలంలోని వెంకూర్ శివారులో పత్తి, సోయా పంటలు పూర్తిగా నీట మునిగాయి. జిల్లాలో చాలాచోట్ల వరితో పాటు, పత్తి, సోయా, మక్క పంటలు నీట మునిగాయి. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో వరద నీటితో వందలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. భూపాలపల్లి జిల్లాలోని మోరంచవాగు పరీవాహక ప్రాంత పంట పొలాలన్నీ వరదనీటిలోనే మునిగాయి. పలిమెల మండలం లెంకలగడ్డలో వేసిన ఎకరం మిరపనారు కొట్టుకుపోయింది. ఖమ్మం జిల్లాలోని పెద్ద చెరువు కింద



పంట పొలాలన్నీ పూర్తిగా నీటమునిగాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 15,686ఎకరాల్లో పంటల నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. సంగారెడ్డి జిల్లాలో 2,000 ఎకరాలు, మెదక్‌లో 6,341 ఎకరాలు, సిద్దిపేటలో 7,345 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. చిన్నశంకరంపేట శివారులో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. నిజాంసాగర్ దిగువ అనేక గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. నందిగామలోని పౌల్ట్రీ ఫాంలో 10వేల కోళ్లు మృత్యువాతపడ్డాయి. మంచిర్యాల జిల్లాలో నాట్ల దశలో ఉన్న వరి వరదల్లో కొట్టుకు పోగా, ఏపుగా పెరుగుతున్న పత్తిపంట పూర్తిగా నీట మునిగింది. వికారాబాద్ జిల్లాలో 7,781 మంది రైతులకు చెందిన 13,126 ఎకరాల్లో పంటలు వరదపాలయ్యాయి. భీమిని, తాండూరు, మందమర్రి, నెన్నెల, వేమనపల్లి, కన్నెపల్లి, కోటపల్లి, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, కాసిపేట, హాజీపూర్, చెన్నూరు, జైపూరు, జన్నారం మండలాల్లో 3,215 మంది రైతులకు చెందిన 4,964 ఎకరాల వరి పంట నీటమునగగా, 4,538 మంది రైతులకు చెందిన 8,107 ఎకరాల పత్తి చేలలో నీరు నిలిచింది. అలాగే 13 మంది రైతులకు చెందిన 35 ఎకరాల మిర్చి, 15 మందికి చెందిన 20 ఎకరాల కూరగాయల సాగు సైతం వర్షార్పణం అయింది. వర్షాల కారణంగా వరికి ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.4,96,40,000 నష్టం వాటిల్లగా, పత్తి పంటకు ఎకరాకు రూ.15వేల చొప్పున మొత్తం రూ.12 కోట్ల 16లక్షల 5వేలవరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఒక్క పాత మంచిర్యాలలోనే సుమారు 100ఎకరాలకుపైగా పత్తి పంట నీట మునిగింది. అయితే ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారం తెలంగాణలో 2.20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కామారెడ్డిలో 77 వేల ఎకరాలు నష్టపోయినట్లు గుర్తించారు. ఆగస్టు నెలలో కురిసిన భారీవర్షాలు రాష్ట్రవ్యాప్తంగా పంటలకు తీవ్ర నష్టం కలిగించాయని తెలిపింది. మొత్తం 28 జిల్లాల్లో 2.20లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 1.43,304 మంది రైతులు నష్టపోయా అత్యధికంగా కామారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పంటల నష్టం ఎక్కువగా నమోదైంది. కామారెడ్డి జిల్లాలోనే 77,394 ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. మెదక్ జిల్లాలో 23,169 ఎకరాలు, ఆదిలాబాద్‌లో 21,276 ఎకరాలు, నిజామాబాద్‌లో 18,417 ఎకరాలు, ఆసిఫాబాద్ జిల్లాలో 15,317ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. ఆ తర్వాత అత్యధికంగా నష్టపోయిన జిల్లాల్లో మంచిర్యాల, ఖమ్మం, నిర్మల్, సూర్యపేట, సిద్దిపేట సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, గద్వాల, పెద్దపల్లి, వనపర్తి, భూపాలపల్లి, మహబూబ్‌నగర్, ములుగు, సిరిసిల్లా, నాగర్ కర్నూల్, నల్గొండ, జగిత్యాల రంగారెడ్డి, కరీంనగర్, మేడ్చల్, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాలు ఉన్నాయి. పంట పొలాల్లో ఇసుక మేట వేసింది. జిల్లాల వారీగా చూస్తే వరి పంట అత్యధికంగా దెబ్బతింది. మొత్తం 1.09లక్షల ఎకరాలు వరి నీటమునిగింది. పత్తి 60వేల ఎకరాలు నష్టం చవిచూసింది. మొక్కజొన్న 16వేల ఎకరాలు, వేరుశనగ 20వేల 900 ఎకరాల్లో దెబ్బతింది. సోయాబీన్, టమాట, మిర్చి, మినుములు, ఇతర పంటలు కూడా గణనీయంగా దెబ్బతిన్నాయి. పంట నష్టానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపనుంది. కేంద్ర సాయంతో పాటు, రాష్ట్రప్రభుత్వం కూడా కొంత కలిపి రైతులకు సాయం చేయాలన్న ఉద్దేశ్యంతో ఉంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి, విశాఖపట్నం, గుంటూరు, కృష్ణా తదితర జిల్లాలను వర్షాలు వణికించాయి. వాగులు, వంకలు పోటెత్తుతున్నాయి. ప్రమాదకర ప్రవాహాలకు అనేకగ్రామాల మధ్యరాకపోకలు స్తంభించాయి. పంటలు నీటమునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గుంటూరు, విజయవాడ నగరాల్లోని ప్రధాన రహదారులపై 2 అడుగులకుపైగా నీరు ప్రవహించింది. భారీవర్షాల దృష్ట్యాపల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మునిగిన లోతట్టు ప్రాంతాలు వర్షాలకు ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. 3వంతెనల మార్గం, కంకరగుంట, ఆర్‌యూబీ వంతెన మార్గాల్లో నీరు నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. శంకర విలాస్‌వంతెన కూల్చివేత వల్లరాకపోకలు లేక జనం అవస్థలు పడ్డారు. నగరంలోని అనేక లోతట్టు ప్రాంతాలు, శివారు కాలనీలను వరద ముంచెత్తింది. ఏటీఅగ్రహారం, చుట్టుగుంట, శ్రీరామ్‌నగర్, హనుమాన్ నగర్ కాలనీ వాసులు ముంపులో చిక్కుకున్నారు. వ్యవసాయ కమిషనర్ కార్యాలయం, రైతుబజార్‌లోకి నాలుగు అడుగుల మేర నీరుచేరింది. ఇక జిల్లాలోని తుళ్లూరు మండలం పెదపరిమివద్ద కోటేళ్లవాగు పొంగి పెదపరిమి తుళ్లూరు మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాలడుగులో పొలాలు తటాకాలను తలపిస్తున్నాయి. నల్లపాడులో రైతుల రెక్కలకష్టం నీటిముని గింది. దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర మండలాల్లో పొలాల్లోకి వరదచేరింది. పొన్నూరు నియోజకవర్గంలోనూ వర్షం వణికించింది. వర్షాలకు యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని, పంట నష్టం నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించారు. బాపట్లజిల్లాలోనూ విస్తారంగా వర్షాలు కురిశాయి. భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు మండలాల్లో పొలాలు చెరువులుగా మారాయి. కొమ్మమూరు కాల్వకు భారీగా వరద వచ్చింది. ●

# మరో 'వంగ' సమరం!

పశ్చిమ బెంగాల్

**ఎ.వి.వి ప్రసాద్**

ఎన్నికలొస్తున్నాయనుకునేసరికి ఏ పార్టీకైనా గుర్తుకు వచ్చేది ఓటరే. ఎంత రాజకీయమైనా ఆ ఓటరు చుట్టూనే తిరుగుతూంటుంది. ఓటు, ఓటరు అనే రెండు మాటలే వేద మంత్రంలా వినిపిస్తూంటాయి. బీహార్‌లో దృశ్యం చూస్తే అన్ని రాజకీయ పార్టీలు ఎలా ఓటు చుట్టూ తిరుగుతున్నాయో బాగా అర్థమవుతుంది. కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీఓటరు అధికార యాత్ర నిర్వహిస్తూ అధికార ఎన్డీయే గుండెల్లో గుబులు పుట్టిస్తుంటే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా అదే రాగం అందుకొని తాము కూడా ఓటరు చైతన్య యాత్రలు నిర్వహిస్తామంటూ ప్రకటించడం ఇప్పుడు సంచలనాత్మకంగా మారింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరుగబోతుండగా, బెంగాల్‌లో వచ్చే సంవత్సరం మధ్యలో జరుగనున్నాయి. ఇంకా తగినంత వ్యవధిఉన్నా, గతవారం సిఇసి తీసుకొన్న ఓ చర్య ఆమె తక్షణమే ఆందోళన ప్రకటించేట్లు చేసిందనిపిస్తుంది. అందుకే ఓటర్లలో 'చైతన్యం' కోసం మమత ఇప్పటినుంచే నడుం బిగించినట్లు కనిపిస్తుంది. బీహార్‌కు, బెంగాల్‌కు మధ్య తేడాలు చాలానే ఉన్నాయి. అక్కడ బిజెపిపై విపక్ష కాంగ్రెస్ తిరగబడుతోంది. ఇక్కడ బిజెపిపై అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) సమరశంఖం పూరిస్తోంది. అందువల్ల యుద్ధం ఒకేలా కనిపించినా, విధానాల్లో వ్యత్యాసం ఉంటుంది. అక్కడ సిఎం నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జెడి(యు)నే గాక ఎన్డీయే కూటమిని అధికారం నుంచి తొలగించి ఈసారి ఎలాగైనా కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడానికి రాహుల్ ముమ్మరంగానే ప్రయత్నిస్తున్నారు. బెంగాల్‌లో బిజెపి అధికారంలో లేదు కనుక, ప్రధాన విపక్షంగా ఉన్న ఆ పార్టీ ముందుకు రాకుండా కళ్లెం వేయడానికి అధికార టిఎంసితరఫున సాక్షాత్తు మమతే బరిలోకి దిగు తున్నారు. 'అవాస్తవిక ఓటర్ల'ను జాబితాలనుంచి తొలగించడానికి 500 టీమ్‌లను రాష్ట్రానికిసిఇసి పంపిస్తున్నదని తెలియగానే బిజెపి కుట్రను ఎదుర్కొనడానికి ఆమె ఈ వ్యూహం రూపొందించినట్లు కనబడుతోంది. బీహార్‌లో రాహుల్ నిర్వ హిస్తున్న ఓటరు అధికార యాత్ర ప్రభావం గణ నీయంగానే కనిపిస్తుండడంతో మమత కూడా అదే తరహా యాత్ర జరుపనున్నారనే విషయం దీనితో స్పష్టమవుతోంది. టిఎంసి విద్యార్థి విభాగం 'తృణమూల్ ఛాత్ర పరిషత్' స్థాపక దినోత్సవం సందర్భంగా గత గురువారం (28,ఆగస్టు) ఆమె ఈ ప్రకటన చేస్తూ బిజెపి కుట్రలు తమ రాష్ట్రంలో సాగనివ్వబోమంటూ ప్రతిజ్ఞ కూడా చేశారు. నిజానికి బీహార్ లో మాదిరే పశ్చిమ బెంగాల్‌లోను 'అక్రమ ఓటర్లు' అధికంగానే ఉన్నారనే ఆరోపణలున్నాయి.



మమతా బెనర్జీ

రోహింగ్యాలు, అఫ్ఘాన్, బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వారు బెంగాల్‌లో అక్రమ ఓటర్లుగా చెలామణి అవుతున్నారని ఇసి గతంలోనే చెప్పింది. అందుకే బీహార్ తరహాలో ఇక్కడ కూడా 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నిర్వహించాలని ఇసి నిర్ణయించింది. బీహార్‌లో 'సర్'ద్వారా దాదాపు 65లక్షల అక్రమ ఓటర్లను తొలగించినట్లు ఇసి ప్రకటించగానే బెంగాల్ ముఖ్యమంత్రిలో ఆందోళన మొదలైంది. బీహార్ ఓటర్ల తొలగింపు వివాదం సుప్రీం కోర్టు దాకా వెళ్లడం, తొలగించిన ఓటర్ల జాబితాను ఇసి ప్రకటించడం జరిగాయి. ఆ వివాదం ఇంకా రగులుతూనే ఉంది. 'బల ప్రయోగంతో మాత్రమే ఎవరూ విజయం సాధించలేరు. మీ సీక్రెట్లను మేమూ బహిర్గతం చేస్తా'మంటూ మమత గత వారం సమావేశంలో ఓ సవాల్ కూడా విసిరారు. 'ప్రజల ఆశీస్సులతో మేం అధికారం లోకి వచ్చాం, కుట్రలు చేసి కాదు' అంటూ నిశితంగానే విమర్శించారు. 'బిజెపికి లాలీపాప్ లామారితే ఇసి ఉనికే ప్రశ్నార్థకమవుతుంది' అంటూఎన్నికల సంఘానికి ఓ హెచ్చరిక కూడా విసిరారు. ఇదంతా చూస్తుంటే రానున్న ఎన్నికలకు ఆమె సమర భేరి మోగించినట్లుగానే స్పష్టమవుతుంది. బీహార్‌లో 'ఓట్ల చోరీ'కి పాల్పడుతున్న బిజెపి ఆటలు బెంగాల్‌లో సాగనివ్వబోమంటూ మరో చురక వేశారు. బీహార్, బెంగాల్‌లో కనిపిస్తున్న అలజడే తమిళనాడులో కూడా దర్శనమిస్తోంది. తమ రాష్ట్రంలో కూడా ఓట్లను కొల్లగొట్టడానికి బిజెపి కుట్రలు పన్నుతున్నదనీ, ఆ పార్టీ ఆట కట్టించడానికి తమ వద్ద భారీ వ్యూహాలే ఉన్నాయనీ అక్కడి సిఎం స్టాలిన్ కూడా పది రోజుల క్రితమే ప్రకటించారు. తమిళనాట కూడా వచ్చే సంవత్సరమే ఎన్నికలు జరుగనున్నాయి. బీహార్‌లో 'సర్'ను ప్రయోగించిన సిఇసి బెంగాల్‌తో పాటు తమిళనాడుపై కూడా ఆ అస్త్రాన్ని ప్రయోగించనుండడంతో అక్కడా ఆందోళనకర పరిస్థితే నెలకొని ఉంది. సర్ నిర్వహణ కోసం ఎలోక్టరల్ రిజిస్ట్రేషన్ అధికారులను (ఇఆర్‌ఒ) నియమించాలంటూ రాష్ట్రఎన్నికల సంఘానికి సిఇసి గతవారమే ఆదేశాలిచ్చింది. అయితే ఇఆర్‌ఒలను రాష్ట్రసిఎస్ ఆదేశాల మేరకు నియమించవలసి ఉంటుంది. కానీ సిఎస్ సాధారణంగా ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారమే నడుచుకుంటూ ఉంటారు గనుక బెంగాల్‌లో ఈ'ఓటరు వడపోత' కార్యక్రమం ఏ మేరకు ప్రశాంతంగా సాగుతుందో చూడవలసి ఉంది. బీహార్‌లో ఉన్నది 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం గనుక సిఇసి ఆదేశాల మేరకు తేలికగానే 'సర్' నిర్వహించారు. కానీ బెంగాల్‌లో అధికారంలో ఉన్నది బిజెపికి వ్యతిరేకమైన టిఎంసి ప్రభుత్వం గనుక సర్ నిర్వహణ ఎలా కొనసాగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైపెచ్చు ముఖ్యమంత్రి స్వయంగా ఓటరు చైతన్య యాత్ర ప్రకటించడంతో సిఇసి ఆదేశాలు ఎంత వరకు పూర్తిగా అమలవుతాయనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ అధికారుల బదలీలు కూడా ఎక్కువగానే జరుగుతూంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 'సమన్వయం' ఉంటే అవన్నీ తేలికే. లేనిచోట రోజూ ఉప్పు, నిప్పులా వాతావరణం మారిపోతుంది. మమత గతవారం ప్రకటించిన 'సమరం' ఎటు తిరుగుతుందో చూడాలి. ●

# ఇక నేనే అధ్యక్షుణ్ణి!

అమెరికా

**గన్ని మోహన్**

ఓ పక్క సుంకాలతో ప్రపంచ దేశాలను వణికిస్తున్న ట్రంప్ మరోవైపునుంచి నోబెల్ శాంతి పురస్కారం కోసం లాబీయింగ్‌ల వంటి వాటితో అత్యంత బిజీగా గడుపుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకున్నట్లుగానే ఆయన వారసుడొచ్చేసాడు. 78 ఏళ్ల ఏడునెలల వయసులో ఉన్న ట్రంప్ మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అంటే తాను ముద్దుగా పిలుచుకునే 'మాగా' సాధనకు తన వారసుడిగా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ పనిచేస్తారని ప్రకటించినట్లుగానే ఆమెరికా వైస్ ఇప్పుడు అవసరమైతే అధ్యక్షపదవి చేపడతానంటూ బహిరంగంగానే ప్రకటించేసారు. దీనికంతటికీ కారణం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉందని, ఆయనకు సిరల వ్యాధి ఉందని, తరచూ కరచాలనాలు చేయడంవల్లనే వచ్చిందని చెపుతున్నా వృద్ధాప్యసమస్యలు కూడా ట్రంప్‌ను చుట్టుముడుతున్నట్లు తెలుస్తోంది. అయినా ఇప్పటికీ ఆయన ఆరోగ్యంగా ఉన్నారని, శ్వేతసౌధంలో వచ్చిన సంస్కరణలు తనకు ముచ్చటేసాయని చెప్పిన యుఎస్ వైస్‌జెడివాన్స్ అత్యవసరం అయితే అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు కూడా వెనుకాడనని చెప్పడాన్ని చూస్తుంటే గ్రాండ్ ఓల్డ్ పార్టీ (జిఒపి) రిపబ్లికన్లలో ఇపుడు నాయకత్వ మార్పుపైనా చర్చలుజరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు ట్రంప్ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన వాన్స్ తదనంతరం ఆయనకు వీరవిధేయుడిగా మారిపోయారు. పైగా అక్కడి ఆంగ్లమీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నారని, ఆయనతో కలిసి పనిచేసేవాళ్ల ఆయనకంటే చిన్నవారేనని చెపుతూ అందరికంటే ఎక్కువ సేపుపనిచేసే ట్రంప్ అందరికంటే ముందే నిద్ర లేచి పనుల్లో నిమగ్నం అయిపోతారన్నారు. ఏదేని అనుకోని భయంకర విషాదం చోటుచేసుకుంటే అధ్యక్షపదవిలోకి వచ్చేందుకు తాను సిద్ధమేనని స్పష్టంచేసారు. అమెరికా చరిత్రలో 41 ఏళ్ల పిన్నవయసులోనే 50వ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వాన్స్‌లో ఆ నాయకత్వ లక్షణాలు కూడా పుష్కలంగానే ఉన్నాయని చెప్పవచ్చు. దీనికంతటికీ కారణం దక్షిణకొరియా అధ్యక్షుడు లీజే మ్యూంగ్‌తో చర్చలు జరిగిన సమయంలో అధ్యక్షుడు ట్రంప్ చేతికి పెద్ద గాయం కనిపించింది. దీనితో ప్రపంచ మీడియా ట్రంప్ ఆరోగ్యంపై పలు కథనాలు ప్రచురించాయి. వయోభారం కూడా మీదపడుతున్నది. రెండు మూడునెలలు ఆగితే ట్రంప్ 79ఏళ్ల వయసులోకి వచ్చేస్తారు. నిజానికి ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ ఆస్ప్రిన్ అత్యధికంగా వినియోగించడంవల్ల ఈ గాయం ఏర్పడినట్లు శ్వేతసౌధం కూడా వివరణ ఇచ్చింది. అధ్యక్షుడు ట్రంప్ ప్రజల మనిషి అని అమెరికా చరిత్రలో ఇతర అధ్యక్షులకంటే ఎక్కువగా ఆయన ప్రతిరోజూ అమెరికన్లను, ప్రపంచదేశాధినేతలను కలుసుకుంటూ వారితోకరచాలనం చేస్తుంటారని ఆందోళన చెందాల్సిన పనిలేదంటూట్రంప్ అనారోగ్యాన్ని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా వివరణ




జెడివాన్స్

ఇచ్చి సర్దుబాటు ప్రయత్నం చేసారు. ఈ ఏడాది గత జూలైలోనే ఒక పర్యాయం ట్రంప్ కాళ్లపై కనిపించిన వాపు ఆయన ఆరోగ్యంపై అనుమానాలను మరింత పెంచింది. ఆ సమయంలోనే వైట్‌హౌస్ వైద్యుడు డాక్టర్ సీన్ బార్బబెల్లా ఆయనకు 'క్రానిక్ వీనస్ ఇన్సఫిషియెన్సీ' అనే వ్యాధి ఉందని నిర్ధారించారు. 70ఏళ్లకంటే ఎక్కువ వయసున్న వారిలో సహజంగా కనిపించే ఒకవ్యాధి అని ఈవ్యాధి సిరల్లో రక్తప్రసరణ సరిగాలేకపోవడంవల్ల వస్తుందని వివరించారు. ఈ నెలారంభంలోనే ఒక ఫిజియో థెరపిస్టు మాట్లాడుతూ కంజెసివ్ హార్ట్ ఫెయిల్యూర్, క్రానిక్ కిడ్నీ డిసీజ్‌లు వంటివాటితో ట్రంప్ బాధపడుతున్నారని, కేవలం ఏడాదిలోపు ఇవి నివారించుకోవడం ఆయనకు కష్టమేనన్న నివేదిక ప్రకటించారు. రెండేళ్ల క్రితం ట్రంప్ కరోనరీ కాల్షియం స్కోరు 133గా ఉందని, దీనివల్ల ఆయనకు కరోనరీ ఆర్టరీ డిసీజ్ ముప్పు సూచిస్తుందని కార్డియాలజిస్టులు సైతం వెల్లడించారు. అయితే వైట్‌హౌస్ వైద్యులు తమ నివేదికలో ఎలాంటి గుండెజబ్బులు లేవని నిర్ధారించారు. ఈ వివరణలతో ట్రంప్ ఆరోగ్యంపై వస్తున్న కథనాలకు తాత్కాలిక తెరపడినప్పటికీ తాజాగా ఉపాధ్యక్షుడు వాన్స్ చేసిన ప్రకటనతో మళ్లీ అగ్రరాజ్యం అధ్యక్షుడి ఆరోగ్యంపై అనుమానాలు పెరిగాయి. దీనికితోడు ట్రంప్ ఇటీవలికాలంలో మీడియా ముందుకు రావడంలేదు. ఇవన్నీ కూడా ఆయన ఆరోగ్యంపై చర్చలకు మరింత ఊతం ఇచ్చాయి. ఇక రెండుసార్లు అధ్యక్షపదవిచేపట్టిన తర్వాత అమెరికాకు యువతరం బాధ్యతలు తీసుకోవాలని అక్కడి పౌరుల ప్రధానకాంక్షగా కూడా ఉంది. ఉపాధ్యక్షుడుగా 200 రోజులు పూర్తిచేసిన తన పదవీకాలం ఒక గొప్ప అనుభవం అని 'దిబెస్ట్ ఆన్‌ది జాబ్ ట్రైనింగ్' అని అభివర్ణించిన వాన్స్ ఒకవేళ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాల్సి వస్తే ఆయనకు పోటీకూడా లేకుండాపోలేదు. విదేశాంగ మంత్రి మార్కో రుబియో, మార్క్ రుట్టే వంటి వారు పోటీలో ఉన్నా ఆనాడు ఉపాధ్యక్ష పదవికి ట్రంప్ స్వయంగా వాన్స్ పేరును ఎంపిక చేసుకుని ప్రకటించారు. దీనికితోడు వాన్స్ కూడా తనదైన శైలిలో ట్రంప్‌పాలన తీరుకు ఎక్కడా భిన్నత్వంలేకుండా కొనసాగిస్తూ వచ్చారు. భారత్ పర్యట నతోపాటు జి20, జి7 వంటి దేశాలతో నెరపిన సంబంధాలు, ఆపై ఉక్రెయిన్ యుద్ధ విరమణకు ట్రంప్‌తో కలిసి జరిపిన సంప్రదింపులు, చర్చలు వాన్స్‌లోని రాజకీయ పరిణతిని చాటిచెప్పాయి. ప్రస్తుతం ట్రంప్ ఆరోగ్యంపై జరుగుతున్నచర్చల క్రమంలో రిపబ్లికన్లు అధ్యక్షుడిని మార్చాల్సి వస్తే ఇక ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌నే ఎంపికచేస్తారన్న భావన కూడా వ్యక్తం అవుతోంది. అందువల్లనే విషమపరిస్థితి వస్తే అధ్యక్షపదవి చేపట్టేందుకు తానుసిద్ధమేనని ప్రకటించడంతో వాన్స్‌కు అధ్యక్షపదవిపై బలమైన వాంఛఉన్నదని ఆయన మనోగతం చెప్పకనే చెపుతోంది. ఈపరిణామాల న్నింటి దృష్ట్యా భవిష్యత్తు అమెరికా అధ్యక్షుడు జేమ్స్ డేవిడ్ వాన్స్ అయినా ఆశ్చర్యపోనవసరంలేదు. ●

# ప్రగతి పథంలో పయనం - విచ్ఛిన్నకర కుట్రల పట్ల అప్రమత్తం

**యేచన్ చంద్రశేఖర్**

రెండువేల ఇరవైఐదు, రెండువేల ఇరవై ఆరు ఆర్థిక సంవత్సరానికి భారతదేశ జిడిపి 6.4 శాతానికి చేరుతుందన్న అంచనా. ప్రత్యేకించి కోవిడ్19 తరువాత కూడా ఆర్థిక ప్రగతిని కొనసాగిస్తూ తన వ్యూహాత్మక చొరవలతో నిలకడైన ఆర్థిక ప్రగతి, స్థిరమైన అభివృద్ధితో భవిష్యత్ ప్రపంచ దృశ్యాన్ని ఆవిష్కరించడంలో కీలక పాత్ర ధారిగా నిలుస్తోంది. ప్రపంచ వృద్ధికి గణనీయంగా దోహదపడుతూ 2027నాటికి ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి సిద్ధంగా ఉంది. గ్లోబల్ సౌత్‌తో సంబంధాలపై వ్యూహాత్మకంగా దృష్టి సారిస్తూ ఆధునిక సాంకేతిక పురోగతులు భౌగోళిక రాజకీయ మార్పులకు అనుగుణంగా సమ్మిళిత, స్థిరమైన వృద్ధిని పెంపొందిస్తోంది. ఆర్థికాభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత వృద్ధికి ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా మానవాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి నిరుద్యోగం వంటి సమస్యల పరిష్కారానికి అనేక చొరవలు చేపడుతోంది. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి దేశంలోని అధిక సంఖ్యాకులు మధ్య ఆదాయ వర్గానికి చేరుకునేలా ప్రజా పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వాణిజ్య సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడంపై నిరంతరం దృష్టి సారిస్తోంది. స్వదేశీకరణకు ప్రాధాన్యం, వ్యూహాత్మక విధాన సంస్కరణలు, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మేక్ ఇన్ ఇండియా చొరవ, పెరిగిన దేశీయ డిమాండ్, డిజిటల్ పరివర్తన వంటి అంశాలతో పాటు బలమైన ప్రభుత్వ మద్దతుతో ప్రైవేటు రంగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజిటల్ సేవలు, తయారీ, పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలు గత దశాబ్ద కాలంలో గణనీయమైన పురోగతిని సాధించాయి. ఎలక్ట్రానిక్స్ తయారీ (ముఖ్యంగా మొబైల్ ఫోన్లు), ఫార్మాస్యూటికల్స్, ఆర్థిక సాంకేతికత, ఇకామర్స్ ఎలక్ట్రిక్ వాహనాలు కీలకవృద్ధి రంగాలలో ఉన్నాయి. అదనంగా, 2014 నుండి ప్రైవేట్ రంగం రక్షణ, అంతరిక్షం, మౌలిక సదుపాయాలు లాజిస్టిక్స్ వంటిరంగాలలో గణనీయమైన అభివృద్ధినిసాధిస్తోంది. తమ ఉత్పత్తులు సేవల ఎగుమతుల ద్వారా అనేక కీలక రంగాలు గణనీయమైన విదేశీ మారక ద్రవ్య ఆర్జనతో జాతీయాదాయానికి దోహదపడుతున్నాయి. నైపుణ్య మానవ వనరులు, పోటీధరలు, ప్రభుత్వ మద్దతు వ్యూహాత్మక వాణిజ్య భాగస్వామ్యాలు వంటి అంశాల ద్వారా ఇది సాధ్యమవుతోంది. మేక్ ఇన్ ఇండియా ప్రోడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ వంటి పథకాలతో 2024 ఆర్థిక సంవత్సరంలో ఇంజినీరింగ్ వస్తువుల (యంత్రాలు, ఆటోమోటివ్ భాగాలు, మరియు లోహంతో సహా విస్తృత శ్రేణి ఉత్పత్తులు) ఎగుమతి 109.32 బిలియన్ అమెరికా డాలర్లతో స్థిరంగా భారతదేశపు అగ్ర ఎగుమతులలో ఒకటిగా ఉంది. ముడిచమురు నికర దిగుమతిదారుగా ఉన్నప్పటికీ, భారతదేశం గణనీయమైన శుద్ధి సామర్థ్యంతో డీజిల్, గ్యాసోలిన్ విమాన ఇంధనం వంటి శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను నెదర్లాండ్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సింగపూర్‌లకు ఎగుమతి చేస్తుంది. బంగారం, వెండి ఆభరణాల తయారీలో రాణిస్తున్న భారతదేశం వజ్రాల కటింగ్, పాలిషింగ్‌లో తన నైపుణ్యంతో ప్రపంచ కేంద్రంగా బాసిల్లుతూ ప్రధానంగా అమెరికా, హాంకాంగ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలకు వజ్రాలు, బంగారు ఆభరణాలు ఎగుమతి చేస్తోంది. ప్రపంచ ఫార్మసీగా పేరొందిన భారతదేశం జెనరిక్ ఔషధాల అతిపెద్ద సరఫరాదారుగా మాత్రమే కాక ప్రపంచ వ్యాప్తంగా సరఫరా అయ్యే 60 శాతం వ్యాక్సిన్లను ఉత్పత్తి చేస్తుంది. అంతేకాదు, కోవిడ్19 సమయంలో 160దేశాలకు కోవిడ్ వ్యాక్సిన్లు, ఔషధాలు సరఫరా చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఔషధాల ఎగుమతుల విలువ 30 బిలియన్ అమెరికా డాలర్లను దాటింది. సాంప్రదాయ వస్తువుల ఎగుమతి కాకపోయినా, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, సమాచార



సాంకేతిక (ఐటి)కన్సల్టింగ్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ వంటి సేవలు దేశానికి గణనీయమైన ఆదాయాన్ని ఆర్జిస్తాయి. భారతదేశ నైపుణ్య మానవ వనరులు, తక్కువ జీతభత్యాలు ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఐటిఆధారిత సేవలను కోరుకునే ప్రపంచ కంపెనీలను ఆకర్షిస్తుంది. ఈ ఎగుమతుల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 12.48 వృద్ధి రేటుతో 224.40 బిలియన్ అమెరికా డాలర్లు ఆర్జించింది. ఆత్మనిర్భర్ భారత్ ప్రోత్సాహం నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ రక్షణ ఎగుమతులు రికార్డు స్థాయిలో రూ.23,622 కోట్లకు (సుమారు 2.76 బిలియన్ అమెరికా అమెరికా డాలర్లు) చేరుకుంది. భారతదేశ అంతరిక్ష ఆర్థికవ్యవస్థను గణనీయంగా విస్తరించాలనే లక్ష్యంలో భాగంగా ప్రైవేట్ అంతరిక్ష సంస్థలను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రు.1,000 కోట్ల ప్రత్యేక వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు వంటి చొరవలను చేపట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, అంతరిక్ష కార్యకలాపాల కోసం భారతదేశ వాణిజ్య విభాగం, న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్, రు.3,026.09 కోట్ల ఆదాయాన్ని నివేదించింది. 2024 25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం మొత్తం వస్తువులు సేవల ఎగుమతులు రికార్డు స్థాయిలో 824.90 బిలియన్ అమెరికా డాలర్లకు చేరుకున్నాయని టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వస్త్రాలు, దుస్తుల ఎగుమతుల ద్వారా 37.70 బిలియన్ అమెరికా డాలర్ల ఆదాయం చేకూరింది. జాతీయ ఖజానాకు గణనీయంగా దోహదపడే విభిన్న శ్రేణి పరిశ్రమలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా ప్రపంచ వాణిజ్యంలో కూడా కీలక పాత్ర పోషిస్తోయి. క్వెస్ కార్ప్ నివేదిక ప్రకారం, 2025 నాటికి భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులు 4లక్షలు దాటారని అంచనా. ఈ సంఖ్య అమెరికా, చైనా కంటే అత్యధికం. ప్రపంచమంతా ఇంటర్నెట్‌తో తలమునకలవుతున్న వేళ, ప్రజలు డిజిటల్ ప్రపంచంతో అనుసంధానం అయ్యేందుకు, అధికార, అనధికార వ్యక్తిగత సమాచార మార్పిడికి సంభాషించేందుకు మొబైల్ డేటా అత్యంత కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత చౌకగా మొబైల్ డేటా అందించే దేశంగా భారతదేశం నిలుస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి రోజు అత్యల్ప లావాదేవీల నుండి అత్యధిక లావాదేవీలు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) ద్వారా జరుగుతున్నాయి. మార్చి 31, 2025 నాటికి, రికార్డుస్థాయిలో రూ. 24.77 ట్రిలియన్ల విలువ గల 19.78 బిలియన్ లావాదేవీలు నమోదయ్యాయి. మార్చి 2024తో పోలిస్తే ఇది లావాదేవీల పరంగా 36 శాతం విలువ పరంగా 25 శాతం అధికం. ఉమ్మడిగా అమెరికా, చైనా యూరప్‌లలో ఇన్ని లావాదేవీలు జరగలేదు. ఈ విధానం చిన్న, చితక వీధి వ్యాపారులనుండి భారీ వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే వారికి ఎంతో ఉపయుక్తం. పలు అంచనాల ప్రకారం జూలై2025 నాటికి, మహిళల యాజమాన్యంలోని వ్యాపారాల మొత్తం సంఖ్య 15.7మిలియన్లకు పైగా ఉంది. 2025 ప్రారంభంలో, క్రియాశీల స్టార్టప్‌లలో దాదాపు7,000 కంటే ఎక్కువ వెంచర్‌లు (7.5 శాతం) మహిళల నేతృత్వంలోనివే. భారతదేశం ఫిన్‌టెక్ రంగంలో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనడంతో మన ఫిన్‌టెక్ సామర్థ్యానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తోంది. 90 బిలియన్ అమెరికా డాలర్ల విలువైన 26 యునికార్న్‌లకు నిలయమైన భారతదేశ సెమీకండక్టర్ మార్కెట్ 13శాతం వృద్ధితో 2030 నాటికి 103 బిలియన్ అమెరికా డాలర్లకు చేరుకుంటుందని భారతదేశ ఎలక్ట్రానిక్స్ సెమీకండక్టర్ అసోసియేషన్ అంచనా. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎఫ్ఎంసిజి ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతు న్న నేపథ్యంలో ఇకామర్స్ వేగంగా వృద్ధి చెందుతోంది. 2030నాటికి మార్కెట్ విలువ 325 బిలియన్ అమెరికా డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ప్రపంచ దేశాలను ఆశ్చర్యంలో ముంచెత్తుతూ అనూహ్యమైన ఆర్థిక ప్రగతితో భారతదేశం ముందుకుసాగుతున్న వేళ పలు అంతర్గత బాహ్యశక్తులు విచ్ఛిన్నకర కుట్రలతో ప్రగతికి ఆటంకం కలిగించి దేశంలో అస్థిరతను సృష్టించే కుయుక్తులకు పాల్పడుతున్నారు. ఇటువంటి సందర్భాలలో దేశ ప్రజలంతా అప్రమత్త తను ప్రదర్శించి, విచ్ఛిన్నకర శక్తుల కుట్రలను భగ్నం చేసి, సంఘటితంగా దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు కృషి చేయాలి. ●

# బడా టెర్రరిస్టు బాగుఖాన్ హతం

## నియంత్రణ రేఖ వద్ద భద్రతా బలగాల కాల్పుల్లో మరో ఉగ్రవాది కూడా కాల్చివేత



బాగుఖాన్ (ఫైల్)

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్ పోలీసులకు 25 ఏళ్లుగా కొరకురాని కొయ్యగా మారిన గజ టెర్రరిస్టు, కాశ్మీర్‌లోకి వంద మందికి పైగా చొరబాటుదారులను పంపించిన బాగుఖాన్ (50) భద్రతా బలగాల ఎదురు కాల్పుల్లో హతమయ్యాడు. హ్యూమన్ జీపీఎస్‌గా పేరొందిన బాగుఖాన్ పాక్ ఉగ్రవాద సంస్థ హిజ్బుల్ ముజాహిద్దీన్‌కు చెందిన టాప్ కమాండర్లలో ఒకడు. పాకిస్తాన్‌లోని లాహోర్‌కు చెందిన ఈ ఉగ్రవాది 30 ఏళ్లుగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో వుంటూ సరిహద్దు నియంత్రణ రేఖ వెంబడి చొరబాటుదారులను భారత్‌లోకి అక్రమంగా పంపడంలో దిట్టగా పేరుగాంచాడు. ఇప్పటి వరకు ఇతను వంద మందికి పైగా పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపినట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. పాక్ ఆక్రమిత ప్రాంతం సరిహద్దులో గల నౌషేరా, బందిపోరా, గురెజ్ సెక్టార్ల గురించి బాగు ఖాన్‌కు పూర్తి అవగాహన వుంది. ఎలాంటి కఠినమైన పరిస్థితులు ఎదురైనా, ఎంతటి కఠిన మార్గాలలో అయినా ఉగ్రవాదులను భారత్‌లోకి చొరబడేందుకు అనువైన పరిస్థితులను కల్పించడంలో ఇతను దిట్టగా పేరొందాడు. ఈ క్రమంలోనే ఇతన్ని భద్రతా బలగాలు హ్యూమన్ జీపీఎస్‌గా పిలుస్తుంటారు. దీంతో పాటు ఇతన్ని పాక్ ఉగ్రవాదులు సముందర్ చా చాగా కూడా పిలుస్తుంటారు. అనేకసార్లు ఇతను ఉగ్రవాదులను పంపే క్రమంలో జరిగిన కాల్పుల్లో తప్పించుకున్నాడు. కాగా తాజాగా ఈ నెల 23 వ తేదీన నౌషేరా సెక్టార్ ప్రాంతంలో మరోసారి ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు యత్నిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సైన్యంతో పాటు బిఎస్ఎఫ్ బలగాలు ఆపరేషన్ నిర్వహించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన బాగుఖాన్ బృందం కాల్పులకు దిగగా సైన్యం కూడా ఎదురు కాల్పులకు దిగింది. ఈ సందర్భంగా ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. మృతుల్లో ఒకరిని మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టు బాగుఖాన్‌గా గుర్తించామని సైన్యం శనివారం ఎక్స్ ద్వారా వెల్లడించింది. బాగుఖాన్‌తో పాటు చనిపోయిన మరో ఉగ్రవాదిని ఇంకా గుర్తించలేదు. కాగా ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పైశాచిక దాడి తరువాత భద్రతా బలగాల కాల్పుల్లో 23 మంది టెర్రరిస్టులు హతమయ్యారు. వీరిలో 12 మంది పాక్ దేశస్తులు కాగా తొమ్మిది మంది స్థానిక ఉగ్రవాదులుగా సైన్యం వెల్లడించింది.




## భార్య వదిలేస్తే జాక్‌పాట్ కొట్టిన భర్త

### రాత్రికిరాత్రే కోటీశ్వరుడు

**న్యూజెర్సీ, ఆగస్టు 30:** అమెరికాలోని న్యూజెర్సీకి చెందిన మైక్ వీర్‌స్కీకి ఉద్యోగం లేదన్న కారణంతో భార్య విడాకులు ఇచ్చిన కొద్ది రోజులకే, అతడికి ఏకంగా రూ.2,280 కోట్ల లాటరీ తగలడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఉద్యోగంలేదని, ఆర్థిక అవసరాలు కూడా తీర్చలేని భర్త ఎందుకని వీర్‌స్కీ నుంచి భార్య విడిపోయి వెళ్లిపోయింది. మైక్ వీర్‌స్కీకి గత 15 ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే, అతడికి సరైన ఉద్యోగం లేదు. కనీస అవసరాలు కూడా తీర్చడం లేదని, బయటకు తీసుకువెళ్లడం లేదని భార్య తరచూ గొడవ పడేది. పదిహేనేళ్ల పాటు ఈ గొడవలు కొనసాగాయి. చివరికి విసిగిపోయిన ఆమె ఇక నీతో కలిసి జీవించలేను అంటూ విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. భార్య వదిలి వెళ్లిన తర్వాత మైక్ జీవితం ఊహించని మలుపు తిరిగింది. అతడు కొనుగోలు చేసిన ఓ లాటరీ టికెట్‌కు భారీ జాక్‌పాట్ తగిలింది. దాని విలువ అక్షరాలా 273 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 2,280 కోట్లు). దీంతో అతడు రాత్రికి రాత్రే కోటీశ్వరుడుగా మారిపోయాడు. ఈ వార్త కాస్తా సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. నెటిజన్లు దీనిపై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. విడాకులు ఒక జాక్‌పాట్, లాటరీ రెండో జాక్‌పాట్ నువ్వు డబుల్ జాక్‌పాట్ కొట్టావు బ్రదర్ అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం తెలిసి నీ మాజీ భార్య కచ్చితంగా తిరిగి వస్తుంది చూడు అని మరికొందరు జోస్యం చెబుతున్నారు. మొత్తానికి, మైక్ వీర్‌స్కీ కథ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.



## బీహార్ 'సర్' తరహాలోనే తమిళనాడులోను ఓట్ల చోరీ

### అనుమానం వ్యక్తంచేసిన సిఎం స్టాలిన్

**చెన్నై, ఆగస్టు 30:** తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ కేంద్ర ఎన్నికల సంఘంపై సంచలన ఆరోపణలు చేశారు. 'ప్రత్యేక సమగ్ర సవరణ' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో రాష్ట్రంలో ఓట్లను అక్రమంగా తొలగించే కుట్ర జరగవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బీహార్‌లో జరిగిన తరహాలోనే ఇక్కడ కూడా ఓట్లచోరీకి పాల్పడే అవకాశాలు ఉన్నాయని, పార్టీ శ్రేణులు, ముఖ్యంగా బూత్ స్థాయి ఇన్‌ఛార్జులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయనపిలుపునిచ్చారు. డీఎంకే న్యాయవిభాగం కార్యదర్శి, ఎంపీ ఎన్ఆర్ ఇళంగో కుమార్తె వివాహ వేడుకలో స్టాలిన్ తన భార్య దుర్గా స్టాలిన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం ప్రస్తుతం అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని అన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం, కేంద్రంలోని పాలకపక్షానికి అనుకూలంగా పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. బీహార్‌లో జరిగిన ఓట్ల చోరీ ఎంతటి తీవ్ర ప్రభావం చూపిస్తోందో అందరికీ తెలుసని అన్నారు. బీహార్‌లో ఓట్ల తొలగింపునకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహించిన నిరసన ర్యాలీలో తాను కూడా పాల్గొన్నానని, దానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని స్టాలిన్ తెలిపారు. అలాంటి పరిస్థితి తమిళనాడులో పునరావృతం కాకుండా డీఎంకే కార్యకర్తలు, మిత్రపక్షాల నాయకులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అధికారులు ఏవైనా తప్పులు చేయడానికి ప్రయత్నిస్తే వారిని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం చర్యలను అడ్డుకునేందుకు ఎన్ఆర్ ఇళంగో న్యాయపోరాటం చేశారని ఈ సందర్భంగా స్టాలిన్ ప్రశంసించారు. ఈ వివాహ వేడుకకు కాంగ్రెస్ సీనియర్‌నేత పి.చిదంబరం, డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రి సామినాథన్, ఎంపీ తిరుచ్చి శివా తదితర ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# సుంకాలు అమల్లోనే ఉన్నాయి..

## కోర్టు తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన



**వాషింగ్టన్, ఆగస్టు 30:** వివిధ దేశాలపై అమెరికా విధించిన సుంకాలు అమలులోనే ఉన్నాయని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం సోషల్ మీడియాలో స్పష్టం చేశారు. సుంకాలు చట్టవ్యతిరేకమంటూ అప్పీల్స్ కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వివరణ ఇచ్చారు. సుంకాలు చట్ట వ్యతిరేకమన్న న్యాయస్థానం తీర్పుపై సుప్రీం కోర్టులో సవాల్ చేసేందుకు ట్రంప్ సర్కారుకు కొంత గడువు ఇచ్చింది.'అన్ని సుంకాలు అమలులోనే ఉన్నాయి. సుంకాలు తొలగించాలంటూ అప్పీల్స్ కోర్టు అసంబద్ధమైన తీర్పు ఇచ్చింది. కానీ తుదకు విజయం అమెరికాదే. ఈ సుంకాలను తొలగిస్తే దేశానికి తీవ్ర నష్టం జరగుతుంది. ఆర్థికంగా మనం బలహీనపడతాం. మనం ధైర్యంగా నిలబడాలి' అని ఆయన తన సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు.

వాణిజ్య లోటు, ఇతర దేశాలు తమపై అన్యాయంగా విధిస్తున్న సుంకాలను అమెరికా ఇక ఎంతమాత్రం సహించదని ట్రంప్ స్పష్టం చేశారు. మిత్ర దేశమైనా ప్రత్యర్థి దేశమైనా అమెరికా కంపెనీలు, రైతులు, ఇతరులకు వాణిజ్యపరమైన అడ్డంకులు సృష్టిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. సుంకాలు రద్దు చేసిన కోర్టు తీర్పును అంగీకరిస్తే అమెరికా నాశనం అవుతుందని హెచ్చరించారు.

మేడ్ ఇన్ అమెరికా ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు, అమెరికా ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఇతర దేశాలపై సుంకాల విధింపు తప్పనిసరి అని ట్రంప్ వాదిస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టి దాదాపు 7 నెలలు అవుతోంది. రెండోసారి అధికారంలోకి వచ్చాక డొనాల్డ్ ట్రంప్ సుంకాలనే ప్రధాన ఆయుధంగా మలుచుకున్నారు. సుంకాల బెదరింపుతో పలు దేశాలను లొంగదీసుకుని డీల్స్ కుదుర్చుకునే ప్రయత్నం చేయడం, లొంగని దేశాలపై భారీగా సుంకాలను పెంచడం చేస్తున్నారు. దీనిపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమెరికాలోనే ట్రంప్ సర్కారు నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రస్తుతం భారత్, బ్రెజిల్ ఉత్పత్తులపై ట్రంప్ సర్కారు ఏకంగా 50 శాతం సుంకం విధిస్తోంది.

# ట్రంప్ అనారోగ్యంపై సోషల్‌మీడియాలో వైరల్



**వాషింగ్టన్, ఆగస్టు 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు వెల్లువెత్తాయి. శనివారం 'ఎక్స్' వేదికగా 'ట్రంప్ ఈజ్ డెడ్' అనే హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్‌లో ఉండటం కలకలం రేపింది. ఈ హ్యాష్‌ట్యాగ్‌తో వేలాది పోస్టులు వెలువడటంతో 79యేళ్ల ట్రంప్ ఆరోగ్య పరిస్థితిపై జరుగుతున్న ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసినట్టయింది. ఈ వదంతులకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు మరింత బలం చేకూర్చాయి. ఆగస్టు 27న ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఒకవేళ ఏదైనా విషాదం సంభవిస్తే, బాధ్యతలు చేపట్టేందుకు నేను సిద్ధంగా ఉన్నాను' అని అన్నారు. అయితే, అదే సమయంలో అధ్యక్షుడు ట్రంప్ చాలా చురుగ్గా, ఆరోగ్యంగా ఉన్నారని కూడా ఆయన పేర్కొన్నారు. ట్రంప్ రాత్రింబవళ్లు ఎంతో ఉత్సాహంగా పని చేస్తారు. ఆయన ఆరోగ్యం చాలా బాగుంది అని వాన్స్ వివరించారు. అయినప్పటికీ, ఆయన చేసిన 'విషాదం' అనే వ్యాఖ్యను పట్టుకుని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఊపందుకుంది. కొన్ని నెలలుగా ట్రంప్ ఆరోగ్యంపై వివిధ రకాల వార్తలు వస్తున్నాయి. జూలైలో ఆయన చేతిపై గాయపు మచ్చలు, కాళ్ల వాపులతో కనిపించడం చర్చనీయాంశమైంది. ఇటీవలి కాలంలో మళ్లీ అలాంటి చిత్రాలే బయటకు రావడం, వాటిని మేకప్‌తో కప్పిపుచ్చే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు రావడంతో అనుమానాలు బలపడ్డాయి. దీనికితోడు, ఆయన కొంతకాలంగా బహిరంగంగా కనిపించడం లేదనే ప్రచారం కూడా ఈ వదంతులకు కారణమైంది. అయితే, ఈ ప్రచారంలో వాస్తవం లేదని తెలుస్తోంది. ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో చురుగ్గానే ఉన్నారు. ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో శనివారం తెల్లవారుజామున 3:40 గంటలకు కూడా ఒక పోస్ట్ చేశారు. వాషింగ్టన్ కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 6:40 గంటల సమయానికి ఆయన ఆ పోస్టు పెట్టారు.

# నిరసన తెలిపిన బిజెపి కేడర్‌కు మిఠాయిలు పంచిన రాహుల్



**పాట్నా, ఆగస్టు 30:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన రాజకీయ యాత్రలో ఓ అనూహ్య చర్యతో అందరినీ ఆశ్చర్యపరిచారు. బీహార్‌లో తనకు వ్యతిరేకంగా నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న వారికి ఆయన స్వయంగా మిఠాయిలు అందించారు. వోటర్ అధికార్ యాత్ర నిర్వహిస్తున్న రాహుల్‌గాంధీకి భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) కార్యకర్తల నుంచి నిరసన ఎదురైంది. ఇటీవల రాహుల్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన తల్లిని ఉద్దేశించి కొందరు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వారు నల్ల జెండాలు ప్రదర్శించారు. అయితే, నిరసనకారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేయకుండా రాహుల్ గాంధీ వారి వద్దకు మిఠాయిలు పంపించి సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించారు. ఈ నిరసనల మధ్యే రాహుల్ గాంధీ తన యాత్రను కొనసాగించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పాటు ఎన్నికల సంఘం కూడా కలిసి దేశంలో ఓట్లను దొంగిలిస్తున్నాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. బీహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా చేపట్టిన ఈ యాత్ర దేశవ్యాప్త ఉద్యమంగా మారుతుందని ఆయన స్పష్టంచేశారు. ప్రధానిపై అనుచిత వ్యాఖ్యల వీడియో వైరల్ కావడంతో బీజేపీ తీవ్రంగాస్పందించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై రాహుల్ స్పందిస్తూ, సత్యం, అహింస గెలుస్తాయి, అసత్యం, హింస నిలబడవని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది దళితులు, మైనారిటీలు, మహిళలదని, కానీ మోదీ ప్రభుత్వం గెలుపు కోసం ఓట్లను దొంగిలిస్తోందని ఆయన ఆరోపించారు. బీహార్‌లో ఒక్క ఓటు కూడా దొంగతనానికి గురికాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

# ఎనిమిదినెలల్లో 841 మంది ఉరితీత

## ఇరాన్‌లో అత్యంత కఠినంగా ఉరిశిక్షలు అమలు




**టెహ్రాన్, ఆగస్టు 30:** ఇరాన్‌లో మరణశిక్షల అమలు ఆందోళనకర స్థాయిలో పెరిగిపోయిందని ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అసమ్మతి గళాలను, వ్యతిరేకతను అణచివేసేందుకు అక్కడి ప్రభుత్వం ఉరిశిక్షలను ఒక ఆయుధంగా ప్రయోగిస్తోందని ఆరోపించింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఆగస్టు 28 వరకు కేవలం ఎనిమిది నెలల వ్యవధిలోనే ఇరాన్‌లో కనీసం 841 మందికి మరణశిక్ష అమలు చేశారని యూఎన్ మానవ హక్కుల విభాగం (ఓహెచ్‌సీహెచ్‌ఆర్) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఉరిశిక్షల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు యూఎన్ నివేదిక స్పష్టం చేసింది. కేవలం జులై నెలలోనే 110 మందిని ఉరితీశారని, ఇది గతేడాది జులైలో నమోదైన సంఖ్యకు రెట్టింపు కంటే ఎక్కువని తెలిపింది. మరణశిక్షకు గురైన వారిలో మహిళలు, ఆఫ్ఘనిస్థాన్ పౌరులతో పాటు బలోచ్, కుర్దులు, అరబ్బుల వంటి మైనారిటీ వర్గాల వారు అధికంగా ఉన్నారని పేర్కొంది. పారదర్శకత లేకపోవడం వల్ల వాస్తవ మృతుల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఐరాస ప్రతినిధి రవీనా షమ్దాసాని అన్నారు. మైనారిటీలు, వలసదారులనే లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆమె వివరించారు. ఇరాన్‌లో బహిరంగంగా ఉరితీయడాన్ని కూడా ఐక్యరాజ్య సమితి తీవ్రంగా ఖండించింది. ఈ ఏడాది ఇప్పటివరకు ఏడు బహిరంగ ఉరిశిక్షలు నమోదయ్యాయని పేర్కొంది. ఇలాంటి చర్యలు ప్రజల్లో, ముఖ్యంగా వాటిని చూడవలసి వస్తున్న చిన్నారులలో తీవ్ర మానసిక క్షోభకు కారణమవుతాయని షమ్దాసాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మరో 11 మంది ఉరిశిక్ష ప్రమాదంలో ఉన్నారని ఐరాస తెలిపింది. వీరిలో ఆరుగురిపై ప్రవాస ప్రతిపక్ష సంస్థ పీపుల్స్ ముజాహిదీన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇరాన్ (ఎంఈకే) తో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో 'సాయుధ తిరుగుబాటు' అభియోగాలు మోపారు. మిగిలిన ఐదుగురిని 2022 నాటి నిరసనల్లో పాల్గొన్నందుకు దోషులుగా నిర్ధారించారు. వీరిలో కార్మిక హక్కుల కార్యకర్త షరీఫే మహమ్మది కూడా ఉన్నారు.

ఆమెకు విధించిన మరణశిక్షను గతవారమే ఇరాన్ సుప్రీంకోర్టు ఖరారు చేసింది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ టర్క్ ఈ విషయంపై స్పందిస్తూ, ఇరాన్ తక్షణమే మరణశిక్షలపై తాత్కాలిక నిషేధం (మారిటోరియం) విధించాలని డిమాండ్ చేశారు. "మరణశిక్ష జీవించే హక్కును కాలరాస్తుంది. దీనివల్ల అమాయకులను ఉరితీసే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది" అని షమ్దాసాని తెలిపారు. గత ఏడాది ఇరాన్‌లో 850 మందికి పైగా మరణశిక్ష అమలు చేసినట్లు మానవ హక్కుల సంస్థలు నివేదించగా, ఈ ఏడాది ఆ సంఖ్య మరింత పెరగడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది.



# మాజీ ఎమ్మెల్యే పింఛన్‌కు జగదీప్ ధన్‌ఖడ్ దరఖాస్తు

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** పదవీ కాలం మిగిలి ఉన్నప్పటికీ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తూ జగదీప్ ధన్‌ఖడ్ తీసుకున్న అనూహ్య నిర్ణయం దేశరాజకీయాల్లో సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన మాజీ ఎమ్మెల్యే పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా అందుకు సంబంధించిన ప్రక్రియ మొదలైంది. ధన్‌ఖడ్ గతంలో రాజస్థాన్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో అజ్మేర్‌లోని కిషన్‌గడ్ నుంచి కాంగ్రెస్ తరఫున విజయం సాధించారు. ఆ సమయంలో రూల్స్ కమిటీకి సభ్యుడిగానూ పనిచేశారు. నిబంధనల ప్రకారం రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యే రూ.35వేల పింఛన్‌కు అర్హులు. అలాగే వయసు ఆధారంగా ఆ మొత్తంలో పెంపు ఉంటుంది. 70 ఏళ్లు దాటిన మాజీ సభ్యుడికి 20 శాతం అదనపు పింఛను అందుతుంది. అదే 80 యేళ్లు దాటితే అది 30 శాతంగా ఉంటుంది. మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ప్రస్తుత వయసు 74 యేళ్లు. దాంతో ఆయనకు రూ.42వేల వరకు పింఛన్ లభించనుంది. ఈ పింఛన్ దరఖాస్తు అందిందని రాజస్థాన్ అసెంబ్లీ స్పీకర్ వాసుదేవ్ దేవనాని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ధన్‌ఖడ్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. లోక్‌సభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. 2003లో బిజెపిలో చేరారు. 2019 నుంచి 2022 మధ్య పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022ఆగస్టులో ఉపరాష్ట్రపతిగా నియమితులైన ధన్‌ఖడ్ రెండేళ్ల పదవీకాలం మిగిలి ఉండగానే అనూహ్యంగా వైదొలిగారు. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

# దేశాల మధ్య శాశ్వత మిత్రత్వం, శత్రుత్వం ఉండదు..

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** దేశాల మధ్య శాశ్వత మిత్రత్వం , శత్రుత్వం అంటూ ఏమీ ఉండదని, అలాగే శాశ్వత మిత్రులు కాని, శత్రువులు కాని ఉండరని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. కేవలం ఆ దేశానికి ఉపయోగపడే శాశ్వత ప్రయోజనాలే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే రక్షణరంగంలో ఆత్మనిర్భరత సాధించడం అత్యావశ్యకమని ఓ జాతీయ మీడియా సదస్సులో అన్నారు. పహల్గాం ఉగ్రదాడి - ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రధాని మోడీ చైనా పర్యటన నేపథ్యంలో భారత్ అనుసరిస్తోన్న వైఖరిని వెల్లడించారు. ప్రపంచం వేగంగా మారుతోంది. అదే సమయంలో కొత్త సవాళ్లు పుట్టుకొస్తున్నాయి. మహమ్మారులు, ఉగ్రవాదం, ప్రాంతీయ ఘర్షణలు వంటి వాటితో ఈ శతాబ్దం అత్యంత సవాలుతో కూడి ఉందని అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో మన వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా, ఆత్మనిర్భరత అనేది అత్యావశ్యకం. మనకు శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు. శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. భారత్ ఎవరినీ శత్రువుగా పరిగణించదు. మన రైతులు, వ్యాపారవేత్తల ప్రయోజనాలే మనకు ముఖ్యం. ప్రస్తుతం మారుతున్న భౌగోళిక రాజకీయాల కారణంగా రక్షణ పరంగా విదేశాలపై ఆధారపడడం సరైన ఎంపిక కాదని స్పష్టమవుతోంది. స్వావలంబన అనేది మన ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు అత్యవసరం. 2014లో మన రక్షణ రంగం ఎగుమతుల విలువ రూ.700 కోట్లు. ఇప్పుడది రూ.24వేల కోట్లకు చేరింది. ఈ గణాంకాలు చూస్తుంటే భారత్ ఒక కొనుగోలుదారుగానే మిగలకుండా ఎగుమతిదారుగా మారుతుందని వెల్లడవుతోంది. ఇక మన బలగాలు స్వదేశీ పరికరాలతో లక్ష్యాలపై కచ్చితత్వంతో చేసిన దాడులు దూరదృష్టి, సమన్వయానికి నిదర్శనం. అలాంటి సన్నద్ధత లేకపోతే ఏ మిషన్ విజయవంతం కాదు అని మంత్రి పేర్కొన్నారు. భారత్‌ను మిత్ర దేశం అంటూనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాల మోత మోగించారు. రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు గతంలో విధించిన 25 శాతానికి అదనంగా మరో 25 శాతం సుంకాలు విధించారు. అవి ప్రస్తుతం అమలవుతున్నాయి. ఈ తరుణంలోనే ఏడేళ్ల తర్వాత తొలిసారి ప్రధాని మోడీ చూనా పర్యటనకు వెళుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సంక్షిప్తంగా..

## ఉక్రెయిన్ పార్లమెంట్ మాజీ స్పీకర్ ఆండ్రీ పరుబీ దారుణ హత్య



**కీవ్, ఆగస్టు 30:** ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ఆపేందుకు ఓవైపు చర్చలు జరుగుతున్నా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం రోజు రోజుకూ మరింత తీవ్రమవుతున్నాయి. గత రెండురోజులుగా మాస్కో, కీవ్‌పై భారీ దాడు లకు పాల్పడుతోంది. ఈ క్రమంలో ఉక్రెయిన్ పార్లమెంట్ మాజీ స్పీకర్ ఆండ్రీ పరుబీ దారుణ హత్యకు గురైనట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు.లివివ్ ప్రాంతంలో ఆండ్రీ పరుబీని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి నట్లు తెలిపారు. నిందితుల కోసం అధికారులు తీవ్ర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారన్నారు. నిందితుడికి కఠిన శిక్ష విధిస్తామన్నారు. మరోవైపు డొనెట్‌స్క్ ప్రాంతంలోని ఓ గ్రామాన్ని తమ దళాలు అధీనంలోకి తీసుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఉక్రెయిన్ క్షిపణి, విమానయాన సంస్థలతో పాటు, సైనిక, వైమానిక స్థావరాలపై కచ్చితమైన దాడులు చేస్తున్నట్లు పేర్కొంది. కాగా రాత్రి రష్యా జరిపిన సముద్ర డ్రోన్‌దాడిలో 17 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

## భారత్ మిసైల్ దాడులతో సీజ్‌ఫైర్‌కు దిగొచ్చిన పాకిస్థాన్: నర్మదేశ్వర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** ఆపరేషన్ సిందూర్‌కు సం బంధించిన వివరాలను వెల్లడించిన ఎయిర్ స్టాఫ్ వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ. ఆపరేషన్ సిందూర్‌తో భారత బలగాలు అత్యంత కచ్చితత్వంతో పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని లక్ష్యాలను చేధించాయి. దీంతో దాయాది కాళ్లబేరానికి వచ్చింది. అందుకోసం వైమానికదళం 50 కంటే తక్కువ ఆయుధాలనే ప్రయోగించిందని ఆయన వెల్లడించారు. 'యుద్ధాన్ని ప్రారంభించడంసులభమే. ముగించడం అంత సులువైన పనికాదు. దానిని దృష్టిలో పెట్టుకుని మన బలగాల నుసంసిద్ధంగా ఉంచాం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా మోహరింపులు చేపట్టాం' అని ఆయన వెల్లడించారు. నియంత్రణరేఖ వెంట నాలుగు రోజులపాటు ఖచ్చితమైన లక్ష్యాల తో చేసిన మిసైల్‌దాడులతో మే 10నపాకిస్థాన్ సీజ్‌ఫైర్‌కు దిగొచ్చిందని పేర్కొన్నారు.

## తొక్కిసలాట బాధితులకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం



**బెంగళూరు, ఆగస్టు 30:** ఐపీఎల్ 2025 టైటిల్ గెలిచిన సంబరాల్లో జరిగిన ఘోర విషాదంపై దాదాపు మూడు నెలల మౌనం తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) యాజమాన్యం ఎట్టకేలకు స్పందించింది. తీవ్ర విమర్శల నేపథ్యంలో తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది అభిమానుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు శనివారం అధికారికంగా వెల్లడించింది. 'ఆర్సీబీ కేర్స్' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ ద్వారా తెలిపింది. జూన్ 4న మా హృదయాలు ముక్కలయ్యాయి. మా ఆర్సీబీ కుటుంబంలోని 11 మంది సభ్యులను కోల్పోయాం. వారి లేని లోటును ఏ సాయమూ పూడ్చలేదు. కానీ ఒక తొలిఅడుగుగా, వారి కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున అందిస్తున్నాం. ఇది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదు. కరుణ, ఐక్యత, నిరంతర సంరక్షణకు ఇదొక వాగ్దానమని ఆర్సీబీ యాజమాన్యం పేర్కొంది.

# రూ.500లకు కక్కుర్తిపడ్డ కానిస్టేబుల్, లాయర్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో షాకింగ్ ఘటన వెలుగు చూసింది. నేరస్తులకు ఎస్కార్టుగా వుండే ఓ కానిస్టేబు ల్, మరో మహిళా లాయర్ కేవలం 500 రూపాయలకు కక్కుర్తి పడి ఓ నేరగాడికి ఫోన్ ఇవ్వగా, అతను ఈ ఫోన్‌తో ఏకంగా ఓ బడా వ్యాపారికి ఫోన్ చేసి తనకు వెంటనే కోటి రూపాయలు డబ్బులు కావాలని, లేకుంటే చంపేస్తానని బెదిరించాడు.

తనకు వచ్చిన బెదిరింపు కాల్‌ను వీరేంద్ర రాజ్‌పుత్ అనే వ్యాపారి రికార్డు చేసి దీనిని జిల్లా పోలీసు అధికారులకు ఇచ్చి దీనిపై చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు సోషల్ మీడియాలో వైరల్ అయ్యేలా చూశాడు. దీంతో ఈ ఘటన యుపి వ్యాప్తంగా సంచలనం రేపింది.

# క్లాస్‌గా కనపడినా.. మాగంటి గోపీనాథ్ మాస్ లీడర్

## సభలో సంతాపం ప్రకటిస్తూ తీర్మానం ప్రవేశపట్టిన సిఎం రేవంత్‌రెడ్డి

### ఆదివారం ఉదయం 9 గంటలకు శాసనసభ వాయిదా : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ చూడటానికి క్లాస్‌గా కనిపించినా మాస్‌లీడర్ అని, నాకు మంచి మిత్రుడని విద్యార్థి నాయకుడిగా ప్రజాప్రతినిధిగా, నిర్మాతగా ఆయన రాణించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. అసెంబ్లీ సమావేశం తొలిరోజున శనివారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సంతాపం తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు.

గోపీనాథ్ తనకు చిన్ననాటి నుంచే మిత్రు డని, సౌమ్యుడు, మితభాషి అని గుర్తుచేసు కొన్నారు. రాజకీయ విధానాలు మార్చుకున్నా తన వ్యక్తిత్వం మార్చుకోలేదని జూబ్లీహిల్స్ నుంచి మూడుసార్లు వరుసగా గెలిచి హ్యాట్రిక్ సాధించడం అంటే అంత ఆషామాషి విషయం కాదని, ఆయన విలువలతో వ్యవహరించడాని చెప్పడానికి ప్రబల నిదర్శనం అని వివరించారు. ఆయన మృతి తనను వ్యక్తిగతంగా తీవ్రంగా కలిచివేసిందని అరుదైన ఒక ప్రజా ప్రతినిధిని కోల్పోయామని గోపీనాథ్ కుటుంబానికి ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడని తెలిపారు. ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారని అన్నారు. గోపీనాథ్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందని.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

**అందరితో కలసిపోయే ఆయన లేనిలోటు స్పష్టంగా తెలుస్తోంది : మంత్రి శ్రీధర్‌బాబు**



మాగంటి గోపినాథ్ నిజాయితీగా, అందరితో కలిసి మెలసిపోయే గుణం కలిగిన వ్యక్తి అని అసెంబ్లీలో ఆయన లేనిలోటు స్పష్టంగా తెలుస్తోందని శాసనసభ వ్యవవ హారాల మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని ఆయన బలపరుస్తూ గోపీనాథ్ అన్నగా నాకు మార్గదర్శి వ్యక్తి చనిపోవడం దిగ్భ్రాంతి కలిగిందని, మన హృదయాలను ద్రవింపచేస్తోందని ఆయన అన్నారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన తమ్ముడు రాజకుమార్ చనిపోతే అప్పుడు వారి కుటుంబం సంవత్సరాలు ఆ విషాదం నుంచి కోలుకోలేదని ఆయనకు ఇద్దరు అన్నలు ఉన్నారని కుటుంబ నేపథ్యం సభకు వివరించారు. హైదరాబాద్‌లో 1963లో పుట్టిన గోపినాథ్ ఇక్కడే తన చదువులు పూర్తిచేసుకొన్నారు.

**గోపన్నగా ప్రజలకు అనురాగం పంచారు: ఎమ్మెల్యే కెటిఆర్**



బతుకమ్మ చీరెలు తెలంగాణ ప్రభుత్వం 2016లో పంపిణీ చేయడం మొదలు పెడితే, మాగంటి గోపినాథ్ మాత్రం అంతకుముందే తన నియోజకవర్గం పరిధిలోని వారికి బతుకమ్మ సందర్భంగా చీరెలు పంపిణీచేశారని ఎమ్మెల్యే తారక రామారావు గుర్తుచేశారు. ఈ సభలో సోదరుడు, సహచరుడు, హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గోపీనాథ్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టాల్సి వస్తదని కలలో కూడా అనుకోలేదు. జీవించి ఉన్నంత కాలం ఆయన అనారోగ్యం గురించి చెప్పుకోలేదు. పబ్లిక్ పరంగా చాలా యాక్టివ్‌గా ఉండేవారు. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్ అంటేనే సంపన్నులు నివసించే ప్రాంతం అని పేరు. కానీ అక్కడ ఉండేది మొత్తం పేద ప్రజలు. బస్తీలతో కూడిన ఏరియా. అలాంటి ఏరియాను మాగంటి గోపీనాథ్ ఎంతో అభివృద్ధి చేశారని కెటిఆర్ కొనియాడారు. హైదరాబాద్‌లోని హైదర్ గూడలో జన్మించిన గోపీనాథ్ కటౌట్ సంస్కృతికి పునాది వేశారని గుర్తుచేసుకొన్నారు. ఎన్టీఆర్‌కు వీరాభిమానికిగా టిడిపి అడుగుపెట్టారు. హ్యాట్రిక్ కొట్టడం ఎమ్మెల్యేలకు అంత సులువు కాదు. అది గోపీనాథ్‌కు సాధ్యమైంది. మాదాపూర్ ఏరియాలో చాలా చిన్న ఇంట్లో గోపీనాథ్ నివాసం ఉన్నారు. బతికినంత కాలం మాస్ లీడర్‌గా డైనమిక్‌గా ఉన్నారు. స్పందించే గుణం ఎక్కువ. కేసీఆర్‌కు నమ్మిన విధేయుడిగా పని చేశారు. ఆయన మరణం పార్టీకి, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి తీరని లోటు. గోపీనాథ్ కుటుంబానికి మా పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**క్రమశిక్షణగల నేత మాగంటి : సభలో ప్రజాప్రతినిధుల నివాళులు**

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గోపినాథ్ మృతిచెందడం దురదృష్టం అని అన్నారు. జూబ్లిహిల్స్ ప్రజలను ఆయన ఆశించిన రీతిలో అభివృద్ధి పరిచేబాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసు కొంటారని తెలిపారు. బిసివెల్ఫేర్ మంత్రి హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలమనిషి మాగంటి అని కొనియాడారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజలను ప్రేమించే నాయకుడు ఆయన విషయాలు ఎప్పుడు బయటకు చెప్పుకోలేదు గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన మంచి వ్యక్తి అని అన్నారు.ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్వర్లు,గోపాల్ మాట్లాడుతూ గోపినాథ్ వివాదరహితుడని అభివర్ణించారు. బిజెపి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు గుర్తుంచుకొనే పనులు చేయాలని ఆయన మనందరికి మార్గనిర్ధేశం చేశారని అని కొనియాడారు. ఎంఐఎం ఎమ్మెల్యే, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సున్ని తంగా మర్యాదగా వ్యవహరించే వ్యక్తి అని అన్నారు. సిపిఐ తరుపున ఆయన కుటుంబానికి సంతాపం తెలుపుతున్నానని చెప్పారు.

**అరుదైన నేత మాగంటి : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**

అరుదైన నాయకుడు మగంటి గోపీనాథ్ మృతికి సంతాప తీర్మానం చేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆ తర్వాత సభను ఆదివారం(మార్చి 31) ఉదయం 9 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

## గత ప్రభుత్వంలో లేని పిపిటి సంప్రదాయం ఇప్పుడెందుకు?: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చే సంప్రదాయంలేదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పిపిటి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పిపిటికి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల స్టేషన్‌లలో వందేభారత్ హాల్ట్

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** సికిందరాబాద్–నాగపూర్ మధ్య నడుస్తున్న వందేభారత్ రైలుకు రెండు హాల్టింగ్‌లు ఇచ్చినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రధాన స్టేషన్‌లు సిర్పూర్ కాగజ్ నగర్, మంచిర్యాల స్టేషన్లలో హాల్టింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి ఈ రెండు స్టేషన్లలో హాల్టింగ్ ఏర్పాటు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో రైల్వే మౌలిక వసతులకు నిరంతరం సహాయ సహకా రాలు అందిస్తున్న ప్రధాని ప్రధాని మోడీ రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు తెలంగాణ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

## పదవీ విరమణ చేసిన అదనపు కార్యదర్శులు


**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర సచివాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది శనివారం పదవి విరమణ చేశారు. సాధారణ పరిపాలన విభాగంలో పని చేస్తున్న అదనపు కార్యదర్శులు బండి యాదగిరి, నిర్మల, అరుణ్ కుమార్, ఏఎస్ఓ అశోక్ కుమార్, జమేదార్ అబ్దుల్లా పదవీ విరమణ సందర్భంగా శనివారం నాడు జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, సంయుక్త కార్యదర్శి శివ లింగయ్య(ప్రొటోకాల్) వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిఎడి కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడుతూ, పదవీ విరమణ చేసిన అధికారులు అంకితభావంతో పని చేశారని వారిని ప్రశంసించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచి, అత్యున్నత సేవలు అందించారని అన్నారు. సచివాలయ అధికారులు, సిబ్బంది కూడా వారిని ఆదర్శంగా తీసుకొని అంకితభావంతో పనిచేయాలని, సేవా దృష్టితో విధులు నిర్వహించాలని అన్నారు.

## శాసనమండలిలో మాజీ సభ్యులు రత్నాకర్‌రావు, మాగం రంగారెడ్డికి సంతాపం

### ఆ తరువాత సోమవారానికి సభ వాయిదా

### కొత్త సభ్యులను సభకు పరిచయం చేసిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** తెలంగాణ శాసనమండలి సమావేశాలు శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే సభ్యులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వినాయక చవితి శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం కొత్తగా శాసనమండలికి ఎన్నికైన సభ్య లను సభకు పరిచయం చేశారు. కొత్తగా మండలికి ఎన్నికైన అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్, విజయశాంతి, దాసోజు శ్రవణ్ కుమార్, సత్యం నెల్లికంటి, పింగిలి శ్రీపాల్ రెడ్డి, సి.అంజిరెడ్డి, మల్క కొమరయ్యను పరిచయం చేయగా రెండోసారి రియాజుల్ ఎఫెండి ఎన్నిక కాగా ఆయనను కూడా సభకు పరిచయం చేశారు. అనంతరం గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు సభ్యులుగా కొనసాగి ఈ మధ్య కాలంలో మరణించిన డాక్టర్ టి రత్నాకర్‌కి, తెలంగాణ శాసన పరిషత్తుకి రెండుసార్లు ఎన్నికై మరణించిన మాగం రంగారెడ్డికి సంతాపం తెలుపుతూ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. మౌనం పాటించిన అనంతరం సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.



సచివాలయం వద్ద మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు

## బిసి రిజజర్వేషన్లు పెంచే చట్టానికి ప్రతిపక్షాలు మద్దతు తెలపాలి

### లేదా బిసి ద్రోహులుగా ప్రటిస్తాం: జాజుల

**హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త:** సామాజిక రిజర్వేషన్ల పరిమితిని 50 పరిమితిని ఎత్తివేస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచడానికి ఈ అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాలని నిర్ణయించడం అభినంద ˇనీయమని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈమేరకు శనివారం సచివాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసిన తర్వాతనే ప్రత్యేక జీవోను తీసుకురావాలన్నారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ చేయబోయే చట్టంపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు బెషరతుగా మద్దతు తెలపాలన్నారు. బీసీ రిజర్వేషన్ అంశంపై అసెంబ్లీలో రాజకీయం చేస్తే ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టానికి మద్దతు ఇవ్వని రాజకీయ పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తాన్నారు. బిసిలు ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్లు అంటే, దేశంలో సిక్కు మతానికి రిజర్వేషన్లు ఇవ్వడం లేదా? అని ప్రశ్నించారు. మోకాలుకు బోడిగుండుకు మెలిక పెట్టి రిజర్వేషన్లు అడ్డుకోవాలని చూసే పార్టీలను రాజకీయంగా బొంద పెడతామని హెచ్చరించారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసిన తర్వాత రెండోసారి గవర్నర్‌కు ఆపే అధికారం లేదని గవర్నర్ ఆమోదించకుంటే బిజెపి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 రిజర్వేషన్లు పెంపుకు అన్ని రాజకీయ పార్టీలు, శాసనసభ పక్ష నేతలు శాసనసభ్యులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బిక్షపతి, జాజుల లింగం తదితరులు మాట్లాడారు.

## యాదిగిరిగుట్ట ఆలయ ఇఒగా వెంకటరావు

### 31న పదవీవిరమణ చేస్తున్నందున.. పునర్నియామకం

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** యాదగిరి గుట్ట దేవాలయం ఎక్జిక్యూటివ్ ఆఫీసర్(ఈవో)గా ఎస్ వెంకట రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న 2015 బ్యాచ్‌కి చెందిన ఐఎఎస్ అధికారి ఎస్.వెంకటరావును యాదగిరిగుట్ట ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ప్రత్యేక అధికారిగా నియమిస్తూ జీవో ఆర్‌టి నంబర్ 1179ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నియామక నిబంధనలు, షరతులు విడిగా జారీ చేయబడతాయని ఉత్తర్వులో పేర్కొన్నారు.

## సమస్యలను చర్చించే ధైర్యంలేని కాంగ్రెస్ సర్కారు

### బిజెపి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను 30 రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరామని బిజెపి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకో ప్రజాసమస్య చొప్పున 30 రోజుల పాటు చర్చించాల్సిన 30 అంశాల జాబి తాను ప్రభుత్వానికి ఇచ్చామని, కానీ కాంగ్రెస్ సర్కారుకు ప్రజాసమస్యలపై చర్చించే చిత్తశుద్ధి లేదన్నారు. అందుకే సమావేశాలను మూడు రోజుల్లోనే ముగిస్తామంటుందన్నారు. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యం. ప్రజాసమస్యలపై పలాయన వాదమన్నారు. భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం, రోడ్లు తెగడం, చెరువులకు గండ్లు పడడం రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, మహిళలు, పెన్షనుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు చేనేత, కల్లుగీత వంటి వృత్తిదారుల కష్టాలు, ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు, విద్యా, వైద్య, ఇరిగేషన్, వ్యవసాయం, రెవెన్యూ, ఆర్థిక రంగాల్లోని సమస్యలు ఉన్నాయన్నారు. గత బిఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న భూముల అన్యాక్రాంతం, దేవాలయాలపై దాడుల వంటి అంశాలను అసెంబ్లీలో చర్చించాలని, అందుకే 30 రోజుల పాటు సమావేశాలను నిర్వహించాలని కోరామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు అప్పటి బిఆర్ఎస్ సర్కారు అసెంబ్లీ సమావేశాలను తక్కువ రోజులు నిర్వహించడాన్ని తప్పుపట్టిందని, తాము అధికారంలోకి వస్తే అసెంబ్లీని ఎక్కువ రోజులు నిర్వహిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ అన్ని హామీల మాదిరే ఈ హామీ కూడా ఎగవేతనే అని, కాంగ్రెస్ సర్కార్ గత బడ్జెట్ సమావేశాలను కేవలం 11 రోజులే నిర్వహించిందన్నారు గత శీతాకాల సమావేశాలు (2024 డిసెంబరులో) జరిగింది ఏడు రోజులే అన్నారు. అసెంబ్లీ సమావేశాలను ఇలా తక్కువ రోజుల పాటు నిర్వహించడమనేది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల హాయంలో అసెంబ్లీ తక్కువ రోజులే సమావేశమైందని, ఒక్క యేడాది మాత్రమే 30 రోజులకు పైగా నడిచింది. మిగిలిన సంవత్సరాలన్నీ కూడా 30 రోజుల్లోపే అసెంబ్లీ నడిచింది. కెసిఆర్ బాటలోనే రేవంత్ సర్కార్ నడుస్తూ సమావేశాలను తక్కువ రోజులు నిర్వహించడం ద్వారా శాసనసభ ఔన్నత్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకుని వినాయక నిమజ్జనం తర్వాత అసెంబ్లీని తిరిగి సమావేశ పరిచి ప్రజాసమస్యలను చర్చించి, పరిష్కారాలను చూపాలన్నారు. ప్రజాసమస్యలను చర్చించే పరిష్కరించాలనే చిత్తశుద్ధిలేని సర్కారులే ఇలా వ్యవహరిస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాసమస్యలను చర్చించే దమ్ము, ధైర్యం ఉంటే వినాయక నిమజ్జనం తర్వాత అసెంబ్లీని 30 రోజుల పాటు నడపాలని డిమాండ్ చేశారు. సభలో ప్రజాసమస్యలను చర్చిస్తే ప్రభుత్వ వైఫల్యాలు, డొల్లతనం బయట పడుతుందని సిఎం రేవంత్ రెడ్డి భయపడుతున్నారు. అందుకే సమావేశాలను మూడురోజుల్లోనే ముగిస్తున్నారు. తమ సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరించకుండా దాటవేస్తున్న దగాకోరు కాంగ్రెస్ సర్కారుకు ప్రజలు వచ్చే స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

## వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సవ్యసాచిఘోష్‌కు అదనపు బాధ్యతలు

### గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు కూడా..

### ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** పశు సంవర్ధక, డైరీ డెవలప్‌మెంట్ అండ్ ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కొనసాగుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి సభ్యసాచి ఘోష్‌కి అదనపు బాధ్యతలు అప్పగిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెల్ఫేర్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అలాగే గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన జీవో ఆర్‌టి నంబర్ 1180ను జారీ చేశారు. ఇప్పటి వరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా డాక్టర్ విఎస్ అలగు వర్షిణికి ఇచ్చిన అదనపు బాధ్యతల నుంచి తొలగించారు. అలుగు వర్షిణి రెండు సంవత్సరాల పాటు డిప్యూటేషన్‌లో కేంద్ర సర్వీసులకు వెళ్తున్న నేపథ్యంలో అదనపు బాధ్యతలను ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**సంక్షేమ శాఖల సమన్వయంపై ప్రత్యేక మెమో జారీ**

వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సభ్యసాచి ఘోష్‌కి అదనపు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం.. బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ సంక్షేమ శాఖలను సమన్వయం చేస్తారని పేర్కొంటూ మెమో నంబర్ 1279ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేశారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల అంతటా సమన్వయాన్ని బలోపేతం చేయడానికి, పథకాల కలయికను నిర్ధారించడానికి, వ్యూహాత్మక దిశానిర్దేశం చేయడానికి, ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కేడర్‌లో ఒక అధికారిని సంక్షేమం కోసం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించాలని నిర్ణయించింది.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




యూసుఫ్‌గూడలో నిర్వహించిన బిజెపి బూత్ స్థాయి సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), ఆగస్టు 30, ప్రభాత వార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో బీజేపీ పార్టీ గెలుపునకు బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు అన్నారు. శనివారం యూసుఫ్ గూడ మహ్మూద్ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్ సెంట్రలల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం భారతీయ జనతాపార్టీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచందర్‌రావు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు రఘు నందన్‌రావు పాల్గొన్నారు. రామచందర్‌రావు మాట్లాడుతూ నగరంలో బలమైన పార్టీ బీజేపీ పార్టీ అని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 సీట్లు గెలవటం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయం అన్నారు. రాష్ట్రాన్ని గత పదేళ్లలో బీఆర్ఎస్ కుటుంబపాలన సాగిస్తే 22 నెలల్లో కాంగ్రెస్ అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్, ఎమ్ఐఎమ్ మద్దతుతో ముందుకు వెళ్తున్నారని ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. బీహార్‌లో ఎమ్ఐ ఎమ్‌తో కలిసి రాహుల్‌గాంధీ ఓట్ చోర్ జరిగిం దంటూ ప్రచారం చేస్తున్నారని కానీ హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ఎమ్ఐఎమ్ కలిసి ఓట్ చోర్ అధికారులను కలుపుకుని చేస్తున్నార న్నారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిని ఆరు గ్యారెంటీలను అమలు చేశాకే ఓట్లు అడగాలని ఓటు అడిగే నైతిక హక్కు ను వారు కోల్పోయారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు, గ్రామాలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాల న్నారు. ఆరు గ్యారెంటీలలో మహి ళలకు రూ.2,500, తులం బంగారం, కాలేజి వెళ్లే విద్యా ర్థినులకు స్కూటీలు, నిరుద్యోగ భృతి ఏమ య్యాయని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో మహిళలకు పొదుపు సంఘాల పేరుతో రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నా మని కాంగ్రెస్ మాత్రం రుణాలకు వడ్డీ చెల్లించలేని పరిస్థితి ఉందని ఉద్యోగులకు డీఏలు లేవని ఉద్యోగాల పంచన్లు ఇచ్చే పరిస్థితి కూడా లేదన్నా రు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అడుగడుగున కాంగ్రెస్‌ను అడ్డుకోవాలన్నారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను చూస్తుంటే 2020లో బీహార్ ఎన్నికల సమయంలో దుబ్బాక ఎన్నికలు నిర్వహించారని అదే పరిస్థితి ప్రస్తుతం బీహార్ ఎన్నికల సమయంలోనే జూబ్లీహిల్స్ ఎన్నికలు రావడం బీజేపీ గెలుపునకు నాందిగా పలుకుతుం దని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్, మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షులు గౌతమ్‌రావు, భరత్‌గౌడ్, శ్యామ్ సుందర్‌గౌడ్, డాక్టర్ పద్మా వీరపనేని, అట్లూరి రామకృష్ణ, నగర కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు, కొలన్ సత్యనారాయణతోపాటు డివిజన్ల అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్టీలుగా లంబాడా, బంజారాలు రాజ్యాంగ విరుద్ధం

### సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించడం రాజ్యాంగ విరుద్ధమని, వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల నుండి పిటిషన్ దాఖలైంది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపూరావుతోపాటు మరికొందరి తరఫున సీనియర్ న్యాయవాది అల్లంకి రమేశ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉత్తర్వుల సవరణ చట్టం 1976 మేరకు ఆ మూడు వర్గాలను ఎస్టీలుగా గుర్తించడం ఆర్టికల్ 342ని ఉల్లంఘించడమేనని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. బంజారా, లంబాడాలు, సుగాలీలు గిరిజనులు కాదని, 1976 వరకు పాత ఆంధ్ర ప్రదేశ్‌లోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వలస వచ్చి అక్కడి అసలైన గిరిజనులకు ఉద్దేశించిన హక్కులను కొల్లగొట్టారని వెల్లడించారు. అంతకుముందు వారు బీసీ జాబితాలో ఉన్నారన్నారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన సందర్భంలో ఆంధ్రా ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఉందని, ఆ సమయంలో లంబాడా, సుగాలీలను ఆంధ్రా ప్రాంతంలో ఎస్టీలుగా గుర్తించారని, కానీ హైదరాబాద్ స్టేట్‌లో కాదని తెలి పారు. కాసు బ్రహ్మానందరెడ్డి కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో ఒక రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఒక కులానికి చెందిన వారు ఎస్టీలు, మరికొన్ని జిల్లాల్లో బీసీలుగా ఉండడం సరికాదని ఆ మూడు కులాలను ఎస్టీ జాబితాలో చేర్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌కు ఐఎఎస్ శివశంకర్ కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి శివశంకర్ లోతేటిని కేంద్రం ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించింది. ఈ మేరకు ఆయనను ఏపీకి రిలీవ్ చేయాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఏకే మిశ్రా తెలంగాణ ప్రభుత్వానికి ఉత్తర్వులు పంపించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను ఏపీకి కేటాయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. విజయనగరం జిల్లాలోని ధర్మవరం శివశంకర్ సొంతూరు. కానీ రంగారెడ్డి జిల్లాలోని తన మామగారి నివాసంలో ఉండి ఆయన సివిల్ సర్వీసెసు సాధించారు. యూపీఎస్సీకి చేసిన దరఖాస్తులో తన శాశ్వత చిరునామాగా రంగారెడ్డి జిల్లానే పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో క్యాడర్‌ను నిర్ణయించేటప్పుడు చిరునామా ఆధారంగా కేంద్రప్రభుత్వం ఆయనను తెలంగాణకు కేటాయించింది.

## యూరియా అంశం కేంద్ర పరిధిలోనిది

### విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి చైర్మన్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** యూరియా అంశం కేంద్రం పరిధిలోనిదని విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు రైతుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో లేకపోతే బీజేపీ కార్యాలయం ముందు ధర్నా చేయాలన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో తెలంగాణ రైతాంగాన్ని కేంద్రం నిండా ముంచిందని చెప్పారు. రాష్ట్రానికి ఈ సీజన్ లో కేటాయించిన యూరియా కోటాలో 60 కూడా సరఫరా చేయలేదని వెల్లడించారు. రామగుండం ఎరువుల కర్మాగారం రెండు నెలల నుంచి మూతపడినా, ఇప్పటి వరకు కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ సీజన్‌లో రాష్ట్రానికి ప్రణాళిక ప్రకారం రావాల్సింది 8.30 లక్షల టన్నులు అయితే కేంద్రం ఇచ్చింది 5.95 లక్షల టన్నులు మాత్రమేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చనిపోయిన రైతులకు పరిహారం కూడా ఇవ్వలేదని, వీరిలో 141 మంది రైతులకు తమ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని వివరించారు.

## యూరియాపై ఆందోళనలు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరత తీర్చాలంటూ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళనలు చేశారు. ధర్నాకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయా పోలీసు స్టేషన్లకు వారిని తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అంతకుముందు వ్యవసాయ శాఖ కమిషనర్‌కు యూరియా కొరతపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వినతిపత్రం అందించారు. యూరియా కొరత తీర్చాలని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతలు సూచించారు.

తాము రాజకీయాలు చేయడం లేదని, రైతుల తరఫున మాట్లాడుతున్నామని కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ నినాదాలు చేశారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టిందని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గణపతి బప్పా మోరియా – కావాలయ్యా యూరియా” అంటూ నినదించారు. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు చేశారు. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో ఇటీవల స్థానం సంపాదించిన హీరో నందమూరి బాలకృష్ణను హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేసిన దృశ్యం. చిత్రంలో ఎపి మంత్రి లోకేష్, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ తదితరులు.

# ఉక్రెయిన్-రష్యా యుద్ధం ఆపి శాంతికి కృషిచేయాలి!

## ప్రధాని మోడీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఫోన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** తమ దేశంలో యుద్ధాన్ని ఆపి శాంతి స్థాపన కోసం భారత్‌కృషిచేయాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీ ప్రధాని నరేంద్రమోడీని కోరారు. తక్షణమే కాల్పుల విరమణ జరిగేలా చర్యలు తీసుకోవాలని, రాబోయే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సు వేదికగా రష్యాకు బలమైన సందేశం పంపాలని ఆయన ప్రధాని నరేంద్ర మోదీని అభ్యర్థించారు. చైనా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు ఫోన్ చేసి మాట్లాడారు. గడిచిన నెల రోజుల్లో ఇద్దరు నేతలు ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇది రెండోసారి. ప్రధానమంత్రి కార్యాలయం పిఎంఒ ఇందుకు సంబంధించి ప్రకటన విడుదలచేసింది. జెలెన్‌స్కీ ఉక్రెయి న్‌లోని తాజా పరి ణామాలు, అమె రికా మాజీ అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ తో పాటు యూరప్ నేతలతో చర్చల వివరాలు ప్రధానితో పంచుకున్నారు. దీనికి ప్రతి స్పందనగా మోదీ, ఈ సంక్షోభానికి శాంతియుత పరిష్కారమే సరైన మార్గమని భారత్ ఎల్లప్పుడూ విశ్వసిస్తుందని పునరుద్ఘాటించారు. శాంతి సాధన కోసం చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఇరువురూ దేశాల



మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని కూడా ఈ సందర్భంగా చర్చించారు. ఫోన్ సంభాషణ అనంతరం జెలెన్‌స్కీ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. 'మా పట్టణాలపై వరుస దాడులు జరుగుతున్న సమయంలో శాంతి చర్చలు ఫలప్రదం కావు. తక్షణ కాల్పుల విరమణ జరగాలి. ఈ యుద్ధానికి ముగింపు ఇక్కడి నుంచే మొదలవ్వాలి' అని పేర్కొన్నారు. ఎస్‌సీవో సదస్సులో భారత్ రష్యా సహా ఇతర దేశాలకు స్పష్టమైన సంకేతాలు ఇవ్వగలదని ఆశిస్తున్నట్లు తెలిపారు.

అలాగే, త్వరలోనే ప్రధాని మోదీని ప్రత్యక్షంగా కలుసుకోవాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రధాని మోదీ చైనాలోని టియాంజిన్‌లో షాంఘై సహకార సంస్థ హాజరవుతున్నారు. ఈ వేదికపైనే ఆయన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. ఈ కీలక భేటీకి ముందు జెలెన్‌స్కీ ప్రధాని మోదీకి ఫోన్ చేయడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

## సిఎం సహాయనిధికి రూ.50 లక్షలు ప్రకటించిన హీరో నందమూరి బాలకృష్ణ

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ప్రముఖ సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. తెలంగాణ వరద బాధితులకు ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు రూ.50 లక్షల విరాళం ప్రకటించారు. కాగా, ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు ఉత్తర తెలంగాణను ముంచెత్తాయి. ప్రజలను నిరాశ్రయులను చేసింది. ఈ నేపథ్యంలో నందమూరి బాలకృష్ణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50లక్షల రూపాయలు ప్రకటించారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సిఎస్ రామకృష్ణారావు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిసారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో కలిసారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావు సర్వీసును ఏడు నెలలు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

# పండుగల నేపథ్యంలో 150 ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాబోయే పండుగల దృష్ట్యా ప్రయాణీకుల సౌలభ్యానికై ఇండియన్ రైల్వే 150 ప్రత్యేక రైళ్లను నడపనుంది. సౌత్ సెంట్రల్ అత్యధికంగా 48 రైళ్ల రాకపోకలు సాగించనున్నాయి. అయితే దేశవ్యాప్తంగా ప్రధాన మార్గాల్లో 2,024 ట్రిప్పులు ఈ రైళ్లు ప్రయాణించనున్నాయి. ఇక సౌత్‌సెంట్రల్ రైళ్లు 684 ట్రిప్పులు పూర్తి చేస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్, విజయవాడ నుంచి ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలుగుతుంది. బిహార్‌ను దృష్టిలో ఉంచుకుని ఈస్ట్ సెంట్రల్ రైల్వే 588 ట్రిప్పులతో 14 రైళ్లను నడుపనుంది. పాట్నా, గయ, దర్భంగా, ముజఫర్‌పూర్ వంటి ప్రధాన నగరాలను కలుపుతూ ఈ రైళ్లు ప్రయాణిస్తాయి. ఈస్ట్రన్ రైల్వే పరిధిలో కోల్‌కత్తా, సీల్డా, హౌరా మార్గాల్లో 24 రైళ్లు ఉండగా.. వెస్ట్రన్ రైల్వే పరిధిలో ముంబైన సూరత్, వడోదర రూట్లలో 24 రైళ్లు, సదరన్ రైల్వే పరిధిలో చెన్నై, కోయంబత్తూరు, మదురై రూట్లలో 10రైళ్ల రాకపోకలతో 66 ట్రిప్పులు ఉంటాయి. అదేవిధంగా అదనంగా ప్రత్యేక సర్వీసులు భువనేశ్వర్, పూరి, సంబల్‌పూర్ ఈస్ట్ కోస్ట్ రైల్వే, రాంచీ, టాటానగర్ సౌత్ ఈస్ట్రన్ రైల్వే ప్రయాగరాజ్, కాన్పూర్ నార్త్ సెంట్రల్ రైల్వే, బిలాస్‌పూర్, రాయపూర్, భోపాల్, కోటకు నడుపుతారు. సూరత్, కోల్‌కత్తాల ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. వెస్ట్రన్ రైల్వే సూరత్ సహా పలు గమ్యస్థానాలకు 24 రైళ్లతో గుజరాత్‌కు వెళ్లే ప్రయాణికులకు కూడా సౌకర్యంగా ఉంటుంది. అదేవిధంగా ఈస్ట్రన్ రైల్వే కోల్‌కతా, సీల్డా, హౌరా మధ్య 24 రైళ్లను 198 ట్రిప్పులు నడుపనుంది. ఇది మొదటి విడత ప్రకటన అని ఇండియన్ రైల్వేస్ వివరణ ఇచ్చింది. గతంలో పండుగ సీజన్లలో డిమాండ్‌కు అనుగుణంగా 12,000కు పైగా ప్రత్యేక రైళ్లను నడిపారు. ఈ క్రమంలో రాబోయే వారాల్లో మరిన్ని రైళ్లను నడిపే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఈస్ట్ సెంట్రల్ రూట్లలో ప్రయాణికుల రద్దీ భారీగా అంచనా వేస్తున్నారు. రాబోయే దీపావళి, ఛాట్‌పూజ, దుర్గాపూజ పండుగలను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఇండియన్ రైల్వే తగిన ఏర్పాట్లు చేస్తోంది.



## నిరంతరాయంగా తొమ్మిది రోజులు భరతనాట్య ప్రదర్శన

### 216 గంటల నృత్యప్రదర్శనతో ప్రపంచ రికార్డు సాధించిన విదుషి దీక్ష

**ఉడిపి(కర్ణాటక), ఆగస్టు 30:** ప్రముఖ భరత నాట్యకళాకారిణి విదుషి దీక్ష నిరంతరాయంగా 216 గంటలపాటు నృత్యప్రదర్శన ఇచ్చి కొత్త ప్రపంచ రికార్డును నమోదుచేసింది. గతంలో 170 గంటల రికార్డును కూడా ఆమె అధిగమించారు. ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభించిన ఈ రికార్డు ఆగస్టు 30న ముగిసింది. తొమ్మిదిరోజులపాటు నిరంతరాయంగా నృత్యంచేసిన మారథాన్ తర్వాతనే ఈ ప్రదర్శన జరిగింది. బ్రహ్మావర్ తాలూకాలోని ముండింజిడ్డుకు చెందిన దీక్ష భరత నాట్యంలో గొప్ప శిఖరాలను చేరుకోవాలనిచాలాకాలంగా ఆకాక్షంతో ఉంది. ఈ దీక్షతోనే ఆమె కఠినమైన తొమ్మిదిరోజుల లక్ష్యాన్ని పూరినతచేసేలా పురికొలిపింది. ఈనెల 28వ తేదీకల్లా ఆమె 170 గంటలప్రదర్శన పూర్తిచేసింది. మంగళూరుకు చెందిన రెమోనా ఎవెట్ పెరేరా నెలకొల్పిన గత రికార్డును బ్రేక్‌చేసింది. పెరేరా 170 గంటలపాటు నృత్యప్రదర్శనచేసి గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయింది. ఇపుడు దీక్ష రికార్డుప్రయత్నానికి ఉడిపి మాజీ ఎమ్మెల్యే కె.రఘుపతిభట్ మార్గదర్శకత్వంలో మణిపాల్‌లోని రత్న సంజీవకలామండల మద్దతు పుష్కలంగా లభించింది. శనివారం దీక్షను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డికెశివకుమార్ ఘనంగా సత్కరించారు. ఈరోజు ఉడిపిలో ఉండటం నాకు చాలా సంతోషంగా ఉందని, ఇక్కడి ఆలయాన్ని సందర్శించడకూడా నా చిరకాల స్వప్నం అని అన్నారు.

# విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యత

## గణేశ నిమజ్జనానికి ప్రత్యేక కార్యాచరణ

### సిఎండి ముషారఫ్ ఫరూఖీ

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త :**విద్యుత్ భద్రతకు తమ సంస్థ అత్యధిక ప్రాధాన్యతని స్తోందని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సిఎండి ముషారఫ్ ఫరూఖీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే తమ సంస్థ పరిధిలోని జిల్లాల్లో గణేష్ నిమజ్జనానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. ఈ మేరకు శనివారం నిర్వ హించిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఈ నెల 6 వ తేదిన నిర్వహించే గణేష్ విగ్రహాల శోభాయాత్ర మరియు నిమజ్జన కార్యక్రమం విద్యుత్ భద్రతా పరంగా సురక్షితంగా, సజావుగా జరిగేందుకు తగు ఏర్పాట్లు చేసిందన్నారు. ఇప్పటికే పెద్ద విగ్రహాలు ప్రతిష్టించిన మండపాలను, ఆ విగ్రహాల శోభాయాత్ర నిర్వహించే వీధులను, రహదారులను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని చెప్పారు. రోడ్ క్రాసింగ్సు, వదులుగా నున్న తీగలు సరి చేయటం, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ఎర్తింగ్, అవసరమైన చోట ఇన్సులేషన్ ఏర్పాటు, ఇనుప స్తంభాలు, ఫ్యూజ్ బాక్సులు వున్నచోట పివిసి పైపులు, ప్లాస్టిక్ షీట్ల ఏర్పాటు చేయడం వంటి పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. దీనికి తోడు ప్రతి సెక్షన్ పరిధిలో నిరంతరం అందుబాటులో వుండే విధంగా షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. గ్రేటర్ లో వివిధ విభాగాలైన ఆపరేషన్, లైన్స్, డిఈఈ లకు చెందిన 101 సబ్ డివిజన్ స్థాయి టీంలకు తోడు ఇతర విభాగాలకు చెందిన అధికారులు సిబ్బంది కూడా విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. అలాగే మేడ్చల్ జోన్ పరిధిలో 71 నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేకంగా 31 కంట్రోల్ రూమ్స్, అదనంగా 43 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, రంగారెడ్డి జోన్ పరిధిలో 29 నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేకంగా 25 కంట్రోల్ రూమ్స్, అదనంగా 22 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. అంతేకాకుండా మెట్రో జోన్ పరిధిలో 10 నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేకంగా 12 కంట్రోల్ రూమ్స్, అదనంగా 39 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసారు. విద్యుత్ అధికారులు పెద్ద విగ్రహాల శోభాయాత్ర నిర్వహించే మార్గాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని విద్యుత్ భద్రతపై దృష్టి సారించాలని, శోభాయాత్రలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా ఉండేందుకు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# ఆర్‌టిసి ఉప్పల్ వర్క్‌షాప్‌ను కరీంనగర్‌కు తరలించకుండా ఆపండి

## సిపిఐ ఎమ్మెల్యే కూనంనేనికి ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని బిబిడబ్ల్యూ మియాపూర్, జోనల్ వర్కుషాప్ ఉప్పల్ యూనిట్లను కరీంనగర్ షిఫ్ట్ చేయకుండా హైదరాబాద్డులోనే కొనసాగించాలని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఉప్పల్ వర్క్ షాప్‌ను ఇక్కడే కొనసాగించేలా చూడాలని కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావుకి శనివారం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 18 ఎకరాల స్థలంలో బస్ బాడీ బిల్డింగ్ వర్క్ షాప్ తో పాటు స్టోర్స్ అండఖ పర్చేజ్ డిపార్టుమెంట్లు సుమారు 155 మంది సిబ్బందితో పని చేస్తున్నాయన్నారు. ఈ స్థలం గజం 2 లక్షల ఖరీదు చేస్తోందని.. ఇక్కడ కొత్త బస్సులు తయారై డిపోలకు పంపబడతాయన్నారు. నైపుణ్యం గల కార్మికులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తుంటారని అటువంటి ఈ వర్క్ షాపును కరీంనగర్‌కు షిఫ్ట్ చేయాలని ఆర్‌టిసి యాజమాన్యం నిర్ణయించటం బాధాకరమన్నారు. ఈ స్థలమును ప్రైవేట్ వ్యక్తులకు 33 సంవత్సరాలు లీజుకు ఇవ్వాలనే ఆలోచనతో సంస్థ ఉన్నట్లుగా తెలుస్తోందని.. అదే జరిగితే ఆర్‌టిసి ఆస్తులు ప్రైవేట్ పరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాగే ఉప్పల్‌లో 16 ఎకరాల స్థలంలో జోనల్ వర్క్ షాప్, జోనల్ స్టోర్స్ సుమారు 355 మంది సిబ్బందితో పని చేస్తున్నాయన్నారు. వారందరూ నైపుణ్యం గల ఉద్యోగులని.. గ్రేటర్ హైదరాబాద్ జోన్, హైదరాబాద్ జోన్‌లోని 55 డిపోల బస్సులు ఈ వర్క్ షాప్‌కు కంప్లీట్ ఓవర్ హాల్ కోసం, మెటీరియల్ కోసం వస్తుంటాయన్నారు.

హైదరాబాద్ జోన్ లోని దూర ప్రాంత డిపోలైన నాగర్ కర్నూల్ లాంటి చోట్ల నుండి కంప్లీట్ ఓవర్ హాల్ కోసం, మెటీరియల్ కోసం కరీంనగర్‌కు రావడమనేది సంస్థకు నష్టదాయకమన్నారు. ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం కొన్ని ఉమ్మడి ఆస్తులుగా ఉన్నాయని.. వాటిపై షీలా బేడీ కమిషన్ రికమెండేషన్ కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపిందని గుర్తు చేశారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం వాటిపై ఏ నిర్ణయమూ తీసుకోలేదన్నారు. అలాంటి యూనిట్లను కదిలించటం సమంజసం కాదన్నారు. ఈ యూనిట్లను కరీంనగర్‌కు షిఫ్ట్ చేయటం వల్ల వర్కింగ్ క్లాస్‌లో పారిశ్రామిక అశాంతికి కారణమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఈ యూనిట్స్‌ను కరీంనగర్‌కు షిఫ్ట్ చేసే ప్రతిపాదనను విరమించుకునే విధంగా ఆర్‌టిసి యాజమాన్యానికి సూచించాల్సిందిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుని కోరినట్టు ఈదురు వెంకన్న తెలిపారు.

## బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

### రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లపై రాష్ట్రప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈమేరకు శనివారం విద్యానగర్‌లో బీసీ సంక్షేమ సంఘం, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షతన ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కొరకు ప్రత్యేక జీవో, అలాగే జీవో ద్వారానే ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహిస్తామవడం అనేది హర్షించదగ్గ పరిణామమని ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు.

ప్రభుత్వం గవర్నర్ చేత ఆర్డినెన్స్ ఆమోదింప చేసి జీవో జారీ చేయాలన్నారు. సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చిందని కావున అసెంబ్లీ చట్టం చేశారు జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చు అన్నారు. ఏమైనా న్యాయ పరమైన సమస్యలు వస్తే సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లినా బీసీల, కేసులు గెలిచే అవకాశం ఉందని ఎందుకంటే జనాభా లెక్కలల్లో బీసీ ప్రజలు ఎక్కువగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీధర్ స్వామి, రాజ్ కుమార్, సూర్యనారాయణ రవి యాదవ్, బాలయ్య , బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వరదలపై మాట్లాడుదామంటే.. బురద రాజకీయాలు

## కాళేశ్వరంపై చర్చకు సిద్ధం.. మాకు పిపిటికి అవకాశం ఇవ్వాలి

### మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** వరదల మీద మాట్లాడుదామని అంటే.. వరదలు ప్రాధాన్యత కాదు బురద రాజకీయాలు మాట్లాడుకుందామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండే రోజులు అసెంబ్లీ జరిపి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోవాలని చూస్తుందని ఆయన ధ్వజమెత్తారు. బీఏసీ సమావేశం నుంచి వాకౌట్ చేసిన హరీశ్‌రావు.. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. "వరదలు, ఎరువుల మీద చర్చించాలని బీఏసీ సమావేశంలో మేం కోరాం. కానీ ఆ రెండింటి మీద చర్చించరట. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేశాం. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చింది. వరదలు, యూరియా కొరతపై మాట్లాడాలని బీఆర్ఎస్ ప్రతిపాదించింది. ఈ రెండు అంశాలపై మాట్లాడాలని మేం కోరాం. వీటితో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. అంటు రోగాల మీద, గురుకులాల్లో కనీస సౌకర్యాలపై, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై, ఫోర్త్ సీటీ పేరు మీద జరుగుతున్న అక్రమాలు.. సీఎం కుటుంబ సభ్యుల పాత్రపై, ధాన్యం కుంభకోణంపై.. బాధ్యులపై, ప్రభుత్వ ఉద్యోగుల టీఏ, డీఏలు, పీఆర్సీ పై, గోదావరి బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై, హైడ్రా కూల్చివేతలు పేదలు పడుతున్న భాదలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలపై చర్చించాలని కోరాం. వీటికి ప్రభుత్వం అంగీకరించలేదు. దురదృష్టం ఏంటంటే రెండే రోజులు అసెంబ్లీ జరుపుతామని అంటున్నారు. వరదల మీద మాట్లాడదుదాం అంటే అది ప్రాధాన్యత కాదు బురద రాజకీయాలు మాట్లాడుకుందాం అంటున్నారు. ఎరువులు, రైతుల మీద మాట్లాడుకుందాం అంటే తొందర ఏముంది.. మెల్లగా మాట్లాడుదాం అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల కంటే ముఖ్యమైంది ఏముంటుంది..? వరద బాధితులు కాక ప్రధాన ఎంజెండా ఏముంటుంది..? ఎరువుల కొరత, వదరలపై మాట్లాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. ప్రభుత్వ ధోరణి చూస్తే కాళేశ్వరం కమిషన్ రిపోర్టు పెట్టి బురద రాజకీయాలకు పాల్పడే ఆలోచనలో కనబడుతున్నారు. దాని మీద చర్చకు సిద్ధం.. పిపిటి అవకాశం ఇవ్వండి.. ఒక్క రోజు కాదు నాలుగు రోజులు మాట్లాడుకుందాం అని చెప్పాం. కానీ కష్టాల్లో ఉన్న రైతులు, వరద బాధితులపై మాట్లాడాలంటే ముందుకు రావడం లేదు అని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఒక్క రోజే బీసీ బిల్లు, కాళేశ్వరం రిపోర్టుపై చర్చించి.. తర్వాత అసెంబ్లీ వాయిదా వేసుకుని పోతారట అని ధ్వజమెత్తారు. సభ కనీసం 15 రోజులు నిర్వహించాలి. ప్రజాపాలన అంటే ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనా..? ఎజెండా నిర్ణయించక పోవడమేనా..? కేవలం బురద రాజకీయాలే తమకు ప్రాధాన్యత అన్న ధోరణిలో ప్రభుత్వం ఉందని హరీశ్‌రావు మండిపడ్డారు

### అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదు: బిజెపి శాసనసభ పక్ష నేత ఎలేటి మహేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వానికి అందాలపోటీలపై ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదని బిజెపి శాసనసభాపక్ష నేత ఎలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈమేరకుశనివారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుండపోత వర్షాల కారణంగా అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారని తెలి భారీగా పంట నష్టం వాటిల్లి విపరీతంగా నష్టపోయారన్నారు. రాష్ట్రంలో సుమారు 2.20లక్షల ఎకరాలల్లో వివిధ రకాల పంటలు నాశనం అయ్యాయని.. బాధిత రైతులకు వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో అతలాకుతలమైన జిలాల్లో మంత్రులు పర్యటించకపోవడం దారుణమని అన్నారు. ఒకవేళ దేశానికి అన్నం పెట్టే అన్నదాత మీద నిజంగానే శ్రద్ధ ఉంటే.. సీఎం రేవంత్ రెడ్డి ఒక్క ప్రకటనైనా ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. మూసీ నది పక్షాళన, స్పోర్ట్స్ పాలసీ, అందాల పోటీలపై ప్రభుత్వానికి ఉన్న రైతుల మీద లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూతూమంత్రంగా అసెంబ్లీని మూడు, నాలుగు రోజులు పెట్టాలని చూస్తున్నారని.. ప్రజా సమస్యలపై చర్చించేందుకు కనీసం 30 రోజులైనా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తాము అడగబోయే సమస్యలకు సమాధానం చెప్పలేక త్వరగా సమావేశాలకు మంగళం పాడాలని చూస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగుల బకాయిలు, ఫీజు రియింబర్స్మెంట్, యూరియా కొరతపై సభలో చర్చ జరగాలని ఆలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్



### కెసిఆర్ అసెంబ్లీకి రావాలి..: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి

రాష్ట్రంలో ఉన్న సమస్యలన్నీ చర్చించడానికి శాసనసభ సమావేశాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరూధ్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ "బి.ఆర్.ఎస్ నేతలకు సూటి ప్రశ్న.. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ ఫామ్ హౌస్ లో కూర్చున్నారు. కేసీఆర్ కు లీలితి గా ఉండే అర్హత లేదు. అసెంబ్లీకి చర్చలకు కేసీఆర్ రావాలి. అది ప్రజాస్వామ్యానికి గౌరవం. కేసీఆర్‌కి నిజంగా ఆరోగ్యం బాగాలేకపోతే వీల్ చైర్ పై వచ్చి కూడా చర్చలకు హాజరవ్వచ్చు. గతంలో ఎంతో మంది అలా వచ్చి చర్చల్లో పాల్గొన్నారు. కాళేశ్వరం రిపోర్టు చర్చకు వస్తుందని సభను బాయ్ కాట్ చేశారు బి.ఆర్.ఎస్ నేతలు. యూరియా సమస్య కూడా ఖచ్చితంగా అసెంబ్లీలో చర్చిద్దాం...కావాలనే బి.ఆర్.ఎస్ నేతలు యూరియా కోసం ధర్నా చేస్తున్నారు. బీజేపీ నేతలు ఎనిమిది ఎంపి స్థానాలు గెలిచే విధంగా సహకరించిన బి.ఆర్.ఎస్ వాళ్లు, బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు యూరియా కోసం ప్రశ్నించరు ..? కేసీఆర్ కి ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై చర్చకు అసెంబ్లీకి రావాలి అని డిమాండ్ చేశారు.



### కాళేశ్వరంపై చర్చ అంటే భయం : ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

కాళేశ్వరంపై చర్చఅంటే బిఆర్ఎస్ నేతలు భయపడుతున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ " ప్రాజెక్టు నివేదికపై బి.ఆర్.ఎస్ నేతలు రకరకంగా స్పందిస్తున్నారు. 2017 లో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు అడిగితే అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు మీరు ఏ విధంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం అడుగుతున్నారు? పిల్లర్లు కృంగిపోతే బాంబు పెట్టి పేల్చారు అని మాట్లాడుతున్నారు. తప్పు చేసి ఉంటే కేసీఆర్, హరీష్ రావు, కే.టి.ఆర్ బహిరంగంగా తెలంగాణ ప్రజలను క్షమాపణ అడగండి. కాళేశ్వరం నివేదికపై చర్చించ కూడదు అని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నారు. సొంత పార్టీ ఎం.ఎల్.ఏ సంతాప తీర్మానంకి కేసీఆర్ రాకపోవడం వారి సొంత పార్టీ నేతలపై వారికి ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతుంది" అని బల్మూరి వెంకట్ అన్నారు.

### యూరియా కొరతకు బిజెపియే కారణం : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

యూరియా కొరత రావడానికి కారణం బీజేపీ నేతలే కారణమని భూపాల్‌పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ "బిజెపి నేతలకు నిజాయితీ ఉంటే యూరియా రాష్ట్రానికి తెప్పిచండి. వరదలకు నష్టపోతే కేంద్రం నుండి నిధులు తేలేకపోతున్నారు బీజేపీ నేతలు. నయా పైసా సహాయం చేయలేని బీజేపీ ప్రభుత్వం, తేలేని కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండే అర్హత లేదు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో యూరియాఇస్తే సపోర్ట్ చేస్తామని బిఆర్ఎస్ మాట్లాడడం విడ్డూరం"అని సత్యనారాయణ పేర్కొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్యాయత్నం

### భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం

**హైదరాబాద్ (కెపిహెచ్‌బికాలనీ) ఆగస్టు 30, ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో భార్యా భర్తలు కత్తితో చేతులు, గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా తీవ్ర గాయాలతో భర్త మృతి చెందగా భార్య ఆస్పత్రి పాలైన ఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గుంటూరు ప్రాంతానికి చెందిన దంపతులు రామకృష్ణారెడ్డి, రమ్యకృష్ణ కొన్నేళ్ల క్రితం కెపిహెచ్బీ కాలనీలోని ఓ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. స్థానికంగా రెస్టారెంట్, హోటళ్ల వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగించేవారు. అయితే ఇటీవల వారు చేస్తున్న వ్యాపారాల్లో తీవ్రంగా నష్టం రావడంతో మనస్తాపానికి గురయ్యారు. అంతేకాకుండా వ్యాపారం నిమిత్తం బంధు వులను, ఇరుగుపొరుగు వారి దగ్గర తీసుకున్న డబ్బుల విషయమై తీవ్రంగా ఒత్తిడి పెరిగినట్లు తెలుస్తోంది. దాంతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకోవాలనుకుని నాలుగు రోజుల నుండి పరస్పరం కత్తులతో గాయాలు చేసుకున్నారు. చివరగా చనిపోవాలని నిర్ణయించుకొని భార్య రమ్యకృష్ణ.. రామకృష్ణారెడ్డి గొంతుకోసింది. అనంతరం ఆమె కూడా గొంతు కోసుకొని ఆత్మహత్నానికి పాల్పడింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే భర్త రామ కృష్ణారెడ్డి మృతి చెందినట్లు గుర్తించారు. తీవ్రగాయాలపాలైన రమ్యకృష్ణను ఆసుపత్రికి తరలించారు. రమ్యకృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆమె స్పృహలోకి వస్తే మిగతా విషయాలు తెలుస్తాయని పోలీసులు పేర్కొంటున్నారు. పిల్లలు లేని కారణంగా ఇంట్లో భార్యాభర్తలే ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు రామకృష్ణారెడ్డి

# ప్రేక్షకులంతా రిలేటివ్ అయ్యే కథనాలతో లిటిల్‌హార్ట్స్



ప్రేక్షకులంతా రిలేట్ అయ్యే కథా కథనాలతో "లిటిల్ హార్ట్స్ ఆకట్టుకుంటుంది నిర్మాతలు ఆదిత్య హాసన్, సాయి కృష్ణ "90 మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ మౌళి తనుజ్,"అంబాజీపేట మ్యారేజి బ్యాండు" మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్ లో నటిస్తున్న మూవీ "లిటిల్ హార్ట్స్". ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. "90 మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ "లిటిల్ హార్ట్స్" మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్‌గా రిలీజ్ చేస్తున్నారు. "లిటిల్ హార్ట్స్" సినిమా సెప్టెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సందర్భంగా మూవీ హైలైట్స్ లేటెస్ట్ ఇంటర్వ్యూలో తెలిపారు నిర్మాతలు ఆదిత్య హాసన్, సాయికృష్ణనిర్మాత ఆదిత్య హాసన్ మాట్లాడుతూ,"లిటిల్ హార్ట్స్" సినిమా కథ విన్నప్పుడు ఇది నా శైలి రచనతో ఉన్న కథ అనిపించింది. మనమంతా బాగా రిలేట్ అయ్యే కథ ఇది. ప్రేక్షకులు రెండు రకాల కథల్లో లీనమవుతారు. ఒకటి తాము చేయాలనుకున్నవి చూపించే కథలు, రెండు తాము చేసినవి చూపించే స్టోరీస్. ఇది రెండో తరహా మూవీ. ప్రేక్షకులు తమ లైఫ్ లో కూడా ఇలా జరిగిందే అని సినిమా చూస్తున్నంత సేపు రిలేట్ అవుతారు. కథ విన్నప్పుడు ఒక ప్రేక్షకుడిగా నేనూ ఎంజాయ్ చేశాను. బాగా రిలేట్ అయ్యాను. ఈ సినిమాకు రైటింగ్, ఆర్టిస్ట్ సెలెక్షన్, ఇతర అంతా సాయి మార్తాండ్ చూసుకున్నాడు. రైటింగ్ సైడ్ నా ఇన్వాల్వ్ మెంట్ ఏమీ లేదు. ప్రొడక్షన్ పరంగా నేను ఏ సపోర్ట్ చేయగలనో మాకున్న బడ్జెట్స్ లో చేశాను. నేను ప్రొడ్యూస్ చేస్తున్నాననే విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. ఇందులో సీరియస్ లవ్ స్టోరీ ఏం లేదు. టీనేజ్ లో ఉండే ఇమ్మెచ్యూర్ లవ్ స్టోరీ చూపిస్తున్నాం. అది సరదాగా సాగుతుంది. ఈ ప్రేమకథలో పెద్ద ట్విస్ట్‌లు ఏమీ ఉండవు. ఒకప్పుడు మనం ఇంత సిల్లీగా ఉన్నామా అనిపిస్తుంటుంది. ప్లెజెంట్ గా ఉంటుంది. ఇప్పుడు మనం ఒక అమ్మాయిని ప్రేమిస్తే అలా వెంటపడం, మెసేజ్‌లు పంపము. ఆ పరిణితి మనలో వయసుతో పాటే ఏర్పడుతుంది. "లిటిల్ హార్ట్" సినిమాలో సందేశం ఏమీ ఉండదు. నా దృష్టిలో సినిమా అంటే మన కష్టాలను కాసేపు మరిపించి సంతోషపెట్టేది. మనం నిద్రపోతున్నప్పుడు ఎలా అన్ని బాధలు మర్చిపోతామో, అలా సినిమా చూస్తున్న రెండు, రెండున్నర గంటల సేపు ప్రేక్షకులు అన్ని ఇబ్బందులు మర్చిపోయి ప్రశాంతంగా బయటకు రావాలి. మూవీలో సాంగ్స్ కూడా ఇలా మనం ఈజీగా రిలేట్ అయ్యేలా డిజైన్ చేశాం. మనం మాట్లాడుకునే మాటలు, సందర్భానుసారం ఉపయోగించే పదాలే ఉంటాయి. నేను యూకేలో ఉన్నాను. ఇక్కడ చాలామంది నన్ను కలిసి మేము బాహుబలి తర్వాత కుటుంబ సభ్యులం అంతా కలిసి "90మిడిల్ క్లాస్ బయోపిక్" చూశామని చెబుతున్నారు. "లిటిల్ హార్ట్స్" కూడా యూఎస్ యూకేలోని వారికి బాగా నచ్చుతుంది. వారు లైఫ్‌లో మిస్ అయినవి ఈ మూవీలో చూసి ఎంజాయ్ చేస్తారు. మౌళిని హీరోగా పెట్టుకోవడం వల్ల "90 మిడిల్ క్లాస్ బయోపిక్" తో పోలిక వస్తుందనే భయం లేదు. అలా పోల్చుకున్నా మాకు ఓపెనింగ్స్ ఇంకా ఎక్కువ వస్తాయి. ఈ సినిమాకు డైరెక్షన్ పరంగా నా సూపర్ విజన్ ఏం లేదు. ఎడిటింగ్ దగ్గర మాత్రం ఏ సీన్స్ బాగా వర్కవుట్ అవుతాయి, ఏవి థియేట్రికల్‌గా వద్దు అనుకున్నవి సెలెక్ట్ చేశాం. ఓటీటీలో ఫుల్ వెర్షన్ వస్తుంది. కొన్ని నిమిషాల నిడివి ఓటీటీలో పెరగవచ్చు. ఓటీటీ అండ్ థియేట్రికల్ పరంగా చూస్తే స్టార్ కాస్టింగ్ కంటే ఈ కథకు ఎవరు బాగా సెట్ అవుతారో అనేది ఈటీవీ విన్, మా డైరెక్టర్, మా టీమ్ సెలెక్ట్ చేసింది. మౌళి కథ విని నా దగ్గరకు తీసుకొచ్చాడు. నేను విన్నాక మా డైరెక్టర్ సాయి సేమ్ నాలాగే స్క్రిప్ట్ చేశాడు అనిపించింది. ఈ మూవీని చేయాలని ఫిక్స్ అయ్యాం. ఇలాంటి మూవీస్‌ను మలయాళం నుంచి డబ్ చేస్తే మనం ఎంజాయ్ చేస్తున్నాం. మన నేటివిటీ చూపించేలా మంచి మూవీ థియేట్రికల్‌గా, ఓటీటీకి అవుతుంది అనిపించింది. అన్నారు. నిర్మాత సాయి కృష్ణ మాట్లాడుతూ, వెబ్ సిరీస్‌లు ఇలాగే ఉండాలనే ట్రెండ్‌ను "90 మిడిల్ క్లాస్ బయోపిక్" బ్రేక్ చేసింది. మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ కథ, మనం రిలేట్ అయ్యేలా చేస్తే ప్రేక్షకులు ఎంతగా ఆదరిస్తారో ఆ వెబ్ సిరీస్ ప్రూవ్ చేసింది. ఇప్పుడు లిటిల్ హార్ట్స్ కూడా అలాగే సక్సెస్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం. ముందునుంచీ ఈ కథను థియేట్రికల్ మూవీ చేయాలనే ప్లాన్ చేశాం. మనకు కోవిడ్ తర్వాత చూస్తే. బాగున్న సినిమాలన్నీ థియేట్రికల్‌గా బాగా ఆదరణ పొందాయి. ఈటీవీ విన్ నుంచి లిటిల్ హార్ట్స్ ప్రొడ్యూస్ చేయడం హ్యాపీగా ఫీలవుతున్నాం. కంటెంట్‌ను బట్టి ఏది థియేటర్‌కు బాగుంటుంది, ఏది ఓటీటీకి బాగుంటుంది అనేది సెలెక్ట్ చేసి ప్రొడ్యూస్ చేస్తున్నాం. ఈటీవీ విన్ నుంచి మరో ఆరు సినిమాలు రాబోతున్నాయి. మూవీలో హీరో హీరోయిన్స్‌కు చదువురాదు. చదువు రాని అమ్మాయి, అబ్బాయి మధ్య జరిగే ఫన్నీ స్టోరీ ఇది. వంశీ నందిపాటి, బన్నీ వాస్ ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారు. దాదాపు 200 థియేటర్స్‌లో మా మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సెప్టెంబర్ 3న మూడు సెంటర్స్‌లో ఫ్రీ షోస్ ఇంటర్ విద్యార్థుల కోసం వేస్తున్నాం. సెప్టెంబర్ 4వ తేదీ నుంచి పెయిడ్ ప్రీమియర్స్ ప్రదర్శిస్తాం. మీ అందరి సపోర్ట్ కావాలని కోరుకుంటున్నాం, అన్నారు.

# "దేవసస్య" మూవీ నుంచి ఇందుమామ లిరికల్ సాంగ్ రిలీజ్



సెల్విన్ దేశాయ్, ఆహాన్, బింబిక రావ్, ప్రకాష్ బేల్వాడి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "దేవసస్య". ఈ చిత్రాన్ని అనంత ఫిలింస్ బ్యానర్ పై అనంతమూర్తి హెగడే నిర్మిస్తున్నారు. కార్తీక్ భట్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో "దేవసస్య" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి ఇందుమామ లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు.

ఇందుమామ పాటకు శ్రీకాంత్ లిరిక్స్ అందించగా, ధనుంజయ్ సీపాన పాడారు. హరి అజయ్ మంచి ఫోక్ బీట్ తో కంపోజ్ చేశారు. ఇందు మామ పాట ఎలా ఉందో చూస్తే ఇందుమామ ఇందుమామ ఇందుమామ కట్టం కుట్టం అంటవ్ దరువేయ్ ఇందుమామ, ఇందుమామ ఇందుమామ ఇందుమామ కేకవేసి కబురెట్టేసేయ్ ఇందుమామ, హే మామ ఇందుమామ హే మామ ఇందుమామా..ఖి అంటూ సాగుతుందీ పాట. ట్రైబల్ ట్రెడిషన్, డ్యాన్సులతో డిజైన్ చేసిన ఈ పాట ఆకట్టుకుంటోంది. నటీనటులు సెల్విన్ దేశాయ్, ఆహాన్, బింబిక రావ్, ప్రకాష్ బేల్వాడి, గీతా సిద్ధి, మంజునాథ్ హెగడే, తదితరులు

టెక్నికల్ టీమ

ప్రొడ్యూసర్ అనంతమూర్తి హెగడే
బ్యానర్ అనంత ఫిలింస్
రచన, దర్శకత్వం : కార్తీక్ భట్
డీవోపీ : రాజు.ఎన్.ఎం,
ఎడిటర్, కలరిస్ట్, వీఎఫ్ఎక్స్ ప్రజ్వల్.ఆర్
మ్యూజిక్ హరి అజయ్
పీఆర్ఓ జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్)
ప్రొడక్షన్ డిజైనర్ కేజీఎఫ్ కిరణ్
యాక్షన్ అల్టిమేట్ శివ
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సంతోష్ నాయక్ బ్యగడ్డే .

# మెగాస్టార్ చిరు ఆత్మీయ స్పందన

మహోన్నతమైన వ్యక్తిత్వం, యెనలేని సేవాతత్వంతో కోట్లాది మంది అభిమానుల గుండెల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించిన మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన మానవత్వాన్ని చాటారు.

ఆంధ్రప్రదేశ్‌లోని ఆదోని పట్టణానికి చెందిన చిరంజీవి వీరాభిమాని రాజేశ్వరి, మెగాస్టార్ ని కలవాలనే కలతో సైకిల్‌పై హైదరాబాద్‌కు సాహసోపేత ప్రయాణం మొదలుపెట్టారు. ఎన్నో శారీరక, మానసిక సవాళ్లు ఎదురైనా చిరంజీవిపై వున్న అపారమైన అభిమానమే ఆమెను విజయవంతంగా ముందుకు నడిపింది. ఈ విషయం తెలుసుకున్న మెగాస్టార్ చిరంజీవి, రాజేశ్వరిని హృదయపూర్వకంగా ఆహ్వానించారు. ఆమె అంకితభావానికి, తనను చేరుకోవడానికి చేసిన కృషికి చలించిపోయిన చిరు, ఒక చిరస్మరణీయ జ్ఞాపకాన్ని ఇచ్చారు.

ఆ సందర్భంలో రాజేశ్వరి, మెగాస్టార్ కి రాఖీ కట్టగా, ఆమెకు ఆశీస్సులు అందించి అందమైన సాంప్రదాయ చీరను బహుమతిగా ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రధాన ఘట్టం చిరంజీవి తన మానవతా విలువలను చాటిన విధానం. రాజేశ్వరి పిల్లల విద్య కోసం, వారి భవిష్యత్‌లో వెలుగునింపడం కోసం పూర్తి స్థాయి ఆర్థిక సహాయం అందించనున్నట్లు హామీ ఇచ్చారు చిరు. తన అభిమానులను కేవలం అభిమానులుగానే కాక, కుటుంబ సభ్యుల్లా చూసుకునే చిరంజీవి గొప్ప మనసుకు ఇది మరొక ఉదాహరణగా నిలిచింది. సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలో కూడా చిరంజీవి మెగాస్టార్ అని చాటి చెప్పింది.



# గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ లో హీరో రోషన్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ లాంచ్

కనకాల 2025, పోస్టర్లు, పుట్టినరోజు స్పెషల్ గ్లింప్స్ తో మంచిబజ్ క్రియేట్‌చేసింది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ది వరల్డ్ ఆఫ్ మోగ్లీ గ్లింప్స్ ను లాంచ్ చేశారు. గ్లింప్స్ నాని వాయిస్‌తో ప్రారంభమవు తుంది. 2025 లో అటవీ నేపథ్యంలో జరిగే ప్రేమకథను అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఒక యువకుడు గ్యాంగ్‌స్టర్, స్మగ్లర్‌గా కాకుండా, ప్రేమికుడిగా 30మందిని పరిగెత్తిస్తాడనే నెరటివ్ చాలా ఆసక్తికరంగా ఉంది. దర్శకుడు సందీప్ రాజ్ ప్రేమకథను ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో ఫ్రెష్ విజువల్స్, హత్తుకునే ఎమోషన్స్‌తో అద్భుతంగా చూపించారు. హీరో పట్టణ జీవితంతో పరిచయం లేనివాడు కానీ అడవిలో మాత్రం తనకి తిరుగులేదు. నాని వాయిస్ ఓవర్ కథనానికి మరింత డెప్త్‌ని యాడ్ చేసిందిరోషన్ కనకాల రగ్గడ్ ఇంటెన్స్ అవాతర్ లో అదరగొట్టాడు. అతను గుర్రంపై

చేసిన రోషన్ కనకాల, సందీప్ రాజ్, టిజి విశ్వ ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మోగ్లీ 2025 గ్లింప్స్ గ్లింప్స్ కు నేచురల్ స్టార్ నాని వాయిస్ ఓవర్ బబుల్గమ్ తో సక్సెస్ ఫుల్‌గా డెబ్యు చేసిన యంగ్ హీరో రోషన్ కనకాల, తన అప్ కమింగ్ మూవీ మోగ్లీ 2025 లో పూర్తిగా భిన్నమైన పాత్రలో నటిస్తున్నారు. తన తొలి చిత్రం కలర్ ఫోటోతో జాతీయ అవార్డు గెలుచుకున్న దర్శకుడు సందీప్ రాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై విజనరీ టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన మోగ్లీ

దూసుకెళ్లే విజువల్స్ నెక్స్ట్ లెవల్‌లో వున్నాయి. బండిసరోజ్ కుమార్‌విలన్‌గా ఇంపాక్ట్ క్రియేట్ చేశారు, రోషన్‌లవర్‌గా సాక్షి మడోల్కర్ అద్భుతంగా కనిపించింది. వారి కెమిస్ట్రీ, లిప్‌లాక్ సీక్వెన్స్ ఇంటెన్స్ లవ్ స్టొరీని ప్రజెంట్ చేస్తున్నాయి. హర్ష చెముడు కీలక పాత్రలో కనిపించారు. సినిమాటోగ్రాఫర్ రామమారుతి అద్భుతమైన విజువల్స్ అందించగా, కాలా భైరవ పవర్ ఫుల్ మ్యూజిక్ ఎమోషన్ ని మరింత ఎలివేట్ చేసింది.

# సినీ నిర్మాత అల్లుఅరవింద్‌కు మాతృ వియోగం

**. వృద్దాప్య సమస్యలతో కన్నుమూత**
**.అంత్యక్రియలో పాల్గొన్న రామ్‌చరణ్**
**.పాడెమోసిన మెగాస్టార్**
**నివాళులు అర్పించిన సినీ నిర్మాతలు, హీరోలు,కార్మికులు**



అలనాటి హాస్యబ్రహ్మ స్వర్గీయ అల్లు రామలింగయ్య సతీమణి, నేటి ప్రముఖ తెలుగు సినీ అగ్ర నిర్మాత అల్లు అరవింద్ తల్లి, స్టైలిష్‌స్టార్ అల్లు అర్జున్ నానమ్మ అల్లు కనకరత్నమ్మ (94) వృద్దాప్య ఆనారోగ్యం కారణంగా స్వర్గస్తులయ్యారు. శనివారం తెల్లవారు జామున1.45 గంటకు ఆమె తుది శ్వాస వదిలారని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే దిగ్భ్రాంతికి గురైన మెగాస్టార్ వెంటనే అల్లు అరవింద్ ఇంటికిచేరుకున్నారు. బావమరిది అల్లుఅరవింద్‌ను ఓదార్చారు. అక్కడే ఉండి, అంత్యక్రియకు చేయాల్సిన ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నారు. స్వర్గీయ అల్లు రామలింగయ్య సతీమణి శివైక్యం చెందడం చాలా బాధించిందని, మా కుటుంబాలపై ఆమె చూపిన ప్రేమ, అందించిన ధైర్యం జీవిత విలువలు ఎప్పటికీ ఆదర్శమని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అల్లు కనకరత్నమ్మ మరణవార్త విన్న రామ్‌చరణ్, అల్లుఅర్జున్ షూటింగ్‌లను వదిలేసి హైదరాబాద్‌కు చేరుకున్నారు. నానమ్మ లేరన్న విషయం తట్టుకోలేక వెక్కివెక్కి ఏడ్చారు. పలువురు సినీ నిర్మాతలు నటులు అల్లు అరవింద్ ఇంటికి వచ్చి ఆమె భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలుంచి ఘన నివాళులు అర్పించారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని కోకాపేట లోని అల్లు అరవింద్ భూమిలో కనకరత్నమ్మ అంత్యక్రియలు సాంప్రదాయబద్దంగా నిర్వహించారు.

**అల్లు కనకర్నతమ్మ ఆత్మకుశాంతి చేకూరాలి: టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్:** అల్లు కనకరత్నమ్మ మృతిపట్ల రాష్ట్ర కమిటీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. దివంగత పద్మశ్రీ అల్లురామలింగయ్య సతీమణి కన్నమూశారన్న వార్త తెలుసుకుని తీవ్రంగా చింతిస్తున్నామని ఆయన అన్నారు. అల్లు కనకరత్నమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. అల్లు అరవింద్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాని మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# డ్యూడ్ నుంచి బూమ్ బూమ్ రిలీజ్



ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు, సాయి అభ్యాంకర్, కీర్తిశ్వరన్, మైత్రి మూవీ మేకర్స్ పాన్ ఇండియా ఫిల్మ్ ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు, సాయి అభ్యాంకర్, కీర్తిశ్వరన్, మైత్రి మూవీ మేకర్స్ పాన్ ఇండియా ఫిల్మ్ డ్యూడ్ నుంచి ఫస్ట్ గేర్ బూమ్ బూమ్ రిలీజ్ వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పాన్ ఇండియా మూవీ డ్యూడ్‌తో అలరించడానికి రెడీ అవుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. ప్రేమలు అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఫస్ట్ సింగిల్ బూమ్ బూమ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాటని సాయి అభ్యాంకర్ స్వరపరిచి పాడారు. ఎనర్జిటిక్ బీట్స్, ఆకట్టుకునే సాహిత్యంతో ఈ సాంగ్ యూత్ కి అద్భుతంగా కనెక్ట్ అవుతుంది. సేనాపతి భరద్వాజ్ పాత్రుడు లిరిక్స్ చాలా ఫ్రెష్‌గా వున్నాయి. దీప్తి సురేష్, భూమిక, సాయితో కలిసి అలపించిన పాట యూత్ ఫుల్ వైబ్ తో అదిరిపోయింది. విజువల్స్, సరదాగా గడిపే ఫ్రెండ్స్ గ్యాంగ్, ప్రదీప్, మమిత కెమిస్ట్రీ, స్టైలిష్ డ్యాన్స్ మూవ్‌లతో సాంగ్ చాలా ట్రెండీగా వుంది. ఈ చిత్రానికి నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్, లతా నాయుడు ప్రొడక్షన్ డిజైనర్. భరత్ విక్రమన్ ఎడిటర్. ఈ దీపావళికి డ్యూడ్ కలర్‌ఫుల్, మ్యూజిక్‌తో కూడిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌ను అందించడానికి సిద్ధంగా ఉంది. ఈ చిత్రం అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషలలో విడుదల కానుంది. తారాగణం: ప్రదీప్ రంగనాథన్, శరత్ కుమార్, మమిత బైజు, రోహిణి మొల్లేటి, హృదు హరూన్, ద్రవిడ్ సెల్వం. సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కీర్తిశ్వరన్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, సిఇఓ: చెర్రీ
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనిల్ యెర్నేని
సంగీతం: సాయిఅభ్యంకర్, సినిమాటోగ్రాఫర్: నికేత్‌బొమ్మి, ప్రొడక్షన్ డిజైనర్: లతా నాయుడు,
కాస్ట్యూమ్ డిజైనర్: పూర్ణిమా రామస్వామి,
ఎడిటర్: భరత్‌విక్రమన్, తమిళ, పిఆర్ఓ: సురేష్‌చంద్ర, సతీష్

# అందరికీ కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది: విక్రమ్ ప్రభు

ఘాటీలో దేశిరాజుపాత్ర నాకోసమే రాశానని క్రిష్ చెప్పడం చాలా సంతోషాన్నిచ్చింది సినిమా అనుష్క శెట్టి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటీ. విక్రమ్ ప్రభు మేల్ లీడ్‌గా నటించిన ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. ఇప్పటికే అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో నటుడు విక్రమ్ ప్రభు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**సినిమా చేయడానికి మిమ్మల్ని ఎగ్జైట్ చేసిన పాయింట్ ఏంటి?**

డైరెక్టర్ క్రిష్‌ని చూసి నేను ఈ సినిమాకు ఓకే చెప్పా. ఆయన నన్ను కలిసి కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యా. ఆయన చాలా పాజిటివ్ పర్సన్. చాలా ఎక్స్‌పీరియన్స్ ఉన్న డైరెక్టర్. నాకు కథ చెప్పడానికి ముందు .'ఘాటీ' వరల్డ్ ఎలా ఉంటుందో చూపించారు. అలాగే నన్ను ఈ రోల్‌కు ఎందుకు సెలెక్ట్ చేశారో అనే విషయం గురించి అరగంటసేపు చాలా క్లియర్‌గా వివరించారు. హైదరాబాద్‌లో నాకున్న ఫ్యాన్ బేస్ గురించి చెప్పారు. నా గత సినిమాల్లోని చాలా సీన్స్ గురించి చెబుతూ.. నిన్ను దృష్టిలో పెట్టుకునే దేశిరాజుక్యారెక్టర్ రాశానని చెప్పారు. ఆ మాట నాకెంతో సంతోషాన్నిచ్చింది. ఆయనతో మాట్లాడాక సినిమా విషయంలో మా ఇద్దరి అభిప్రాయాలు సేమ్ అని అర్థమైంది. తర్వాత నా క్యారెక్టర్ గురించి ప్రెజెంటేషన్ ఇచ్చి స్టోరీ చెప్పారు.

**స్క్రిప్ట్ విన్నాక మీ రియాక్షన్ ఏంటి?**

స్క్రిప్ట్ చాలా ఫ్రెష్‌గా అనిపించింది. ఘాటీ వరల్డ్ ప్రతి ఒక్కరూ రిలేట్ అయ్యేలా ఉంటుంది. క్రిష్ చాలా హోమ్ వర్క్ చేసి ఈ స్క్రిప్ట్ ప్రిపేర్ చేశారు. స్క్రిప్ట్‌లో నాకున్న సందేహాలన్నింటికీ ఆయన చాలా చక్కగా సమాధానాలిచ్చారు. అప్పుడు నాకు స్క్రిప్ట్‌పై కాన్ఫిడెన్స్ పెరిగి ఓకే చెప్పా. ఇందులో నా ఫేవరెట్ యాక్టర్ అనుష్క ఉండడం నాకు ఇంకా హ్యాపీ.

**ఇది మీ ఫస్ట్ డైరెక్ట్ తెలుగు ఫిల్మ్ కదా? ఎలా అనిపిస్తోంది?**

నేను తెలుగులో చిరంజీవికి, నాగార్జునకి పెద్ద ఫ్యాన్‌ని. వాళ్ల సినిమాలు



ఎన్నోసార్లు థియేటర్‌లో చూశా.

**డైరెక్ట్ తెలుగు సినిమా చేయాలని ఎప్పుడూ ప్లాన్ చేయలేదా?** తెలుగు సినిమా చేయాలని ఎప్పటి నుంచో ఉంది. కానీ నా లైఫ్‌లో ప్లాన్ ప్రకారం ఏదీ జరగలేదు. నేను డైరెక్టర్ అవుదామనుకుంటే యాక్టర్ అయ్యా. అందుకే నా హార్ట్ ఏం చెబితే అదే చేసుకుంటూ వెళ్తున్నా. అనుష్కతో కలిసి నటించే ఛాన్స్ గతంలో ఒకసారి మిస్ అయింది. రుద్రమదేవిలో అల్లు అర్జున్ చేసిన గోనగన్నారెడ్డి పాత్రను గుణశేఖర్ ఫస్ట్ నాకే చెప్పారు. కానీ అప్పుడు నాకు కుదరలేదు. అల్లు అర్జున్ ఆ పాత్రకు వందశాతం న్యాయం చేశారు. **క్రిష్ గురించి చెప్పండి?** క్రిష్ డైరెక్షన్‌లో పని చేయడం నాకు చాలా కంఫర్టబుల్‌గా అనిపించింది. ఆయనతో ఏదైనా ప్రాబ్లం అంటే ఆయన పొయెటిక్‌గా ఉండడమే. సీన్స్ విషయంలో చాలా కాన్ఫిడెంట్‌గా ఉంటారు. ప్రతి సీన్ కూడా ఆడియన్స్ కనెక్ట్ అయ్యేలా తీశారు. అనుష్కతో పాటు మిగతా నటీనటులంతా స్క్రిప్ట్‌లో ఉన్నది ఉన్నట్లు చేశారు.

**ఘాటీలో యాక్షన్ సీన్స్ గురించి?**

యాక్షన్ సీన్స్ చేయడం అంటే నాకు చాలా ఇష్టం. చాలా ఎంజాయ్ చేస్తూ చేశా. యాక్షన్ సీన్స్ చిత్రీకరణలో డీఓపీ పాత్ర ఇందులో చాలా కీలకం. డీఓపీ మనోజ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ పర్సన్. మిగతా సినిమాల్లో కంటే ఇందులో ఫైట్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. **దేశిరాజుక్యారెక్టర్ మీకు ఏదైనా కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది?**

నటులకు ప్రతి క్యారెక్టర్ ఒక కొత్త ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. ఇందులో నా పాత్ర మాట్లాడే భాష ఛాలెంజింగ్‌గా అనిపించింది.

**అనుష్కలో కలిసి పని చేయడం ఎలా అనిపించింది?**

అనుష్కకి నేను అభిమానిని. ఆమె పేరుకు తగ్గట్టు నిజంగా ఎంతో స్వీట్ పర్సన్. ఆమె ఎంత స్వీట్ పర్సనో అంతే పవర్‌ఫుల్ కూడా. ఆమె తన కళ్లతోనే అన్ని హావభావాలూ పలికించగలరు. **మ్యూజిక్ డైరెక్టర్ సాగర్ గురించి చెప్పండి?** నటీనటులు : ఎంత పర్ఫార్మ్ చేసినా డీఓపీ ఎంత అద్భుత దృశ్యాలు చిత్రీకరించినా వాటికి జీవం పోసేది సంగీతమే. అలాంటి అద్భుతమైన సంగీతాన్ని సాగర్ అందించారు. అది మీరు థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు కచ్చితంగా ఫీల్ అవుతారు. నిర్మాతల గురించి చెప్పండి. ఈ సినిమా నిర్మాతలతో కలిసి పని చేయడం చాలా కంఫర్ట్ అనిపించింది. రెగ్యులర్ సినిమాలు చేయడం వేరు ఈ సినిమా చేయడం వేరు. ఎంతో ప్యాషన్ ఉంటే తప్ప ఇలాంటి సినిమాలు చేయడానికి ముందుకు రాలేరు. ఈ విషయం ఎందుకు చెబుతున్నానో సినిమా చూశాక మీకు అర్థమవుతుంది.

# ఐరాస మెచ్చిన నాయకురాలు !



సమస్య ఏంటో అందరికీ తెలుసు. కానీ, కొందరే పరిష్కారాల దిశగా ఆలోచిస్తారు. అలాంటి వారికే గుర్తింపు కూడా దక్కుతుంది. కర్ణాటకకు చెందిన బీబీ ఫాతిమా స్వయం సహాయక బృందం. ఆ కోవకి చెందినదే.

ఈ బృందానికి నాయకురాలు బీబీ జాన్,

కర్ణాటక, ధారవాడ ఏర్పాటు తీర్థ గ్రామం తనది. ఈ బృందం సహజ సమృద్ధి నెట్వర్క్ భాగం. 2018లో 15 మందితో ఏర్పాటైంది ఈ ఎస్‌హెచ్‌జీ అయితే, లీడర్‌గా తనకంటూ ప్రత్యేకంగా ఉండాలనుకున్న బీబీ జాన్... ఎకో ఫ్రెండ్లీ వ్యవసాయ పద్ధతులు పాటించడంపై దృష్టి పెట్టింది. ఆ గ్రామంలో కమ్యూనిటీ సీడ్ బ్యాంకులను నిర్వహించడం, మిల్లెట్ సాగును ప్రోత్సహించడం, దేశీయ పంట రకాలను సంరక్షి ంచడం, మహిళా వ్యాపారులకు సాధికారత కల్పించడం వంటివెన్నో చేశారు. అంతేకాదు, సుమారు 30 గ్రామాల్లో సహజ వ్యవసాయ శిక్షణ ద్వారా మిల్లెట్ ఆధారిత మిశ్రమ పంట వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి ఆడవాళ్లు నిర్వహిస్తున్నోన్న మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్నూ నడుపుతోంది బృందం. పశువులు, ఉద్యానవనాల పెంపకం... ఇలా అనేక వాటిపై గ్రామాల్లో అవగాహన కల్పించింది. వీటన్నింటివల్ల ఆయా గ్రామాల్లో వారికి పోషకాహార భద్రత పెరగడమేకాదు, స్థిరమైన ఆదాయమూ లభించడం లేదు. జీవవైవిధ్య నోబెల్ అందుకుని... గ్రామాల్లో వాతావరణ మార్పులను తగ్గించేందుకు బీబీ పాతిమా తీసుకొచ్చిన ఈ పరిష్కారాలు బృందానికి గుర్తింపునిచ్చాయి. యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ విమెన్ అండ్ యూత్ లీడర్‌షిప్ నేచర్ బేస్డ్ ఫర్ క్లైమేట్ యాక్షన్ అనే థీమ్‌తో నిర్వహించిన పోటీలకు భారత్ తరపున పాల్గొనేలా చేశాయి. మొత్తం 103 దేశాలకు చెందిన 700 మందిపై గెలుపొంది, బయోడైవర్సిటీ కన్జర్వేషన్‌లో నోబెల్ బహుమతిగా భావించే ప్రతిష్ఠాత్మక 'ఈక్వేటర్ ఇనిషియేటివ్' అవార్డు గెలుచుకుంది ఫాతిమా. దీని ద్వారా సుమారు రూ.8.5 లక్షల నగదు బహుమతినీ అందుకోనుంది. □

# తెలుసుకుందాం..



ప్రపంచ ఆర్థిక సంఘం 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్-2025'లో భారత స్థానం 131. 2024 కంటే రెండు స్థానాలు కిందకు వెళ్లింది. ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం ఉపాధి, విద్య, ఆరోగ్యం జీవన ప్రమాణాలు, రాజకీయ ప్రాతినిధ్యాన్ని పరిగణలోకి తీసుకుని ఈ ఇండెక్స్‌ని నిర్ధారిస్తారు. ఏడాదిగా రాజకీయాలు మినహా మిగతా అన్ని విభాగాల్లో భారతీయ మహిళలు పురోగతి సాధించారు. □

# ఆపదలో ఆదుకునే కమాండోలు



మహిళాసాధికారత, ఫ్రెండ్లీ పోలీసింగ్... వంటి మాటల్ని చెప్పడమే కాదు... ఆచరణలో చూపించాలను కున్నారు నిర్మల్ పోలీసు బాస్ జానకీ షర్మిల. తమ జిల్లాలో మహిళా పోలీసులను కార్యాలయ విధులకే పరిమితం చేయకుండా కీలకబాధ్యతలు అప్పగించారు. దాంతో వారంతా సివంగులై, పోలీస్ అక్కలుగా తమ నారీ శక్తిని చాటుతున్నారు.

**ఆదుకునే కమాండోలు...**

జిల్లాలో గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్టులు, ఆ పక్కనే శ్రీరాంసాగర్, గోదావరి నదితోపాటు అనేక చెరువులు ఉన్నాయి. మామూలు రోజుల్లో ఇక్కడి నీటి ప్రవాహం ఆకర్షిస్తుంది. వర్షాల వేళ భయపెడుతుంది. అలాంటి నీటిలో చిక్కుకున్నవారిని కాపాడాలంటే ఎంతో తెగింపు, మరెంతో ధైర్యం కావాలి. ఆపదల్లో చిక్కుకున్నవారికి రక్షణగా సివంగి బృందం పని చేస్తోంది. ఇప్పటికే 16 మంది మహిళా కానిస్టేబుళ్లకు 4 రోజుల పాటు కమాండో తరహా శిక్షణ అందించారు. తాజాగా బాసర గోదావరిలో తాడు విసరడం, మునిగి వారిని పైకి లాగడం, బోట్ల సహాయంతో రక్షి ంచడం, ప్రథమ చికిత్స అందించడం వంటి అంశాల్లో నిపుణులు మారారు. గతంలో మామడ మహిళ ప్రాంతంలో తప్పిపోయిన నలుగురిని గుర్తించి వెనక్కి తీసుకొచ్చింది వీరే కావడం విశేషం.

**నారీశక్తిని చాటుతూ....** పెట్రోకార్, డయల్ 100, పాయింట్ బుక్ తని, ఎంఒ అఫెండర్స్ వంటి పలు విధులను సాధారణంగా మగ పోలీసులు నిర్వహిస్తారు. బాధ్యతల్లో కాస్త కఠినత్వం, సమయం సందర్భంతో సంబంధం వెళ్లాల్సి రావడమనే కారణాలతో వీటిని మహిళలకు కేటాయించే వారు కాదు. కానీ, 'నారీ శక్తి' పేరుతో పోలీసులు అన్ని పోలీస్ స్టేషన్లలోనూ వారంలో ఒకరోజు విధిగా ఈ తరహా విధులను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ప్రజలకు అవగాహన, వాహన సోదాలు చేస్తున్నారు. గంజాయి గస్తీ పేరుతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. భైంసా, ఖానాపూర్, లక్ష్మణ చాంద, నిర్మల్ పరిధిలో డయల్ 100కు వచ్చిన కాల్స్ ఆధారంగా ఆత్మహత్యకు యత్నించిన పలువురిని మహిళా సిబ్బందే కాపాడటం.

**అండగా ఉండేందుకు..**

**'పోలీసు అక్క'** కేజీబీవీల్లో సాధారణంగా పేద విద్యార్థులుంటారు. తల్లిదండ్రులులేని అనాథలో, తల్లో తండ్రో ఎవరో దూరమైనవారో, వివిధ కారణాలతో డ్రాపవుట్‌గా నిలిచినవారు... ఇలాంటి వారికి ప్రాధాన్యమిస్తుంటారు. ఇలాంటి చోట్ల వారు వేధింపులకు గురవ్వకుండా ప్రతి కేజీబీవీకి ఒక పోలీసు కానిస్టేబుల్‌ను కేటాయించారు. ఆమె ఓ అక్కల వారంలో ఒకరోజు వాళ్లతో కలిసి తినడం, నిద్రించడం చేస్తారు. ఇలా వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారు. ఈవ్ టీజింగ్, ఇతర వేధింపులపై అవగాహన కల్పిస్తున్నారు. మానసిక ధైర్యం అందించడంతో పాటు అవసరాన్ని బట్టి కౌన్సెలింగ్ చేస్తారు. వారు భవిషత్తు లక్ష్యాలపై దృష్టి పెట్టేలా మార్గనిర్దేశం చేస్తారు.



**అవకాశమిస్తే అద్భుతాలు చూడొచ్చు:**

ఆడవాళ్లను తక్కువగా చూడొద్దు. సహకారం అందించగలిగితే ఎన్ని కఠిన పరిస్థితులు ఎదురైనా వారు రాణించగలుగుతారు. మా టీం సివంగి, పోలీసు అక్క, నారీశక్తి కార్యక్రమాలే దీనికి నిదర్శనం. కేవలం ఉద్యోగుల కాకుండా రక్షకులుగా ఎదిగేందుకు, స్వావలంబనతో నాయకత్వ ప్రదర్శన చేపట్టేందుకు వారికి అవకాశం కల్పించాం. దాన్ని అందిపుచ్చుకుంటున్నారు. పోలీసుల దుస్తుల్లో ఉన్న మహిళలను చూస్తే సమాజంలో భరోసా పెరుగుతుంది. నిర్భయంగా, స్వేచ్ఛగా తమ సమస్యలు చెప్పు కొనేందుకు ముందు కొస్తారు. నేరరహిత సమాజ నిర్మాణంలో ఇది అవసరమని బలంగా నమ్ముతున్నా. మహిళా పోలీసుల శక్తిని చాటి చెప్పాలనుకున్నా. □

# చుండ్రుతో చిక్కులా?



ఏ కాల మైనా ఇబ్బంది పెట్టే సమస్య ఏదంటే చుండ్రే గుర్తొస్తుంది. దీనికి కాలుష్యం, చలి, పదార్థాల్లో రసాయ నాలు... ఇలా కారణాలు. షాంపూలతో ప్రయోజనం లేదా... సహజమైనవి చూడండి. చలివేళ తలస్నానం చేయాలి అనిపించదు కానీ... వారానికి రెండుసార్లయినా తప్పక చేయాల్సిందే. లేదంటే మాడు మీద దుమ్ము పేరుకునిపోయి ఇన్ఫెక్షన్‌కి దారి తీస్తుంది. కాబట్టి... వేపాకు, కలబంద, మెంతులను ఒక గ్లాసు నీటిలో పదినిమిషాలు మరిగించి, నీటిని వడకట్టండి. ఆపై ఆ నీటిలో షాంపూ కలిపి తలస్నానం చేయాలి. జుట్టు మెత్తగామారుతుంది, చుండ్రు బెడద తప్పుతుంది. తలకు నూనె పెట్టి, ఆపై తలస్నానం చేస్తే... కురులకు వచ్చే మెరుపే వేరు. కానీ చుండ్రు ఉన్నప్పుడు నూనె పెడితే సమస్య పెద్దది అవుతుందని భయం. అలాంటప్పుడు పావుకప్పు కొబ్బరినూనెకు అరచెంచా టీట్రీ ఆయిల్ కలిపి తలకు పట్టించండి. అరగంటయ్యాక తలస్నానం చేస్తే సరి. కురులకు పోషణ అందుతుంది, టీట్రీఆయిల్‌లోని యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చుండ్రుకి చెక్ పెడ తాయి. ఇదే కాదు... లావెండర్, రోజెమెరీ, పెప్పర్మెంట్ నూనెలను ప్రయత్నించినా కోరుకున్న ఫలితం దక్కుతుంది. పైగా ఇవి మనసునీ తేలికపరు స్తాయి. కలబంద గుజ్జులోనూ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్ గుణాలెక్కువే ఇవి మాడు ఆరోగ్యాన్ని సంరక్షి స్తాయి. తలస్నానానికి అరగంట ముందు కలబంద గుజ్జును మాడు నుంచి కురుల వరకు పట్టిస్తే సరి. లేదంటే తలస్నానం పూర్తయ్యాక మగ్గులో కప్పుచొప్పున నీళ్లు, యాపిల్ సిడార్ వినెగర్ తీసుకుని ఆ మిశ్రమాన్ని తలపై పోసుకోవాలి. అయిదు నిమిషాలు మృదువుగా మర్దన చేసి, గోరువెచ్చని నీటితో కడిగేసినా చుండ్రు బాధ తగ్గుతుంది. పోషకాహారం తీసుకోకపోవడం, సరిగా నీళ్లు తాగకపోవడం, ఒత్తిడి కూడా చుండ్రు సమస్యను పెంచేవే కాబట్టి, వీటిపైనా దృష్టి పెట్టాలి.

# రెండు వైపులా కడిగేయొచ్చు..





సీసాల్లో పచ్చకు భద్రపరచుకోవడం బాగుంటుంది. కానీ వాటిని కడగటం మాత్రం చాలా కష్టమే. అందుకోసం బ్రష్లు ఉన్న మాట నిజమే అయినా పేరుకున్న జిడ్డు, ఒక పట్టాన వదలవు ఈ ఇబ్బందిని తప్పించుకోవడానికి వచ్చే రెండు వైపులా బ్రష్ ఉన్న గ్లాస్ వాషర్, దట్టంగా ఉన్న సీసా లోపలే కాకుండా.. బయట కూడా క్షణాల్లో శుభ్రం చేస్తుంది. ఇది పీవీసీ మెటీరియల్ తయారైనందున ఎక్కువకాలం మన్నుతుంది. మరీ మెత్తగా లేదా గట్టిగా లేనందున.. తేలిగ్గా సంగమిస్తుంది. వాటర్ బాటిల్స్ టీ కెటిలీను కూడా దీనితో తేలిగ్గా కడిగేయొచ్చు. □

# యేసులా మనం ప్రేమించాలి..



'గనుక **యేసు వచ్చి ఆ** గొప్ప జనసమూహమును చూచి, వారు కాపరిలేని గొఱ్ఱెలవలె ఉన్నందున వారిమీద కనికరపడి, వారికి అనేక సంగతులను వారికి బోధింపసాగెను' (మార్కు 6:34). యేసుక్రీస్తు తాను సృష్టించిన మానవుడిని ఎంతో ప్రేమిస్తున్నాడు. ఏదేను తోటలో మొదటి మానవుడు ఆదాము, హవ్వలు పాపం చేసినప్పుడు దేవుడు వారిని ఆ తోట నుంచి బయటకు పంపిస్తున్నప్పుడు వారికి చర్మపు చొక్కాలను చేసి, వారిని బయటకు పంపించివేసాడు. అదే మానవుడికి కోసం యేసుక్రీస్తు సిలువలో మరణించాడు. ఇదే మానవుడి కోసం ప్రభువు రెండవసారి రానై ఉన్నాడు. దేవుడు ప్రేమాస్వరూపీ. ఆయన ప్రేమను వర్ణించేందుకు భాష చాలదు. సిలువలో ఘోరంగా, అవమానకంగా మరణించాడు. మన పాపం కోసం ఆయన తన ప్రతి రక్తపు బిందువును కార్చాడు. ప్రజలు కాపరిలేని గొఱ్ఱెలని చూసి, వారిపై కనికరపడ్డాడు. తనవద్దకు స్వస్థత పొందేందుకు నిత్యం వేలాదిమంది వచ్చేవారు. ప్రభువు ఎవరినీ తృణీకరించలేదు. వచ్చినవారంతా స్వస్థత పొంది వెళ్లారు. మరణించిన లాజరును, ఓ విధవరాలి కుమారుడిని, 12 సంవత్సరాల బాలికను తిరిగి ప్రాణాలతో బతికించారు. నేటి కాపరులలో చాలామందికి యేసుక్రీస్తు మనసు లేదు. సంఘ కాపరి సంఘాన్ని మేపాలి. కానీ సంఘం ద్వారా తాను మేపబడాలని చాలామంది సేవకులు కోరుకుంటున్నారు. ఇది సంఘకాపరి లక్షణం కాదు. అందుకే పేతురుతో యేసుక్రీస్తు నా గొఱ్ఱెలను మేపు అని ఒకసారి, నా గొఱ్ఱెలను కాయి అని మరోసారి అన్నాడు. అంటే గొర్రెపిల్లలకు కానీ పెద్దవాటికి గాని తినిపించాలి, క్రూరమృగాల నుంచి కాపాడాలి. అంటే సంఘాన్ని సేవకుడు ఆత్మీయ ఆహారాన్ని ఇవ్వడమే కాదు, వారికి తగిన భద్రతను కూడా కల్పించాలి. అంటే వారి కష్టాల్లో ఆదుకునేవారుగా ఉండాలి. నేటి చాలామంది కాపరులు ఏమీ లేనివారుగా వచ్చి, కోట్లాది రూపాయలను సంపాదించుకుంటున్నారు. దేవుడి పేరుతో వ్యాపారం చేస్తున్నారు. కానీ యదార్థంగా తమవద్దకు వచ్చే విశ్వాసులను ప్రేమతో ఆదరిస్తూ, ధనంపై కాక, క్రీస్తు ప్రేమను బట్టి విశ్వాసులను ఆధ్యాత్మికంగా బలపరుస్తున్న సేవకులు ఉన్నారు. ఇలాంటి వారి సేవే చివరివరకు మిగులుతుంది.

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

## చలిలో చేతులకు జాగ్రత్తలు:

- ★ రాత్రి సమయాల్లో గోరువెచ్చని అలివ్‌నూనెతో చేతుల్ని అర చేతుల్ని మర్దించండి. చేతులు అరచేతులు సున్నితంగా మృదువుగా ఉంటాయి.
- ★ అరచేతులకు కొబ్బరి నూనెగాని, గ్లిజరిన్, రోజ్‌వాటర్ మిశ్రమంతో గాని మర్దనం చేయండి.
- ★ ఒక టేబుల్ స్పూన్ మిల్క్‌క్రీం కొన్ని చుక్కల గ్లిజరిన్ ఆలివ్ అయిల్ పన్నీరు మిశ్రమంతో చేతులనుమర్దన చేయండి. చేతులు సున్నితంగా నాజుకుగా వుంటాయి.

చెలి చిట్కాలు

# పెసరపప్పు రుచులు

పెసరపప్పుతో ఏం చేసినా.. ఎంత కమ్మటి వాసనో? కంది, శనగపప్పుల్లా గంటల కొద్దీ ఉడికించాల్సిన అవసరం లేదు. అలాగని పోషకాలకు తక్కువ కాదు. తడకా, చారు, చెట్నీ సూప్, సలాడ్, చిల్లా, వడ, పకోడీ, బజ్జీ, సమోసా, కిచిడీ, పరోటా, పెసరట్టు, కోసాంబరి, పాయసం, తీర్, లడ్డూ.. అబ్బో దీనికి ఎన్ని వంటలైనా చేయొచ్చు. పొట్ల, బీర, క్యాబేజ్, క్యాలీఫ్లవర్... దేనికి జోడించినా రుచి వేరు. పెసరపప్పుతో సూపర్ టేస్టీ రెసిపీలు మీ కోసం...

## సూప్ మూంగ్ దాల్



**కావలసినవి:** పెసరపప్పు అర కప్పు, నూనె టేబుల్‌స్పూన్, దాల్చినచెక్క అంగుళం ముక్క పసుపు పావు చెంచా, ఉప్పు రుచికి సరిపడా, లవంగాలు 3, ఎండుమిర్చి2, ఆవాలు, జీలకర్ర, జీలకర్రపొడి, ధనియాలపొడి అర చెంచా చొప్పున, కారం ముప్పావు చెంచా, నిమ్మరసం కొత్తరసం తరుగు చారెడు

**తయారీ** పెసరపప్పును అరగంట నానబెట్టి అందులో నీళ్లు వంపేసి పక్కనుంచాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక ఆవాలు.. అవి చిటపటలాడు తున్నప్పుడు దాల్చినచెక్క, లవంగాలు, జీలకర్ర, ఎండుమిర్చి వేయాలి. అరనిమిషం తర్వాత.. నానిన పెసరపప్పు, జీలకర్రపొడి, ధనియాలపొడి, కారం వేసి కలియతిప్పాలి. కొన్ని నీళ్లు కలిపి మూత పెట్టాలి. మధ్యలో కలియబెడుతూ. తినాలి. ఏడెనిమిది నిమిషాల తర్వాత కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేసి దంచితే ఘుమఘుమలాడే సూబీ మూంగ్‌బల్ సిద్ధం. ఇది అన్నం, రోటీ ఎందులోకైనా బాగుంటుంది.

## హల్వా..



**కావలసినవి:** పెసరపప్పు, పంచదార, నెయ్యి కప్పు చొప్పున, బొంబాయిరవ్వ, శనగపిండి రెండు టేబు ల్స్పూన్ల చొప్పున, కుంకుమపువ్వు కొద్దిగా, యాలకుల పొడి అర చెంచా, పిస్తా, బాదం పప్పుల పలుకులు పావు కప్పు చదువు

**తయారీ:** పెసర పప్పును రెండు గంటలు నానబెట్టి, నీళ్లు వడకట్టేసి కాస్త బరకగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఒక పాత్రలో కప్పు నీళ్లు, పంచదార, యాలకుల పొడి, కుంకుమపువ్వు వేసి మూడు నిమిషాలు మరిగించి దించాలి. ప్యాన్‌లో నెయ్యి వేడయ్యాక పిస్తా, బాదం పప్పుల పలుకులు, శనగపిండి, బొంబాయిరవ్వలను మంచి వాసన వచ్చేదాకా వేయించాలి. అందు గ్రైండ్ చేసిన పెసరపప్పు జోడించి వేయించాలి. అది బంగారు రంగులోకి మారాక.. పంచదార పాకం జోడించి కలియతిప్పుతుండాలి. మిశ్రమం నుంచి నెయ్యి విడిపోయిందంటే హల్వా తయారైనట్లు. మహా సులువుగా పూర్తయ్యే ఈ మిఠాయి రుచికి మాత్రం తగ్గేదే లేదన్నట్టుంటుంది.

## మూంగ్లెట్ ..



**కావలసినవి.** పెసరపప్పు అర పావు, మినపప్పు టేబుల్‌స్పూన్, వెన్న నాలుగు చెంచాలు, పెద్ద ఉల్లిపాయ, క్యారెట్, క్యాప్సికం ఒకటి చొప్పున, పచ్చిమిర్చి 2, ఉడికించిన స్వీట్‌కార్న్ రెండు టేబుల్‌స్పూన్లు, అల్లం రెండు చిన్న ముక్కలు, ఉప్పుకి సరిపడా, వంట సోడా అర చెంచా, మిరియాల పొడి, కారం చెంచా చొప్పున, టాపింగ్ కోసం: కొత్తిమీర తరుగు, బీట్రూట్ చీలికలు, అల్లం తరుగు

**తయారీ:** పెసరపప్పును ఓ గంట నానబెట్టి.. అల్లం, పచ్చిమిర్చి, కొన్ని నీళ్లు జోడించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పిండిని ఒక పాత్రలోకి తీసి బీట్ చేసి, రెండు గంటలు పులియబెట్టాలి. అందులో తరిగిన ఉల్లి, క్యారెట్, క్యాప్సికం, ఉడికించిన స్వీట్‌కార్న్, వంట సోడా, మిరియాల పొడి, కారం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో అమ్లెట్ వేసి, కొత్తిమీర తరుగు, బీట్రూట్ చీలికలు, అల్లం తరుగులను చల్లాలి. అంతే.. మూంగ్లెట్ లేదా మూంగ్బాల్ వెజ్ ఆమ్లెట్ తిని ఆనందించడమే తరువాయి.

## మురుకులు ..



**కావలసినవి:** పెసరపప్పు ముప్పావు కప్పు, బియ్యప్పిండి కప్పున్నర, వెన్నరెండు టేబుల్ స్పూన్లు, నువ్వులు 2 చెంచాలు, జీలకర్ర చెంచా, ఉప్పు రుచికి తగినంత, కారం అర చెంచా, ఇంగువ చిటికెడు, నూనె వేయించేందుకు సరిపడా

**తయారీ:** ముందుగా పెసరపప్పును దొరగా వేయించి కప్పున్నర నీళ్లతో ఉడికించాలి. ఆ మెత్తటి పేస్టును మిక్సింగ్ బౌల్లోకి తీసి., బియ్యప్పిండి, కారం, ఉప్పు, వెన్న, ఇంగువ, నువ్వులు, జీలకర్ర వేసి.. పావు కప్పు నీళ్లు కూడా కలిపి.. ఉండలు కట్టకుండా మెత్తగా అయ్యేలా కలపాలి. ఈ పిండిని మురుకుల పావులో పెట్టి.. కాగుతున్న నూనెలోకి ఒత్తుకోవాలి. వాటిని రెండు వైపులా బంగారు రంగు వచ్చేదాకా వేయిస్తే సరి.. రుచికరమైన పెసర మురుకులు తయారైపోతాయి.

## కబాబ్..



**కావలసినవి:** పెసరపప్పు అర గ్లాసు, గోధుమ రొట్టె మూడు స్లైసులు, కరివేపాకు నాలుగు రెబ్బలు, కొత్తిమీర తరుగు పావు కప్పు, మొక్కజొన్న పిండి టేబుల్‌స్పూన్, ఉప్పు రుచికి తగినంత, గరం మసాలా, కారం చెంచా చొప్పున, జీలకర్ర పొడి అర చెంచా, నిమ్మరసం ఒకటిన్నర చెంచా, నూనె వేయించడానికి. సరిపడా **తయారీ:** బ్రెడ్ను తుంచి పొడి చేయాలి. పెసరపప్పును కడిగి, మూడు గంటలు నానబెట్టాలి. ఆ నీళ్లు తీసేసి వేరే నీళ్లు పోసి ఐదు నిమిషాలు ఉడికించాలి. అందులో బ్రెడ్ పొడి, మొక్కజొన్న పిండి, కరివేపాకు, కొత్తిమీర తరుగు, గరం మసాలా, కారం, ఉప్పు, నిమ్మరసం వేసి కలపాలి. మరీ గట్టిగా ఉంటే కొద్దిగా నీళ్లు జోడించవచ్చు. ఈ మిశ్రమంతో చిన్న స్థూపాల్లా చేయాలి. అన్నీ అయ్యాక. కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చేదాకా వేయిస్తే వహ్వా అనిపించే మూంగ్ దాల్ కబాబ్‌లు రెడీ. □

## వన్డే, టి-20ల్లో..
# సిక్సర్ తెలియని స్టార్స్
## ఒక్కటి కూడా కొట్టని ప్లేయర్స్

**న్యూఢిల్లీ:** వన్డే, టీ20 క్రికెట్ అంటేనే సిక్సర్లు, ఫోర్లు కొట్టడం. అటువంటి ఈ ఫార్మాట్లలో ఇప్పటివరకు ఒక్క సిక్స్ కూడా కొట్టని టీమిండియా ప్లేయర్లు కూడా ఉన్నారు. వన్డే, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక్క సిక్స్ కూడా కొట్టని ముగ్గురు దిగ్గజ భారత క్రికెటర్లు ఉన్నారు. టీమిండియా చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ భారత జట్టు తరపున టెస్ట్, వన్డే, టీ20 అంతర్జాతీయ




క్రికెట్ మూడు ఫార్మాట్లలో ఆడుతున్నాడు. టెస్ట్ క్రికెట్‌తో తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ప్రారంభించిన కుల్దీప్ ఇంకా వన్డే, టీ20లలో ఒక్క సిక్స్ కూడా కొట్టలేదు. కుల్దీప్ యాదవ్ వన్డేలలో 113 మ్యాచ్‌లు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 40 మ్యాచ్‌లు ఆడాడు. అలాగే యుజ్వేంద్ర చాహల్ 2016లో భారత జట్టు తరపున వన్డేల్లో అరంగేట్రం చేశాడు. అప్పటి నుంచి చాహల్ బ్యాటింగ్ కోసం తనకు లభించిన అన్ని బంతుల్లోనూ సిక్స్ కొట్టలేకపోయాడు. అతను ఇప్పటివరకు టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 13 బంతులు ఆడాడు. వన్డేల్లో 141 బంతులు ఎదుర్కొన్నాడు. మరో ప్రత్యేకత ఏమిటంటే చాహల్ లిస్ట్ ఏ, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మొత్తం 3 సిక్స్‌లు కొట్టాడు. అతను ఒడిఐ, టి20లలో కలిపి మొత్తం 152 మ్యాచ్‌లు ఆడాడు. అతనికి ఇంకా టెస్ట్‌లలో అవకాశం రాలేదు. యుజ్వేంద్ర చాహల్ ఆగస్టు 2023లో భారత జట్టు తరపున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ప్రస్తుతం టీమ్ ఇండియాకు దూరంగా ఉన్నాడు. ఇక ఇషాంత్ శర్మ ఇప్పటివరకు భారత జట్టు తరపున టీ20 అంతర్జాతీయ, వన్డే క్రికెట్‌లో ఒక్క సిక్స్ కూడా కొట్టలేదు. ఇషాంత్ ప్రస్తుతం భారత్ తరపున ఏ ఫార్మాట్‌లోనూ క్రికెట్ ఆడటం లేదు. 2007లో భారత జట్టు తరపున టెస్ట్ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన ఇషాంత్, పొడవైన ఫార్మాట్‌లో ఒకసారి కూడా సిక్స్ కొట్టాడు. అతను ఇప్పటివరకు టెస్ట్ క్రికెట్‌లో 2568 బంతులు ఆడాడు. అందులో తన పేరు మీద అర్ధ సెంచరీని కలిగి ఉన్నాడు. మూడు ఫార్మాట్‌లను కలిపి, మొత్తం 199 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. ఇషాంత్ శర్మ నవంబర్ 2021లో భారత జట్టు తరపున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ప్రస్తుతం టీమిండియాకు దూరంగా ఉన్నాడు.




### ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్:
# భారత్ షూటర్లు అద్భుత ప్రదర్శన
## ఐశ్వరీ, సిఫ్ట్‌కౌర్, ఎలావెనిల్‌లకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** భారత షూటర్లు గత కొన్ని సంవత్సరాలుగా అంతర్జాతీయ సర్క్యూట్‌లో అద్భుతమైన విజయాన్ని ప్రదర్శించారు. ఇప్పుడు వారు కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో శనివారం జరిగిన 2025 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, సిఫ్ట్ కౌర్ సమ్రా, ఎలావెనిల్ వలరివన్ స్వర్ణ పతకాలను సాధించారు. దీంతో భారత్ ఖాతాలో 30కి పైగా పతకాలు చేరి షూటర్లు తమ ఆధిపత్యాన్ని పునరుద్ఘాటించారు. 14 స్వర్ణాలు, 8 రజతాలు, 9 కాంస్య పతకాలతో 31 భారీ పతకాల రికార్డుతో భారతదేశం ఈ ఖండాంతర పోటీలలో తమ అత్యుత్తమ పతకాల సంఖ్యను నమోదు చేసింది. పతకాల పట్టికలో చైనా తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. భారతదేశం చాలా కాలంగా రైఫిల్ షూటింగ్‌కు గుర్తింపు పొందింది. కానీ ఇటీవలి సంవత్సరాలలో కొంత అసమానత కనిపించింది. అయితే, ఈ ఈవెంట్‌లో రైఫిల్ ఈవెంట్లలో వారు ఆరు బంగారు పతకాలను సాధించడం బలమైన ప్రదర్శనగా నిలిచింది. అదనంగా, ఈ ఆరు బంగారు పతకాలలో నాలుగు ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ (50 మీ 3 పి), సిఫ్ట్ కౌర్ సమ్రా (50 మీ 3 పి), ఎలావెనిల్ వలరివన్ (ఎయిర్ రైఫిల్) మరియు ఎయిర్ రైఫిల్ మిశ్రమ జట్టు గెలుచుకున్న ఒలింపిక్స్ విభాగాలలో ఉన్నాయి. మిగతా రెండు బంగారు పతకాలు ఎయిర్ రైఫిల్ పురుషుల జట్టు మరియు మహిళల 50 మీటర్ల 3 పి జట్టు దక్కించుకున్నాయి.

# ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో రచ్చ రచ్చ
## సౌత్ ఢిల్లీపై 7 వికెట్ల తేడాతో వెస్ట్ ఢిల్లీ విక్టరీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2025 ఎలిమినేటర్ మ్యాచ్‌లో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్, వెస్ట్ ఢిల్లీ లయన్స్ మధ్య తీవ్రమైన గొడవ జరిగింది. క్రిష్ యాదవ్ అవుట్ అయిన తర్వాత ఇరు జట్ల ఆటగాళ్ళు ఒకరిపై ఒకరు దూసుకెళ్లారు. వెస్ట్ ఢిల్లీ లయన్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించి క్వాలిఫయర్ 2కు చేరుకుంది. సౌత్ ఢిల్లీ, వెస్ట్ ఢిల్లీ మధ్య మ్యాచ్‌లో పెద్ద గొడవ జరిగి ఇరు జట్లకు చెందిన ఇద్దరు ఆటగాళ్లు ఒకరిపైకి ఒకరు దూసుకెళ్లారు. 11వ ఓవర్‌లో 202 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వెస్ట్ ఢిల్లీ లయన్స్ ఓపెనర్ క్రిష్ యాదవ్ అమన్ భారతి బౌలింగ్‌లో అవుట్ అయిన తర్వాత ఈ రచ్చ జరిగింది. 11వ ఓవర్ తొలి బంతికి పేసర్ భారతిని లాంగ్‌ఆఫ్ కోసం సిక్స్ కొట్టడానికి క్రిష్ ప్రయత్నించాడు. అయితే సరిగ్గా టైమ్ కాకపోవడంతో బౌండరీ రోప్ దగ్గర అన్మోల్ శర్మ చేతిలో క్యాచ్ అవుట్ అయ్యాడు. ఆ సమయంలోనే రెండు వైపుల ఆటగాళ్లు ఒకరినొకరు తోసుకుంటూ తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సూపర్‌స్టార్జ్ తరపున కీలకమైన వికెట్ తీసుకున్న ఈ పేసర్, అవుటైన బ్యాటర్ వైపు చూస్తూ ఏదో అన్నాడు. దాంతో క్రిష్ యాదవ్ వికెట్ దగ్గరకు తిరిగి వచ్చి కొన్ని మాటలతో ఎదురుదాడికి దిగాడు. సూపర్ స్టార్స్‌కు చెందిన సుమిత్ మాథుర్ క్రిష్ వైపు దూసుకుపోతూ వేలు చూపిస్తూ ఏదో అన్నాడు. పరిస్థితి చాలా తీవ్రంగా మారడంతో వెస్ట్ ఢిల్లీ కెప్టెన్ నితీష్ రాణా ఆన్‌ఫీల్డ్ అంపైర్లతో కలిసి జోక్యం చేసుకుని సుమిత్, క్రిష్ లను విడదీయాల్సి వచ్చింది. లేడీ అంపైర్ క్రిష్‌ను ఫీల్డ్ నుంచి వెళ్లిపోవాలని కోరగా, నితీష్ రాణా సుమిత్ భుజం చుట్టూ చేయి వేసి వెనక్కి తీసుకెళ్లడంతో గొడవ సద్దుమణిగింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే నితీష్ రాణా నేతృత్వంలోని జట్టు 202 పరుగుల లక్ష్యాన్ని ఇంకా 17 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. కెప్టెన్ 55 బంతుల్లో 8 ఫోర్లు, 15 సిక్సర్లతో అజేయంగా 134 పరుగులు చేయడంతో ఈ విజయం సాధ్యమైంది. ఎడమచేతి వాటం రాణా 243.64 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. అంతకుముందు కెప్టెన్, వికెట్ కీపర్‌బ్యాటర్ తేజస్వి దహియా 60 పరుగులతో చెలరేగడంతో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ నిర్ణీత ఇరవై ఓవర్లలో 201/5 పరుగులు చేసింది.




## కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# మెహాక్, లవ్‌ప్రత్‌కు రజతం, కాంస్యం




**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ వెయిట్ లిఫ్టర్లు రజతం, కాంస్యంతో ముగించారు. దీంతో ఈ ఛాంపియన్‌షిప్‌లో 13 పతకాలతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. సీనియర్ కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో చివరి రోజు శనివారం భారత వెయిట్‌లిఫ్టర్లు హెవీవెయిట్ విభాగాలలో రెండు పతకాలు సాధించారు. మెహక్ శర్మ (86+ కిలోలు) మరియు లవ్‌ప్రీత్ సింగ్ (110+ కిలోలు) వరుసగా రజత మరియు కాంస్య పతకాలను గెలుచుకున్నారు, దీనితో భారత పతకాల సంఖ్య 13కి చేరుకోగా, ఇందులో 4 స్వర్ణాలు, 6 రజతాలు మరియు 3 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇక మీరాబాయి చాను (48 కిలోలు), రిషికాంత సింగ్ (60 కిలోలు), అజిత్ నారాయణ (71 కిలోలు), మరియు అజయ బాబు (79 కిలోలు) అనే నలుగురు బంగారు పతక విజేతలు 2026 కామన్వెల్త్ క్రీడలకు తమ స్థానాలను నిర్ధారించుకోవడంతో భారతదేశం నైజీరియాను అధిగమించి అగ్రస్థానంలో నిలిచింది. అలాగే చివరి రోజు పురుషుల 110 కిలోల ఫైనల్‌తో ప్రారంభమైంది. ఇక్కడ హార్చరణ్ సింగ్ కేవలం 1 కిలోల తేడాతో పతకాన్ని కోల్పోయాడు. మొత్తం 355 కిలోలు ఎత్తి ఫిజియన్, సమోవాన్ మరియు న్యూజిలాండ్ వెయిట్‌లిఫ్టర్ల కంటే నాల్గవ స్థానంలో నిలిచాడు. ఆ తర్వాత, భారతదేశపు సూపర్ హెవీవెయిట్ జాతీయ రికార్డు హోల్డర్ మెహక్ శర్మ మైదానంలోకి ప్రవేశించి, తన జాతీయ రికార్డులను తిరగరాసి, వ్యక్తిగత ఉత్తమ మొత్తం 253 కిలోల ఎత్తి రజత పతకాన్ని సాధించింది.

## హాకీ ఆసియా కప్‌లో..
# బంగ్లాదేశ్‌ను ఓడించిన మలేసియా
## కొరియా చేతిలో చైనీస్ తైపీ చిత్తు




**న్యూఢిల్లీ:** హాకీ ఆసియా కప్-2025, తొలి మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్‌ను మలేషియా ఓడించగా, కొరియా చేతిలో చైనీస్ తైపీ చిత్తయింది. పురుషుల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో మలేషియా, డిఫెండింగ్ ఛాంపియన్స్ దక్షిణ కొరియా తమ పూల్ బి ప్రచారాలను విజయాలతో ప్రారంభించాయి. అయితే విభిన్న శైలిలో ప్రపంచ 12వ ర్యాంక్ మలేషియా తొలి దశలో వెనుకబడినా, తదుపరి కోలుకుని 29వ ర్యాంక్ ఉన్న బంగ్లాదేశ్‌ను 4-1 తేడాతో ఓడించింది. అలాగే హోల్డర్ కొరియా ఏకపక్ష పోటీలో చైనీస్ తైపీని 7-0 తేడాతో చిత్తు చేసింది. 16వ నిమిషంలో అష్రఫుల్ ఇస్లాం పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచినప్పుడు బంగ్లాదేశ్ ఆట ప్రారంభంలోనే స్కోరు చేసింది. అయితే, అష్రాన్ హంసాని చక్కటి ఫీల్డ్ గోల్‌తో జట్టు స్కోరును తిరిగి సాధించడంతో బంగ్లాదేశ్ ఆధిక్యం 25వ నిమిషం వరకు మాత్రమే కొనసాగింది. విరామం తర్వాత, మలేషియా గోల్ చేసింది. అఖిముల్లా అనువార్ (36) వారికి ఆధిక్యాన్ని అందించగా, ముహాజిర్ అబ్దుల్ రౌఫ్ (48), సయ్యద్ చోళన్ (54, పెనాల్టీ కార్నర్) ఆధిక్యాన్ని పెంచి 3 పాయింట్లు సాధించారు. మలేషియా వారి 4 పెనాల్టీ కార్నర్లలో ఒకదాన్ని గోల్‌గా మార్చగా, బంగ్లాదేశ్ వారి 2కార్నర్లలో ఒకదాని నుండి గోల్ చేసింది. తరువాత, దక్షిణ కొరియా డైన్ సన్ హ్యాట్రిక్ (17, 29, 58)తో ఆధిక్యాన్ని ప్రదర్శించగా, జిహున్ యాంగ్ పెనాల్టీ కార్నర్‌ల ద్వారా (27, 50) రెండుసార్లు గోల్స్ చేశాడు. సెయోంగ్ ఓహ్ (53) మరియు యూన్హో కాంగ్ (54) స్కోరు రేఖకు మరింత మెరుపులు జోడించారు. చివరి నిమిషాల్లో సన్ తన ట్రెబుల్‌ను పూర్తి చేయడంతో కొరియా 7-0 తేడాతో ఓటమి పాలైంది.

# రూ.లక్ష దాటిన తులం బంగారం



**ముంబయి, ఆగస్టు 30:** దేశంలో బంగారం ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. తగ్గినట్లే తగ్గి ఒక్కసారిగా రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. తులం బంగారం ధర ఇప్పుడు లక్షా 5 వేల రూపాయల వరకు ఉంది. స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతుండటంతో బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పసిడి ధరలు ఊగిసలాడుతున్నాయి. శనివారం మధ్యాహ్నం సమయానికి బంగారం ధరల్లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. తులం బంగారంపై ఏకంగా 1640 రూపాయలు పెరిగింది. దీని బట్టి చూస్తే ఇంకా ఎంత పెరుగుతుందో ఊహించవచ్చు. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం ధర రూ.1640 పెరిగి 1,04,950కు చేరుకుంది. అంటే దాదాపు రూ.లక్షా 5వేల వద్ద నమోదైనట్లే. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధరపై రూ.1200 పెరిగి 96,200 రూపాయల వద్ద ఉంది. ఇక వెండి విషయానికొస్తే ఇది కూడా నేనెందుకు తగ్గాలి అన్నట్లు 1100 రూపాయలు పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి ధర 1,21,000 ఉంది. ఇక హైదరాబాద్, కేరళ, చెన్నై నగరాల్లో అయితే మరింత ఎక్కువగా ఉంది. ఇక్కడ కిలో సిల్వర్ ధర 1,31,000 ఉంది. బంగారం ధరల పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని బులియన్ నిపుణులు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి పెరగడం, డాలర్ విలువలో మార్పులు రావడం, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం డిమాండ్ అధికంగా ఉండటం ఇవన్నీ ప్రధాన కారణాలు అని చెబుతున్నారు. అంతేకాదు ద్రవ్యోల్బణం పెరిగిన సందర్భాల్లో చాలా మంది పెట్టుబడిదారులు బంగారం వైపు మళ్లడం వల్ల ధరలు ఇంకా ఎగబాకుతున్నాయి. ఇక రానున్న పండుగ సీజన్‌లో భారత్‌లో బంగారం డిమాండ్ మరింత పెరుగుతుందని అంచనా.



## సెప్టెంబరు నుంచి
# వెండిపైనా హాల్‌మార్క్!


**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** ఈ ఏడాది సెప్టెంబరుమాసం ప్రారంభంలోనేసామాన్యులకు అనేక కొత్త మార్పులను తీసుకువస్తోంది. ఈ మార్పులు గృహ ఖర్చులు, బ్యాంకింగ్, పెట్టుబడి, రోజువారీ అవసరాలకు సంబంధించినవి. సెప్టెంబర్ 1 నుండి అమలు చేయబోయే 5 ప్రధాన మార్పు ముఖ్యమైనవే ఉన్నాయి. ఇప్పటివరకు బంగారు ఆభరణాలపై మాత్రమే హాల్‌మార్కింగ్ అనే నియమం ఉండేది. కానీ సెప్టెంబర్ 1 నుండి ఈ నియమం వెండిపై కూడా వర్తిస్తుంది. అంటే ఇప్పుడు మీరు ఏ వెండి ఆభరణాలు లేదా పాత్రలను కొనుగోలు చేసినా దానికి ఖచ్చితంగా హాల్‌మార్క్ ముద్ర ఉంటుంది. ఇది వినియోగదారులకు స్వచ్ఛమైన నమ్మకమైన ఉత్పత్తులను అందిస్తుంది. నకిలీ వస్తువుల నుండి వారిని రక్షిస్తుంది. దేశంలోని అతిపెద్ద బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కార్డుదారులకు ఛార్జీలను పెంచాలని నిర్ణయించింది. కొత్త నిబంధనల ప్రకారం, ఒక కస్టమర్ ఆటోడెబిట్ విఫలమైతే అతనిపై 2శాతం జరిమానా విధించనుంది. దీనితో పాటు పెట్రోల్ పంపులలో అంతర్జాతీయ లావాదేవీలు, కార్డ్ చెల్లింపులకు మరిన్ని ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఆన్‌లైన్ షాపింగ్‌లో అందుకున్న రివార్డ్ పాయింట్ల విలువ కూడా తగ్గవచ్చు. సిలిండర్ ధరలు ప్రతి నెల ఒకటో తేదీన నిర్ణయిస్తారు. చమురు కంపెనీలు సెప్టెంబర్ 1న కొత్త ధరలను కూడా విడుదల చేస్తాయి. ఈ ధరలు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర, డాలర్, రూపాయి కదలికలపై ఆధారపడి ఉంటాయి. ధర పెరిగితే వంటగది బడ్జెట్ ఏటిఎం నుండి నగదు తీసుకోవడం ఖరీదైనదే. బ్యాంకింగ్ రంగం క్రమంగా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో అనేక బ్యాంకులు నుండి నగదు ఉపసంహారణపై కొత్త నియమాలను అమలు చేయనున్నట్లు ప్రకటించాయి. నిర్ణీత పరిమితి కంటే ఎక్కువ నగదు తీసుకుంటే వినియోగదారులు అధిక ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఇప్పుడు మీరు ఏటిఎం నుండి ఎప్పుడు ఎన్నిసార్లు డబ్బు తీసుకోవాలో ఆలోచించాల్సి ఉంటుంది. సెప్టెంబర్‌లో చాలా బ్యాంకులు తమ నీదీ పథకాలపై వడ్డీ రేట్లను సమీక్షిస్తాయి. ఇప్పటివరకు చాలా బ్యాంకులు 6.5శాతంనుండి 7.5శాతంవరకు వడ్డీని ఇస్తున్నాయి. ఇండియా పోస్ట్ రిజిస్టర్డ్ పోస్ట్‌ను స్పీడ్ పోస్ట్‌తో విలీనం చేయనున్నట్లు ప్రకటించింది. దీని తర్వాత సెప్టెంబర్ 01 నుండి పంపిన రిజిస్టర్డ్ మెయిల్ ఇప్పుడు నేరుగా స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతారు.




# ఎస్‌బ్యాంకులో ఎస్ఎంబిసి రూ.16వేల కోట్ల పెట్టుబడులు!

**ముంబయి, ఆగస్టు 30:** ప్రైవేటురంగంలోని ఎస్‌బ్యాంకు షేర్లు నాలుగుశాతంపెరిగాయి. సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్ప్ (ఎస్ఎంబిసి) అదనంగా 16 వేల కోట్లు బ్యాంకులో పెట్టుబడులుపెట్టేందుకు ముందుకువచ్చింది. అంతకుముందు ఇదేనెలలోనే 13,483 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చింది. బ్యాంకు స్టాక్స్ 4.66శాతంపెరిగి 19.55కు చేరింది. ఇంట్రాడేలో స్టాక్ 3.8శాతంపెరిగింది. బ్యాంకు షేర్లు రెండురోజులు పాటు నష్టాల్లో నడిచిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 3.5రెట్లు సగటున పెరిగాయి. 30 రోజుల రటేడింగ్ వాల్యూమ్‌నపు పరిశీలిస్తేభారీ పెరుగుదల నమోదుచేసింది. ఎస్‌బ్యాంకు మొత్తం మార్కెట్ విలువలు లక్ష కోట్లకు చేరువగా ఉన్నట్లు నిపుణులు అంచనావేస్తున్నారు. అదేవిధంగా జపాన్ ఆర్థికరంగ దిగ్గజం ఎస్ఎంబిసి బ్యాంకులో 16 వేల కోట్లు పెట్టుబడులుపెడుతోంది. యెన్ ఆధారిత బాండ్లరూపంలో 8500 కోట్లు రానున్నాయి. రెండుశాతం వడ్డీకే ఈ నిధులు అందచేసేందుకు నిర్ణయించింది. ఈక్విటీలో 7500 కోట్లు విదేశీ కరెన్సీ బదలీబాండ్ల రూపంలో ఈ పెట్టుబడులు ఉంటాయనితేలింది. ఎస్ఎంబిసి అంతకుముందు ఇచ్చిన13,500 కోట్లహామీతో బ్యాంకులో 20% వాటా సాధించగలుగుతోంది. ఎస్‌బిఐ కూడా బ్యాంకులో బాటాతో ఉంది. ఆర్బీఐ ఎస్ఎంబిసికి బ్యాంకులో 24.99 శాతం వాటా కొనుగోలుకు ఆమోదం తెలిపింది. జపాన్ బ్యాంకు భారత్‌లో తన విస్తరణ ప్రణాళికలను ఈ బ్యాంకులో పెట్టుబడులతో స్పష్టం అవుతోంది.

## మెహుల్‌చోక్సీ బెయిల్ తిరస్కరించిన
# బెల్జియం కోర్టు!



**బ్రస్సెల్స్, ఆగస్టు 30:** పంజాబ్‌నేషనల్ బ్యాంకు ను మోసంచేసిన కేసులో ఉద్దేశ్యపూర్వక ఎగవేత నిందితునిగా ఉన్న ఆభరణాల వ్యాపారి మెహుల్‌చోక్సీ బెయిల్ అభ్యర్థనను బెల్జియంలోని అప్పీల్స్ కోర్టు తిరస్కరించింది. ఇప్పటికే చోక్సీని భారత్‌కు అప్పగించే పిటిషన్ విచారణచేస్తున్న కోర్టుచోక్సీ బెయిల్‌ను తిరస్కరించింది. భారత్‌లోని సిబిఐ ఆయన బెయిల్‌పై అభ్యంతరాలు చెపుతూ పటిష్మైన ఆధారాలు చూపించింది. అంతకుముందే చోక్సీ అనేక దేశాలనుంచి తప్పించుకున్నారని, న్యాయ పరమైన విచారణను తప్పించుకునేందుకు ఇపుడు మళ్లీ ఇంకో దేశం పరారయ్యేందుకు బెయిల్‌కోరుతున్నారని వాదించింది. ఏప్రిల్‌లోనే బెల్జియంలో చోక్సీని సిబిఐ అభ్యర్థన మేరకు అరెస్టుచేసారు. అంతకుముందు బెల్జియంలోని సెస్సేషన్ కోర్టు చోక్సీ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈనెల 22న మరో బెయిల్‌పిటిషన్ దాఖలుచేసారు. ఆయన్ను హౌస్ అరెస్టుచేయడంపై అభ్యంతరాలు వ్యక్తంచేసారు. గృహనిర్బంధంలో ఉంచి మాపై నిఘా ఉంచారని చేసిన వాదనలను కూడా ఈవారంలోనే కోర్టు తిరస్కరించింది. 66 ఏళ్ల చోక్సీ గీతాంజలి గ్రూప్ అధినేత. ఇపుడు ఆయన్ను భారత్‌కు అప్పగించాలన్న సిబిఐ వాదనలను బెల్జియం కోర్టు విచారణచేస్తోంది. మరోసారి సెప్టెంబరు మధ్యస్తంలో కూడా విచారణకు రావచ్చని అంచనా. పంజాబ్‌నేషనల్ బ్యాంకును రూ.13వేల కోట్లు మోసం చేసిన కేసులో ఆభరణాల వ్యాపారి నీరవ్‌మోడీతోపాటు మెహుల్‌చోక్సీని కూడా సిబిఐ నిందితునిగా చేర్చింది.

# ఐదేళ్లలో రూ.1.66 లక్షలకోట్ల పెట్టుబడులు
## విస్తరణ బాటలో చమురు కంపెనీ ఐఓసి




వాణిజ్యం

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** ప్రభుత్వరంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వచ్చే ఐదేళ్లలో 1.66 లక్షలకోట్లను పెట్టుబడులుపెట్టేందుకు నిర్ణఇంచింది. ఈ పెట్టుబడులు చమురుశుద్ధి, ఇంధన మార్కెటింగ్, పెట్రోకెమికల్స్ వెంచర్స్, సహజవాయువు, పునరుత్పత్తి విద్యుత్ విభాగాల్లో ఉంటాయని చైర్మన్ అరవిందర్ సింగ్ సాహ్నీ వెల్లడించారు. కంపెనీ వాటాదారుల వార్షిక సదస్సు శనివారం జరిగింది. ప్రస్తుతం ముడి చమురుశుద్ధి సామర్థ్యం 80.75 మిలియన్ టన్నుల నుంచిసాలీనా 98.4 మిలియన్ టన్నులకు పెంచాలని నిర్ణయించింది. 2028నాటికి ఈ సామర్థ్యం పెరుగుతోంది. పానిపట్, గుజరాత్, బరౌని ప్రాంతాల్లోని ప్లాంట్లను ఈ సామర్థ్యం పెంపునకు వినియోగిస్తోంది. మొత్తం 22 వేల కిలోమీటర్ల మేర 21 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. కొత్త నిల్వ సౌకర్యం నేపాల్‌లో కూడా ఏర్పాటుచేయాలనినిర్ణయిస్తోంది. పెట్రోకెమికల్స్ సామర్థ్యం 4.3 మిలియన్ టన్నులనుంచి 2030 నాటికి 13 మిలియన్ టన్నులకు పెంచుతోంది. దిగుమతులను తగ్గించుకుని స్వయం సమృద్ధిపైనే ఫోకస్ పెడుతోంది. దేశవ్యాప్తంగా 40 వేలకుపైగా ఇంధన స్టేషన్లు ఉన్నాయి. ఈవీ ఛార్జర్లు, బ్యాటరీ స్వాపింగ్ పాయింట్లు సిఎన్‌జి ఎల్ఎన్‌జి యూనిట్లు అధికంగా ఉన్నాయి. ఐఓసి ఇప్పటికే ఇంధన పరివర్తన ప్రాజెక్టుల్లో 2.5 లక్షలకోట్లు కేటాయించింది. 2046కల్లా కర్బన ఉద్గారాలు లేని వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించింది. గ్రీన్ హైడ్రోజెన్, ఏవియేషన్ ఇంధనం, పునరుత్పత్తి విద్యుత్ కెపాసిటీని ఒక గిగావాట్‌నుంచి 18 గిగావాట్లకు మూడేళ్లలోనే పెంచాలనినిర్ణఇంచింది. ప్రస్తుతం సహజవాయు ఉత్పత్తి సాలీనా 7.9 మిలియన్ టన్నులు ఉంది. 21 రాష్ట్రాల్లో 49 కేంద్రాల్లో అన్వేషణ సాగుతోంది. రష్యా ఉక్రెయిన్ భౌగోళిక వివాదాలతో మధ్యప్రాచ్యంలో అనేక అడ్డంకులు వస్తున్నాయి. దీనికితోడు అమెరికానుంచి వస్తున్న సుంకాల అడ్డంకులు కూడా విస్తరణకు బ్రేకులు వేస్తునానయని తెలుస్తోంది.

# 4 స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో భారీ రిటర్నులు!

**ముంబయి, ఆగస్టు 30:** భారత్ స్టాక్ మార్కెట్లలో నాలుగు స్మాల్‌క్యాప్ స్టాక్స్ మంచి రిటర్నులు ఇచ్చాయి. బిఎస్ఇలో వారాంతంలోని ఇంట్రాడే ట్రేడింగ్‌లోనే భారీ మొత్తాలకు కొనుగోళ్లుచేసింది. ఈ నాలుగు సంస్థల షేర్లు భారీ స్థాయిలో పెరిగాయి. అపోలో మైక్రోసిస్టమ్స్, హెచ్‌బిఎల్ ఇంజనిరింగ్, షైలీ ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్, టైమ్స్‌గ్రూప్ ఇండియా షేర్లు మంచి రాబడులు సృష్టించినట్లు చెపుతున్నారు. 36 నుంచి 56శాతంవరకూ పెరిగినట్లు తేలింది. బిఎస్ఇ సెన్సెక్స్, స్మాల్‌క్యాప్‌సూచీలు వరుసగా ఒకటిశాతం, మూడుశాతం చొప్పున డౌన్ అయిన స్థితిలో ఈస్టాక్స్ భారీ వృద్ధినమోదుచేసాయి. అపోలో మైక్రో 12శాతంపెరిగి 271.60కి చేరింది. 34 మిలియన్ల వాటాలు చేతులుమారాయి. ఆగస్టులోనే 56శాతంపెరిగాయి. డిఆర్‌డిఒనుంచి 25.12 కోట్లమేర ఆర్డరు సాధించడంతో కంపెనీ ఆర్డరుబుక్ ప్రస్తుతం రూ.735 కోట్లుగా ఉంది.అలాగే షైయిలీ ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్ ఆరుశాతంపెరిగి 2230.15కు ఇంట్రాడేలో పెరిగాయి. కంపెనీ స్టాక్స్ 41శాతంపెరిగాయి. అలాగే హెచ్‌బిఎల్ ఇంజినీరింగ్ స్టాక్స్ కూడా ఐదుశాతంపెరిగి 819.80కి పెరిగాయి. హెచ్‌బిఎల్‌కంపెనీకి సర్వే, డిజైన్, సరఫరా, వ్యవస్థ ఏర్పాటు, టెస్టింగ్, ట్రాక్‌సైడ్ కవచ్ వ్యవస్థ ఏర్పాటుకు పశ్చిమమధ్యరైల్వే అంగీకార పత్రం ఇవ్వడంతో కంపెనీ షేర్లు జూమ్ అయ్యాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.